CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 63 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 9 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :63 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 9 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## 48 మంది ఎమ్మెల్యేలపై చంద్రబాబు సీరియస్

- ప్రభుత్వ కార్యక్రమాల పట్ల 48 మంది ఎమ్మెల్యేల నిర్లక్ష్యం
- పెన్షన్లు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీకి గైర్హాజరు
- ఎమ్మెల్యేల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- సంబంధిత ఎమ్మెల్యేలకు వెంటనే నోటీసులు ఇవ్వాలని పార్టీ కార్యాలయ సిబ్బందికి ఆదేశం
- ప్రజాప్రతినిధులు ప్రజలకు చేరువ కావడం తప్పనిసరి అని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ వంటి కీలక కార్యక్రమాలకు హాజరుకాని 48 మంది ఎమ్మెల్యేల తీరుపై ఆయన

వివరాలు 2లో..



# ఆపరేషన్ మొదలైతే ఆగదు...

## ఎర్రచందనం స్మగర్లకు పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్

- ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామన్న పవన్ కల్యాణ్
- నలుగురు కీలక స్మగ్లర్లను గుర్తించామని వెల్లడి
- తిరుపతిలో అటవీ ప్రాంతాలు, గోదాములను పరిశీలించిన అటవీశాఖ మంత్రి
- స్మగ్లింగ్ కట్టడికి కర్ణాటక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటామని వెల్లడి
- అక్రమార్కుల ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని తీవ్ర హెచ్చరిక
- చెట్ల నరికివేతలో పాలుపంచుకోవద్దని స్థానికులకు విజ్ఞప్తి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామని, ఈ వ్యవహారంలో ఇప్పటికే నలుగురు కింగ్‌పిన్‌లను గుర్తించామని అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. శనివారం తిరుపతి జిల్లాలో పర్యటించిన ఆయన, మామండూరు అటవీ ప్రాంతంతో పాటు మంగళంలోని ఎర్రచందనం గోదామును పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, “ఎర్రచందనం చెట్టుకు గొప్ప ఆధ్యాత్మిక చరిత్ర ఉంది. ఇది సాక్షాత్తు వేంకటేశ్వరస్వామి గాయం నుంచి పుట్టిందని పురాణాలు

వివరాలు 2లో..



## అది మీ వైఫల్యమే... మోదీ, నితీశ్ బాధ్యత వహించాలి

- చొరబాటుదారుల పేరుతో ముస్లింలను కించపరుస్తున్నారన్న ఒవైసీ
- దేశంలోకి చొరబాటుదారులు వస్తుంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని వ్యాఖ్య
- విభజన సమయంలో సీమాంచల్ ముస్లింలు భారత్‌నే ఎంచుకున్నారన్న ఒవైసీ

పెన్ పవర్ డెస్క్:ప్రతిపక్షాలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయన్న బీజేపీ ఆరోపణలను ఎంఐఎం అధినేత అసదుద్దీన్

వివరాలు 2లో..



## లాలూ పేరు చెప్పి మోదీ భయపెడుతున్నారు

- ప్రధాని మోదీపై జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విమర్శలు
- ఆర్జేడీ ‘జంగిల్ రాజ్’ పేరుతో భయపెట్టి ఓట్లు అడుగుతున్నారని ఆరోపణ
- ఈసారి ప్రజలు కొత్త ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారని వ్యాఖ్య
- బీహార్‌కు జన్ సురాజ్ పార్టీనే అసలైన ప్రత్యామ్నాయమని వెల్లడి
- గతంలో మోదీ విపక్ష కూటమిని ‘లఠ్‌బంధన్’ అని విమర్శించారు

వివరాలు 2లో..

## మీకు ఇంకా బుద్ధి రాలేదా: జగన్ పై అనురాధ ఫైర్

- జగన్ పేటీఎం బ్యాచ్ మూల్యం చెల్లించుకోక తప్పదని అనురాధ హెచ్చరిక
- తల్లి, చెల్లిని కూడా జగన్ వదల్లేదని తీవ్ర విమర్శ
- అనుచిత పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తప్పవని వార్నింగ్



పెన్ పవర్ డెస్క్: వైసీపీ అధినేత జగన్, ఆయన సోషల్ మీడియా వర్గాలపై శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. జగన్ పెంచి పోషిస్తున్న ‘పేటీఎం బ్యాచ్’

వివరాలు 2లో..

## కుప్పం దశ మార్చే ప్రాజెక్టులు... ఒకేరోజు 7 పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు



- హిందాల్కో, మదర్ డైరీ సహా పలు దిగ్గజ సంస్థల రాక
- ఈ పరిశ్రమలతో 22,330 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- త్వరలో మరో 8 కంపెనీలు, రూ.6,339 కోట్ల పెట్టుబడులు
- కుప్పాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్న చంద్రబాబు
- హంద్రీ-నీవా నీటితో పారిశ్రామిక అవసరాలు తీరుస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తూ, ఒకే రోజు ఏకంగా ఏడు భారీ పరిశ్రమలకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. రూ.2,203 కోట్ల

వివరాలు 2లో..

## డిసెంబర్ ఒకటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

- పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలు ఖరారు.. రాష్ట్రపతి ఆమోదం
- డిసెంబర్ 1 నుంచి 19 వరకు సెషన్ నిర్వహణ
- ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం
- ఫలప్రదమైన చర్చ జరగాలని ఆశిస్తున్నట్టు కిరణ్ రిజిజు ట్వీట్



పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ శీతాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. డిసెం బర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం

వివరాలు 2లో..



## బెడిసికొట్టిన శాంతి చర్చలు.. పాకిస్థాన్‌పై ఆఫ్ఘనిస్థాన్ ఫైర్

- ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో జరిగిన భేటీ
- పాకిస్థాన్ బాధ్యతారహితంగా వ్యవహరించిందన్న తాలిబన్లు
- టీటీపీ ఉగ్రవాదులకు తాలిబన్లు ఆశ్రయం ఇస్తున్నారని పాక్ ఆరోపణ
- చర్చలు విఫలమవడంతో సరిహద్దు ఘర్షణలు కొనసాగే అవకాశం
- ఘర్షణల్లో ఇరువైపులా సైనికులు, పౌరులతో సహా వందల మంది మృతి

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయి. ఖతార్, టర్కీ దేశాల మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్‌లో రెండు రోజుల పాటు జరిగిన

వివరాలు 2లో..

## మహారాష్ట్రలో భారీ కుంభకోణం..

### రూ. 200 కోట్ల విలువైన భూమిని రూ. 3 కోట్లకే దక్కించుకున్న మంత్రి!

- మంత్రి ప్రతాప్ సర్‌నాయక్‌పై ప్రతిపక్షాల ఆరోపణలు
- భయాందర్‌లో నాలుగు ఎకరాల భూమిని తక్కువధరకే కొనుగోలు చేశారని కాంగ్రెస్ నాయకుడి ఆరోపణ
- ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్న రెవెన్యూ మంత్రి

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్రలో రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ. 200 కోట్ల విలు వైన భూమిని రూ. 3 కోట్లకే దక్కిం చుకున్నారనే ఆరోప ణలు వెల్లువె త్తుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ భూకుంభకోణం కేసు



వివరాలు 2లో..



## బీహార్ లో నారా లోకేశ్ ఎన్నికల ప్రచారం

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ తరఫున నారా లోకేశ్ ప్రచారం
- రెండు రోజుల పాటు పాట్నాలో పర్యటించనున్న లోకేశ్
- ఆదివారం ఉదయం భారీ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగం
- రసవత్తరంగా మారిన బీహార్ పోరులో లోకేశ్ ప్రచారంపై ఆసక్తి
- రెండో విడత పోలింగ్ నేపథ్యంలో ఎన్డీఏకు మద్దతు

వివరాలు 2లో..

## అక్రమ కేసులు పెడుతున్న వారిని వదిలిపెట్టను..

### పోలీసులను హెచ్చరించిన రజిని

- తనపై టీడీపీ, పోలీసులు కుట్ర పన్నారన్న విడదల రజిని
- టీడీపీ వ్యక్తిని తన అనుచరుడిగా చిత్రీకరించి కేసు పెట్టారని ఆరోపణ
- డీఎస్పీపై పరువు నష్టం దావా వేస్తానని వెల్లడి
- చిలకలూరిపేట నుంచే మళ్లీ పోటీ చేస్తానని స్పష్టీకరణ

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# తన గురువు చంద్రబాబు నుంచి ఇదే రేవంత్ నేర్చుకోవాలి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు స్థానిక క్రీడాకారుల ప్రోత్సాహంలో ఆయనకున్న నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారిణి శ్రీ చరణి రెడ్డిని ఆయన తన కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ఈ యువ ప్రతిభను గుర్తించడంలో చంద్రబాబు ఏమాత్రం ఆలస్యం చేయలేదు.

**ఏపీ ప్రభుత్వం భారీ ప్రోత్సాహం**

శ్రీ చరణి రెడ్డికి చంద్రబాబు ప్రకటించిన ప్రోత్సాహం సాధారణమైనది కాదు.. 1000 చదరపు గజాల నివాస స్థలం, రూ.2.5 కోట్ల భారీ నగదు బహుమతి , గ్రూప్%-%1 ఉద్యోగం ఇచ్చి గౌరవించాడు. ఈ ప్రకటనలు ఏపీలోని క్రీడాకారులలో ముఖ్యంగా యువతలో, అపారమైన ఉత్సాహాన్ని నింపాయి. తన వాగ్దానాలు ఎప్పుడు కార్యరూపం దాల్చినా, స్థానిక ప్రతిభకు దక్కే గౌరవం ఇదే అని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

**తెలంగాణలో నిరాశ: అరుంధతి రెడ్డికి దక్కని గౌరవం**

ఒకవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన క్రీడాకారులకు భారీ ప్రోత్సాహం అందిస్తుంటే, పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న మరో అంతర్జాతీయ క్రీడాకారిణి అరుంధతి రెడ్డి కూడా ఇటీవల జాతీయ జట్టులో చోటు దక్కించుకుంది. ప్రధాన మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం రాకపోయినా, జాతీయ జట్టులో స్థానం సంపాదించడం అనేది సంవత్సరాల కష్టం, పట్టుదలకు నిదర్శనం. అయితే, ఇప్పటివరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ ఆమెను ఆహ్వానించలేదు, అభినందించలేదు, కనీసం ఎటువంటి ప్రోత్సాహక బహుమతిని కూడా ప్రకటించలేదు.

**ప్రజల అభిప్రాయం: రేవంత్ నేర్చుకోవాలి**

తెలంగాణ క్రీడాకారిణి అయినప్పటికీ అరుంధతి రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన గౌరవం దక్కలేదనే అభిప్రాయం ప్రజల్లో బలంగా వ్యక్తమవుతోంది. క్రీడాకారులను గుర్తించి, వారిని సన్మానించడం కేవలం ఒక లాంఛనం మాత్రమే కాదు, అది రాబోయే తరాల క్రీడాకారులకు ఒక పాజిటివ్ సందేశం. చంద్రబాబు నాయుడు చూపించిన చొరవను రేవంత్ రెడ్డి కూడా గ్రహించాల్సిన అవసరం ఉంది. స్థానిక ప్రతిభను సముచితంగా గౌరవించి, ప్రోత్సహిస్తేనే రాష్ట్ర క్రీడా రంగం మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతానికి, రాష్ట్ర ప్రజల మాట ఒక్కటే "చంద్రబాబు దగ్గర నుంచి స్థానిక ప్రతిభను గౌరవించడం అనే పాఠం రేవంత్ రెడ్డి ఇంకా నేర్చుకోలేదు." వెంటనే అరుంధతి రెడ్డిని సన్మానించి, తగిన ప్రోత్సాహాన్ని ప్రకటించడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ లోపాన్ని సరిదిద్దుకోవాలి.ం

## 48 మంది ఎమ్మెల్యేలపై చంద్రబాబు సీరియస్

- మొదటి పేజీ తరువాయి

సీరియస్‌గా స్పందించారు. ఈ విషయంలో ఏమాత్రం ఉపేక్షించవద్దని, సంబంధిత ఎమ్మెల్యేలందరికీ తక్షణమే నోటీసులు జారీ చేయాలని పార్టీ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలతో మమేకమవుతూ, ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొన్నప్పుడే ప్రభుత్వ ఉద్దేశాలు నెరవేరతాయని, పాలనా వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులే ఇలాంటి కార్యక్రమాలకు దూరంగా ఉండటం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరాలంటే ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, వారి నిర్లక్ష్యం వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎం పేర్కొన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో, ప్రభుత్వ కార్యక్రమాలకు గైర్హాజరైన 48 మంది ఎమ్మెల్యేలకు పార్టీ కార్యాలయ సిబ్బంది త్వరలోనే నోటీసులు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## బెడిసికొట్టిన శాంతి చర్చలు.. పాకిస్థాన్‌పై ఆఫ్ఘనిస్థాన్ ఫైర్

- మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశాలు ఎటువంటి ఫలితం తేలకుండానే ముగిశాయి. చర్చలు విఫలమవడానికి పాకిస్థాన్ బాధ్యతారహిత వైఖరే కారణమని ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ పాలకులు తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇరు దేశాల మధ్య ఘర్షణలు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి.శనివారం ఉదయం తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చర్చల్లో పాకిస్థాన్ తన భద్రతా వైఫల్యాలన్నింటికీ ఆఫ్ఘనిస్థాన్‌పై నెట్టే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఆఫ్ఘన్ భద్రతకు గానీ, తమ సొంత భద్రతకు గానీ బాధ్యత వహించడానికి ఎలాంటి సుముఖత చూపలేదు. పాక్ అనుసరించిన బాధ్యతారాహిత్యమైన, సహకరించని వైఖరి వల్లే చర్చలు విఫలమయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు.మరోవైపు, పాకిస్థాన్ కూడా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని శుక్రవారమే అంగీకరించింది. అంతర్జాతీయ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు తాలిబన్లు ఉగ్రవాదాన్ని అరికట్టడంలో విఫలమయ్యారని పాక్ ఆరోపిస్తోంది. ముఖ్యంగా, తమ దేశంలో అనేక దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. అయితే ఈ ఆరోపణలను తాలిబన్లు ఖండించారు. ఏ దేశంపైనా దాడికి తమ భూభాగాన్ని ఉపయోగించుకోనివ్వబోమని, అదే సమయంలో తమ సార్వభౌమత్వానికి భంగం కలిగించే చర్యలను గట్టిగా ప్రతిఘటిస్తామని వారు స్పష్టం చేశారు.గత కొన్ని నెలలుగా ఇరు దేశాల సరిహద్దుల్లో ఘర్షణలు తీవ్రమయ్యాయి. అక్టోబర్ ప్రారంభం నుంచి జరిగిన దాడుల్లో ఆఫ్ఘన్ వైపు 50 మంది పౌరులు మరణించారని, 447 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. మరోవైపు, తాలిబన్ల దాడుల్లో 23 మంది సైనికులు మరణించారని, 29 మంది గాయపడ్డారని పాక్ సైన్యం ప్రకటించింది. చర్చలు విఫలమవడంతో మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, టర్కీలకు పాకిస్థాన్ కృతజ్ఞతలు తెలుపుతూనే, తమ ప్రజలను, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ఆపరేషన్ మొదలైతే ఆగదు...

- మొదటి పేజీ తరువాయి

చెబుతున్నాయి. అలాంటి పవిత్రమైన సంపదను కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. శేషాచలం అడవుల్లో స్మగ్లర్లు దాదాపు 2 లక్షల చెట్లను నరికి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ఇప్పటికే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని, జిల్లాల ఎస్పీలతో సమీక్ష నిర్వహించామని తెలిపారు.ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా కట్టడి చేసేందుకు కర్ణాటక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ విషయంపై సీఎం సిద్దరామయ్యను కోరినట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. "ఇప్పటికే నలుగురు ప్రధాన స్మగ్లర్లను గుర్తించాం. వారిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒకసారి ఆపరేషన్ మొదలుపెడితే వెనుదిరిగే ప్రసక్తే ఉండదు. 'ఆపరేషన్ కగార్'ను అమలు చేస్తున్న ఈ దేశంలో స్మగ్లర్ల ఆట కట్టించడం పెద్ద కష్టం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. స్మగ్లర్లు స్వచ్ఛందంగా ఈ అక్రమ కార్యకలాపాలను ఆపకపోతే అటవీ చట్టం ప్రకారం వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ఈ అక్రమ నరికివేతలో స్థానిక ప్రజలు, తమిళనాడు కూలీలు భాగస్వాములు కావొద్దని విజ్ఞప్తి చేశారు. ఎర్రచందనాన్ని కాపాడే బాధ్యత వేంకటేశ్వరస్వామి భక్తులపై కూడా ఉందని ఆయన గుర్తుచేశారు.

## లాలూ పేరు చెప్పి మోదీ భయపెడుతున్నారు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై జన్ సూరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీహార్ ఎన్నికల్లో ఓట్లు దక్కించుకోవడం కోసం, లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) పాలన గురించి ప్రజల్లో భయాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈసారి బీహార్ ప్రజలు ఓటు వేయడానికి జన్ సూరాజ్ రూపంలో ఒక కొత్త ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. "ఆర్జేడీ భయాన్ని చూపించి ఓట్లు రాబట్టాలని మోదీ ప్రయత్నిస్తున్నారు, ఎందుకంటే ఆయన చెప్పడానికి మరేమీ లేదు. దశాబ్దాలుగా ఎన్డీయే, బీజేపీ, నితీశ్ కుమార్ ఓట్లు పొందడానికి లాలూ భయాన్ని చూపడమే ఉత్తమ మార్గంగా ఎంచుకున్నారు. 'పనులు జరిగాయా? లేదా?' అన్నది పక్కనపెడితే, కనీసం జంగిల్ రాజ్ తిరిగి రాలేదు కదా' అని ప్రజలు అనుకునేలా చేశారు. కానీ ఈసారి పరిస్థితి మారింది. జంగిల్ రాజ్ తిరిగి రాకూడదంటే, మరి మీకెందుకు ఓటేయాలి? జన్ సూరాజ్ ఒక కొత్త ప్రత్యామ్నాయంగా ఉంది" అని కిశోర్ వివరించారు. ఆర్జేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ పాలన కాలాన్ని 'జంగిల్ రాజ్'గా బీజేపీ అభివర్ణిస్తుంటుంది. లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ మహాకూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉన్న నేపథ్యంలో బీజేపీ ఈ పదాన్ని విపక్షాలపై విమర్శలకు అస్త్రంగా వాడుతోంది. గత వారం ప్రధాని మోదీ మాట్లాడుతూ బీహార్‌లోని 'జంగిల్ రాజ్'ను మరో 100 ఏళ్లయినా మర్చిపోలేరని అన్నారు. ఆనాటి పరిస్థితులను యువతరానికి వివరించాలని రాష్ట్రంలోని బీజేపీ కార్యకర్తలకు, వృద్ధులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్ష కూటమిని 'ఘట్‌బంధన్' (కూటమి) కాదని, 'లఠ్‌బంధన్' (నేరగాళ్ల గుంపు) అని అభివర్ణించారు. ఢిల్లీ నుంచి బీహార్ వరకు ఉన్న విపక్ష నేతలంతా బెయిల్‌పై బయట ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో రికార్డు స్థాయిలో 64.66 శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్ర చరిత్రలోనే ఇది అత్యధికం. రెండో దశ పోలింగ్ నవంబర్ 11న జరగనుండగా, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేపడతారు.

# బీహార్ లో నారా లోకేశ్ ఎన్నికల ప్రచారం

జాతీయ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ మరోసారి తన ఉనికిని చాటుతోంది. ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) అభ్యర్థులకు మద్దతుగా ఆయన రెండు రోజుల పాటు బీహార్‌లో పర్యటించనున్నారు.వివరాల ప్రకారం, శనివారం (నవంబర్ 8) మధ్యాహ్నం కళ్యాణదుర్గం పర్యటన ముగించుకుని లోకేశ్ నేరుగా పాట్నాకు బయలుదేరనున్నారు. అదే రోజు సాయంత్రం ఆయన రెండు కీలకమైన సమావేశాల్లో పాల్గొంటారు. అనంతరం ఆదివారం ఉదయం పాట్నాలో ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు.బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే నవంబర్ 6న తొలి విడతలో 121 స్థానాలకు పోలింగ్ పూర్తి కాగా, రెండో విడత పోలింగ్ నవంబర్ 11న 122 స్థానాలకు జరగనుంది.

# డిసెంబర్ ఒకటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

- మొదటి పేజీ తరువాయి

చేసిన ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ తేదీలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ప్రకటిస్తూ, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఫలప్రదమైన, అర్థవంతమైన చర్చలు జరగాలని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అత్యంత క్లుప్తమైన శీతాకాల సమావేశాల్లో ఇది ఒకటి కావడం గమనార్హం.గతేడాది శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20న ముగిశాయి. 26 రోజుల వ్యవధిలో లోక్‌సభ 20 సార్లు, రాజ్యసభ 19 సార్లు సమావేశమయ్యాయి. ఆ సెషన్‌లో లోక్‌సభ ఉత్పాదకత 54.5 శాతంగా, రాజ్యసభ ఉత్పాదకత 40 శాతంగా నమోదైంది. అప్పుడు ఐదు బిల్లులను ప్రవేశపెట్టగా, 'భారతీయ వాయుయాన్ విధేయక్ 2024' బిల్లును ఉభయ సభలు ఆమోదించాయి.ఇటీవల జరిగిన వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరిగాయి. ఆ సమావేశాల్లో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో ఉభయ సభల్లో ఉత్పాదకత గణనీయంగా తగ్గింది. లోక్‌సభ కేవలం 31 శాతం, రాజ్యసభ 38.8 శాతం ఉత్పాదకతను మాత్రమే నమోదు చేశాయి. ఆ సెషన్‌లో 15 బిల్లులు చట్టరూపం దాల్చాయి.

## అది మీ వైఫల్యమే... మోదీ, నితీశ్ బాధ్యత వహించాలి

- మొదటి పేజీ తరువాయి

ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఒకవేళ దేశంలోకి చొరబాటుదారులు వస్తున్నారంటే, అది పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమేనని, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నితీశ్ కుమార్ దీనికి బాధ్యత వహించాలని ఆయన అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్‌కు ముందు కిషన్‌గంజ్‌లో ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."ముఖ్యమంత్రి మీవాడే, కేంద్ర హోంమంత్రి మీవాడే, ప్రధాని కూడా మీరే. మీ కళ్లెదుటే చొరబాటుదారులు ఎలా వస్తున్నారు? ఒకవేళ వారు వస్తున్నారంటే అది మీ పరిపాలనా వైఫల్యమే కదా? మీ చేతుల్లో బీఎస్ఎఫ్, సీమా సురక్షా బల్ ఉన్నాయి. అయినా చొరబాటులు జరుగుతున్నాయని మీరే ఆరోపిస్తున్నారు" అని ఒవైసీ ప్రభుత్వాన్ని నిలదీశారు. చొరబాటుదారుల ఆరోపణను తిప్పికొడుతూ, "ఇక్కడేమైనా బంగారు గనులు దొరికాయా? లేక చమురు నిక్షేపాలు బయటపడ్డాయా? ప్రజలు గుంపులు గుంపులుగా వలస రావడానికి? సీమాంచల్ ప్రాంత ముస్లింలు దేశ విభజన సమయంలో బంగ్లాదేశ్‌కు వెళ్లకుండా భారత్‌నే తమ దేశంగా ఎంచుకున్నారు. వారిని ఇప్పుడు చొరబాటుదారులు అని నిందిస్తున్నారు. కనీసం 10 మంది చొరబాటుదారుల పేర్లయినా బీజేపీ చెప్పగలదా?" అని ఆయన సవాల్ విసిరారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్న ముస్లింల కోసం ఏమీ చేయనందుకే, వారిని కించపరిచేలా బీజేపీ మాట్లాడుతోందని ఆరోపించారు.సీమాంచల్ ప్రాంత అభివృద్ధిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఒవైసీ విమర్శించారు. "పాట్నా, దర్భంగా, భాగల్‌పూర్‌లలో ఎయిమ్స్, ఐఐటీలు కట్టామని ప్రధాని చెబుతారు. కానీ అరరియాలో ఏం చేశారో చెప్పలేరు. అందుకే ఇక్కడి యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తోంది" అని ఆయన పేర్కొన్నారు.ఓట్ల దొంగతనం జరుగుతోందన్న రాహుల్ గాంధీ ఆరోపణలపై మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలను చాలాసార్లు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఒవైసీ సూచించారు. "మనం పోటీ పడుతోంది బీజేపీతో. కళ్లు మూసి తెరిచేలోపు మిమ్మల్ని మాయం చేయగలరు" అని ఆయన వ్యాఖ్యానించారు. 2020 బీహార్ ఎన్నికల్లో ఒవైసీ పార్టీ సీమాంచల్ ప్రాంతంలో 5 స్థానాలు గెలిచి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 17% ముస్లిం జనాభాలో ఈ ప్రాంతంలోనే అధికశాతం ఉన్నారు.

## మీకు ఇంకా బుద్ధి రాలేదా: జగన్ పై అనురాధ ఫైర్

- మొదటి పేజీ తరువాయి

తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆమె గట్టిగా హెచ్చరించారు. సొంత తల్లిని, చెల్లిని కూడా వదలకుండా వ్యక్తిత్వ హననానికి పాల్పడిన దుర్మార్గుడు జగన్ అని అనురాధ విమర్శించారు.కల్తీ మద్యంతో రాష్ట్రంలో 30 వేల మంది ప్రాణాలు తీసి, ఎందరో తల్లులకు కడుపుకోత మిగిల్చారని ఆమె మండిపడ్డారు. సోషల్ మీడియాలో యువతతో తప్పుడు పోస్టులు పెట్టించి, వారిని జైలు పాలు చేస్తూ తల్లిదండ్రులకు ఆవేదన మిగులుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలతో జగన్ చేయిస్తున్న ఇలాంటి వికృత చేష్టల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భాస్కర్ రెడ్డి లాంటి వారిని ఎంతమందిని ప్రయోగించినా, వారంతా కటకటాల వెనక్కి వెళ్లడం ఖాయమన్నారు.తలా తోక లేని వ్యాఖ్యలతో మహిళలను కించపరిచే వారు అసలు మనుషులేనా అని ఆమె నిలదీశారు. "పనికిమాలిన పేటీఎం బ్యాచ్‌తో ఇంకెంత కాలం విషప్రచారం సాగిస్తారు? ప్రజలు 11 సీట్లు ఇచ్చినా మీకు ఇంకా బుద్ధి రాలేదా?" అని ప్రశ్నించారు.

## అక్రమ కేసులు పెడుతున్న వారిని వదిలిపెట్టను..

వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని... చిలకలూరిపేట టీడీపీ నేతలు, స్థానిక పోలీసులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్రపూరితంగా తన సిబ్బందిపై అక్రమంగా చీటింగ్ కేసు నమోదు చేశారని ఆమె ఆరోపించారు. ఈ కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదని వివరించారు. శ్రీ గణేశ్ అనే వ్యక్తి తమ అనుచరుడంటూ పోలీసులు కేసు నమోదు చేశారని, కానీ అతను టీడీపీ మద్దతుదారుడని రజని స్పష్టం చేశారు. దర్శి టీడీపీ అభ్యర్థి తరఫున శ్రీ గణేశ్ ప్రచారం చేస్తున్న ఫోటోలను ఆమె మీడియాకు చూపించారు. అంతేకాకుండా, 10 సంవత్సరాల క్రితం పత్తిపాటి పుల్లారావు అనుచరుడినని చెప్పి శ్రీ గణేశ్ ఉద్యోగాల పేరుతో మోసం చేశాడని బాధితులు లోకేశ్ కు ఇచ్చిన ఫిర్యాదు పత్రాలను కూడా ఆమె ప్రదర్శించారు. ఈ పత్రాల్లో ఎక్కడా తమ పేరు లేకపోయినా, ఇప్పుడు కావాలనే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. ఈ కేసులో పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఓ డీఎస్పీ వచ్చి దౌర్జన్యం చేసుకుని పనిచేస్తున్నారని, కనీస విచారణ లేకుండానే తమపై కేసులు బనాయించారని మండిపడ్డారు. నియోజకవర్గంలో రేషన్, గ్రావెల్ మాఫియా, పేకాట వంటి అక్రమాలను వదిలేసి, కేవలం వైసీపీ శ్రేణులనే లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తానని రజని హెచ్చరించారు. సంబంధిత డీఎస్పీపై పరువు నష్టం దావా వేస్తానని, మానవ హక్కుల కమిషన్‌ను, జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. తప్పుడు కేసులు పెడుతున్న అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారి చర్యలన్నీ రికార్డ్ అవుతున్నాయని అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ఇప్పటికే తనపై 7 కేసులు ఉన్నా ధైర్యంగా నిలబడ్డానని గుర్తుచేశారు. జగన్ ఆశీస్సులతో చిలకలూరిపేట నుంచే మళ్లీ పోటీ చేసి గెలుస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మహిళా రాజకీయ నాయకురాలిగా తన ఎదుగుదలను ఓర్వలేకే ఈ దాడులు చేస్తున్నారని విడదల రజని పేర్కొన్నారు.

## మహారాష్ట్రలో భారీ కుంభకోణం.. రూ. 200 కోట్ల విలువైన భూమిని రూ. 3 కోట్లకే దక్కించుకున్న మంత్రి!

- మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతుండగా, తాజాగా రాష్ట్ర మంత్రిపై వచ్చిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు విజయ్ వడెట్టివార్ విలేకరులతో మాట్లాడుతూ, ప్రతాప్ సర్‌నాయక్ మీరా భయాందర్‌లో దాదాపు రూ. 200 కోట్ల విలువైన నాలుగు ఎకరాల భూమిని రూ. 3 కోట్లకే కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆ స్థలంలోనే ఆయన ఓ విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై మహారాష్ట్ర రెవెన్యూమంత్రి చంద్రశేఖర్ బావాంకులే స్పందించారు. ఈ విషయం గురించి తాను కూడా విన్నానని, కానీ దీనిపై ఎవరి దగ్గర నుంచి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రతిపక్షాలు తమకు ఫిర్యాదు చేయడం మానేసి, మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసేందుకే సమయం కేటాయిస్తున్నాయని విమర్శించారు. ఈ భూమికి సంబంధించి ఏదైనా ఫిర్యాదు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఇదిలా ఉండగా, రూ. 18,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన సంస్థకు రూ. 300 కోట్లకే విక్రయించినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై దర్యాప్తునకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంత్రిపై కూడా ఆరోపణలు రావడం గమనార్హం.

## కుప్పం దశ మార్చే ప్రాజెక్టులు... ఒకేరోజు 7 పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

పెట్టుబడులు తీసుకువచ్చే ఈ పరిశ్రమల కోసం 241 ఎకరాల స్థలం కేటాయించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,330 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఒకప్పుడు అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కుప్పాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.కుప్పం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న ఈ ఏడు సంస్థల్లో దేశంలోని దిగ్గజ కంపెనీలు ఉన్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన హిండాల్కో సంస్థ రూ.586 కోట్లతో మొబైల్, ల్యాప్‌టాప్ వంటి టెక్ పరికరాల విడిభాగాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. శ్రీజా డైరీ రూ.290 కోట్లతో సమీకృత డెయిరీ, పశువుల మేత ప్లాంటును, ఏస్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.525 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ డెయిరీ ఉత్పత్తుల కాంప్లెక్స్‌ను, ఎస్వీఎఫ్ సోయా రూ.373 కోట్లతో వంట నూనెల తయారీ యూనిట్‌ను స్థాపించనున్నాయి. వీటితో పాటు మదర్ డైరీ రూ.260 కోట్లతో పండ్ల రసాల యూనిట్ను, ఇ-రాయిస్ ఈవీ రూ.200 కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని, అలీప్ సంస్థ రూ.27 కోట్లతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పార్కును అభివృద్ధి చేయనుంది.

**కుప్పం దశ మార్చే ప్రణాళిక**

ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామికీకరణకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని, భవిష్యత్తులో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కుప్పం భౌగోళిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు.

**రైతులకు, మహిళలకు పెద్దపీట**

ఈ పరిశ్రమల రాకతో కేవలం యువతకు ఉద్యోగాలే కాకుండా, స్థానిక రైతులు, మహిళలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. శ్రీజా డెయిరీ రోజుకు నాలుగు లక్షల లీటర్ల పాలను, మదర్ డైరీ పండ్లను, ఎస్వీఎఫ్ సోయా స్థానిక పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తాయని, దీనివల్ల పాడి, వ్యవసాయ రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని సీఎం తెలిపారు. ప్రత్యేకంగా మహిళల కోసం అలీప్ సంస్థ నిర్మిస్తున్న 'మహిళా శక్తి భవన్' ద్వారా 4,000 మందికి శిక్షణ లభిస్తుందని చెప్పారు. ఈ విధానంలో ద్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్, వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ నిపుణుడు అనే పాలసీలతో ముందుకు తీసుకెళ్తాం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**త్వరలో మరో 8 కంపెనీలు**

ఈ ఏడు కంపెనీలే కాకుండా త్వరలోనే రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు కుప్పానికి రానున్నాయని, వాటి ద్వారా అదనంగా 43 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చంద్రబాబు శుభవార్త చెప్పారు. దీంతో బ్యాటరీ టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, ఫుడ్ లాజిస్టిక్స్ వంటి రంగాల్లో కుప్పం కీలక కేంద్రంగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రముఖ బాల్ బ్యాట్మెంటన్ ఎన్.వి రత్నం మృతి



**విశాఖ పెన్ పవర్ నవంబర్ 8:** విశాఖ జిల్లా పిఎం పాలెం చివరి బస్ స్టాప్ వద్ద ప్రముఖ బ్యాట్మెంటన్ ఎన్.వి రత్నం శనివారం స్వర్గస్తులైనారు. విషయం తీసుకున్న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్, అభిమానులను షాక్కు గురి చేసింది. విశాఖ చిన్న వాల్తేరులో ఎన్నో టోర్నమెంట్లు చేసి ఒక ప్లేయర్గా ఒక ఆర్గనైజర్గా బాల్ బ్యాడ్మింటన్ లో ఖ్యాతి గడించారు. పీఎం పాలెంలో సౌత్ జోన్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు, ఆల్ ఇండియా టోర్నమెంట్లు చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులు వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని నింపారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## జనజాతీయ గౌరవ దివస్‌ను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపు

**పాడేరు,పెన్ పవర్,నవంబర్ 8:**
గిరిజన స్వాతంత్ర్య సమర యోధుడు భగవాన్ బీర్సా ముండా జయంతి (జనజాతీయ గౌరవ దివస్) వేడుకలను విజయవంతం చేయాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. శనివారం పాడేరు లోని ఎన్‌జిఓ కార్యాలయంలో జనజాతీయ గౌరవ దివస్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన పెద్దల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సభ ప్రారంభంలో భారత మాత మరియు భగవాన్ బీర్సా ముండా చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.తర్వాత పాడేరు, అరకు, రంపచోడవరం, పార్వతీపురం ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ గిరిజన తెగల ప్రతినిధులతో భగవాన్ బీర్సా ముండా జయంతి ఉత్సవాల నిర్వహణపై చర్చించి అభిప్రాయాలు సేకరించారు.ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ "దేశ స్వాతంత్ర్యం సాధనలో గిరిజన స్వాతంత్ర్య యోధుల త్యాగాలు మరువలేనివి. ముఖ్యంగా భగవాన్ బీర్సా ముండా 25 ఏళ్ల వయసులోనే ఆంగ్లేయులపై పోరాడి ప్రాణత్యాగం చేశారు. గిరిజన సమాజాన్ని ఏకం చేసి, విదేశీ ఆగడాలను అరికట్టడంలో ఆయన కీలక పాత్ర పోషించారు," అని పేర్కొన్నారు.అలాగే "వారి త్యాగాలను గుర్తించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, నవంబర్ 15న జనజాతీయ గౌరవ దివస్‌గా ప్రకటించడం ద్వారా గిరిజన సమాజ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందని," అన్నారు.నవంబర్ 15న జయంతి సందర్భంగా, నవంబర్ 16న పాడేరు జూనియర్ కళాశాల వద్ద అన్ని గిరిజన తెగల ప్రజలు, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గిరిజన సంఘాలు కలిసి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.అదే రోజు భగవాన్ బీర్సా ముండా కాంస్య విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట ప్రసాద్, ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి, ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమం కార్యదర్శులు తాడేపల్లి రామకృష్ణ, ఆదినారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు మఠం శాంతకుమారి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ డా. గంగులయ్య, టూరిజం డైరెక్టర్ కిల్లు రమేష్ నాయుడు, ఎస్టీ కమిషన్ సభ్యులు కిల్లో సాయిరాం,జనసేన అరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శెట్టి చిరంజీవి, వైఎస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ, మాజీ మంత్రి మణికుమారి, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్, బీజేవైఎం నాయకులు గోపాల పాత్రుడు, ఏబీవీపీ నాయకులు అంగనైని ఆనంద్, జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర, ముక్కి శేషాద్రి, గిరిజన తెగల పెద్దలు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## విశాఖ రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



**కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆదేశం**

**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 08 :** పార్ట్నర్‌షిప్ సమ్మిట్‌కు ముందు నగరంలో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ అధికారులు ఆదేశించారు.శనివారం సాయంత్రం సాగరమాల ప్రాజెక్టు కింద కాన్వెంట్ జంక్షన్ నుండి ఐఎన్ఎస్ డేగ, పోర్ట్ డాక్ ప్రాంతం వరకు జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జీవీఎంసీ, జాతీయ రహదారుల విభాగాధికారులతో సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ పనులను వేగంగా పూర్తి చేయ డం అవసరమే కానీ, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదు అని స్పష్టం చేశారు. ప్రతి పనిని నిర్ణీత ప్రమాణాలకు అను గుణంగా, నిర్దేశిత సమయానికి పూర్తి చేయాల ని సూచించారు.
రోజువారీగా అధికారులు పనుల పురోగతిని పర్యవేక్షించి, ఎలాంటి ఆటంకాలు లేకుండా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ సత్యనారా యణ రాజు, జాతీయ రహదారుల విభాగం ఎస్.ఇ.తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు

**ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు**



**పాడేరు,పెన్ పవర్,నవంబర్ 8:** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 12వ తేదీన జరగనున్న ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని పాడేరు శాసన సభ్యులు మరియు అల్లూరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు పిలుపునిచ్చారు.పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా ఉద్యమ ర్యాలీకి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ "ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 12న అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీలు నిర్వహించనున్నాం. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, యువత, మహిళలు అందరూ కలిసి ఈ ఉద్యమంలో పాల్గొని దీన్ని విజయవంతం చేయాలి," అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, జిల్లా అధికార ప్రతినిధి సురేష్ కుమార్, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కూతంగి సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ మచ్చల మత్యరాజు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ లకే రామసత్యవతి, ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, బడిమెల సర్పంచ్ సోమెలి లక్ష్మణరావు, అడ్డుమండ సర్పంచ్ గుమ్మ శ్యామ్ సుందర్, మండల యువజన అధ్యక్షులు గల్లెలి లింగమూర్తి, మాజీ సర్పంచులు మినుముల కన్నపాత్రుడు, పాంగి నాగరాజు, సీనియర్ నాయకులు మోద బాబూరావు, ముదిలి సత్యనారాయణ, వంతాల నరేష్, మహిళా అధ్యక్షురాలు కోడా సుశీల తదితరులు పాల్గొన్నారు.

# అత్తపై క్రూరహత్య..యూట్యూబ్‌లో నేర్చుకున్న పాశవికత!









- పోలీసు దర్యాప్తులో బయటపడ్డ నిజాలు!
- మానసిక కోణం - హింసాత్మక ఆలోచనలకు డిజిటల్ ప్రేరణ!
- చట్టపరమైన చర్యలు!

**పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 8 :** స్థానిక పెందుర్తి మండలం, వేపగుంట, అప్పన్నపాలెం
మానవత్వాన్ని కలవరపరిచే ఘోర ఘటన విశాఖ జిల్లాలో చోటుచేసుకుంది. కుటుంబ వివాదాల మధ్య కోడలు తన అత్తను నిష్ఠూరంగా హతమార్చిన సంఘటన స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. "దొంగ-పోలీస్ ఆట" పేరుతో అత్తను కుర్చీకి కట్టేసి, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చిన ఈ ఘటన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**ఘటన వివరాలు..**
వేపగుంట అప్పన్నపాలెంకు చెందిన జయంతి కనకమహాలక్ష్మి (68) అనే వృద్ధురాలు తన కుమారుడు, కోడలతో కలిసి నివసిస్తోంది. కుటుంబంలో తరచుగా చిన్నచిన్న వాగ్వివాదాలు జరిగేవి. నవంబర్ 6 రాత్రి లలిత అనే కోడలు తన అత్తను "దొంగ-పోలీస్ ఆట" ఆడమని చెప్పి కుర్చీలో తాళ్లతో కట్టేసింది. ఆ తర్వాత ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. తర్వాత సీన్ క్రియేట్ చేస్తూ "వంట గదిలో దీపం అంటుకుంది, ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించాయి" అంటూ అగ్ని ప్రమాదంలా చూపించేందుకు ప్రయత్నించింది. అయితే మంటల తీవ్రత, గాయాల స్వరూపం చూసి పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

**పోలీసు దర్యాప్తులో బయటపడ్డ నిజాలు..**
పోలీసులు లలితను విచారించగా, ఆమె అత్తను చంపడానికి ముందుగా యూట్యూబ్‌లో హౌ టు కిల్ ఓల్డ్ లేడీ అనే వీడియోను చూసినట్లు అంగీకరించింది. ఆ వీడియో ఆధారంగా పద్ధతిని ప్లాన్ చేసి, హత్యను ప్రమాదంలా చూపించడానికి ప్రయత్నించింది. దర్యాప్తులో సైబర్ ట్రేసింగ్ ద్వారా లలిత ఫోన్‌లో ఆ వీడియో సెర్చ్ హిస్టరీ కనుగొనడంతో నిజం వెలుగులోకి వచ్చింది.

**మానసిక కోణం – హింసాత్మక ఆలోచనలకు డిజిటల్ ప్రేరణ..**
ఈ ఘటన సాంకేతిక ప్రపంచం ఎలా మానవ విలువలను దెబ్బతీస్తోందో సూచిస్తుంది. వ్యక్తిగత కోపం, కుటుంబ కలహం, మరియు సైబర్ ప్రభావం కలిసి ఒక మనిషిని ఇంత దారుణ స్థాయికి నెట్టేసింది. సైకాలజిస్టులు చెబుతున్నట్లుగా, "సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి వేదికలలో లభించే ప్రమాదకర కంటెంట్ మనసులో దాగి ఉన్న హింసాత్మక వాంఛలను రెచ్చగొడుతుంది."

**చట్టపరమైన చర్యలు..**
పెందుర్తి పోలీసులు లలితను అదుపులోకి తీసుకుని, హత్య కేసు (ఐపిసి 302 సెక్షన్) కింద నమోదు చేశారు. సాక్ష్యాధారాలను సేకరించేందుకు ఫోరెన్సిక్ బృందం కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించింది. ఇలాంటి ఘటనలు కుటుంబ విలువలు, భావోద్వేగ నియంత్రణ, మరియు ఇంటర్నెట్ వినియోగంపై లోతైన ఆలోచన అవసరమని సూచిస్తున్నాయి. "సాంకేతికత చేతిలో ఉన్న మనిషి మానవత్వం కోల్పోతే యంత్రం కంటే భయంకరమవుతాడు."
వేపగుంట ఘటన ఈ వాక్యానికి దారుణమైన ఉదాహరణగా నిలిచింది.

# కుంకుమపూడి గ్రామస్తుల ఏకగ్రీవ నినాదం : "మేమంతా జగన్ అన్న వెంటే!"





- కూటమి నాయకుల కల్లబొల్లి మాటలు ప్రజలను ప్రభావితం చేయలేవు
- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 8:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం కుంకుమపూడి గ్రామస్తులు ఏకగ్రీవంగా "మేమంతా జగన్ అన్న వెంటే ఉంటాం, ఎప్పటికీ వైసీపీతోనే ఉంటాం" అని ప్రకటించారు. గ్రామస్థులు కూటమి నాయకుల అబద్ధపు ప్రచారాలు, కల్లబొల్లి హామీలు ప్రజలలో ఎలాంటి నమ్మకాన్ని కలిగించలేవని తెలిపారు.వారి మాటల్లో "ఇల్లులు మంజూరు చేస్తాం, దరఖాస్తులు ఇవ్వండి" అంటూ గ్రామస్తులను పిలిపించి ఫోటోలు తీసి, తరువాత "కుంకుమపూడి గ్రామం టీడీపీ లో చేరింది" అని పత్రికల్లో ప్రచారం చేయడం కూటమి నాయకుల దురుద్దేశపూరిత చర్య అని విమర్శించారు.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోడు భూములకు పట్టాలు, రైతు రుణ సదుపాయాలు, రైతు భరోసా, అమ్మఒడి, పెన్షన్, చేయూత, వాహన మిత్ర వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాలను మార్చారని గ్రామస్థులు గుర్తుచేశారు.ఇక ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్, రైతు భరోసా 20,000, నిరుద్యోగులకు 3,000, మహిళలకు 1,500 రూపాయలు వంటి హామీలను ఇచ్చి ఒక్కటినీ సరిగ్గా అమలు చేయలేదని మండిపడ్డారు."జగన్ మోహన్ రెడ్డి కులం, మతం, పార్టీ తేడా లేకుండా అందరికీ అభివృద్ధి చేశారు. కానీ ప్రస్తుత కూటమి నాయకులు మా పార్టీ లో చేరితేనే పథకాలు ఇస్తామని చెబుతున్నారు ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం" అని గ్రామస్థులు స్పష్టం చేశారు. "ఇకపై ఇలాంటి రాజకీయ ఒత్తిడి, మోసపూరిత చర్యలు చేయరాదని హెచ్చరిస్తున్నాం," అని గ్రామస్థులు హెచ్చరిక జారీ చేశారు.

**ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన:**

ఈ సందర్భంగా జీకే వీధి మండల పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో "ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం" నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జీకే వీధి సర్పంచ్ కొర్ర సుభద్ర, మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, యూత్ అధ్యక్షులు కొర్ర బాబి,ఎస్టి సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణరావు,వైసీపీ సోబోయి రామూర్తి, కొర్ర కృపా కొర్ర నూకరాజు, గెమ్మెల మార్క్, కొర్ర సీమన్న, అలాగే కుంకుమపూడి గ్రామస్థులు కొర్ర గౌతమ్, కొర్ర చందర్‌రావు, కొర్ర వెంకటరావు, వంతల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల యోజన 3.0 పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు

- గ్యాస్ కనెక్షన్ లేని కుటుంబాల మహిళలకు లబ్ధి
- ఉద్యోగస్తులకు ఈ పథకం వర్తించదు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 8:**ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) 3.0 పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ఈ పథకం ద్వారా ఇంతవరకు గ్యాస్ కనెక్షన్ పొందని కుటుంబాల మహిళలకు మాత్రమే లబ్ధి చేకూరనుంది.ఈ విషయాన్ని గూడెం కొత్త వీధి గ్యాస్ గోడౌన్ మేనేజర్ దేశగిరి కృష్ణ పడాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. "ఈ పథకంలో 18 సంవత్సరాలు నిండిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబంలో ఎవరైనా ఇప్పటికే గ్యాస్ కనెక్షన్ పొందిన వారు అయితే ఈ పథకానికి అర్హులు కారు. అలాగే ఉద్యోగస్తులు కూడా ఈ పథకానికి అర్హులు కారని" అయన వివరించారు.ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు"రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు,కుల ధృవపత్రం,బ్యాంక్ ఖాతా వివరాలు,తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు"పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ పరిధిలో ఉన్న సమీప గ్యాస్ ఆఫీస్ లేదా గ్యాస్ గోడౌన్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు."ప్రధానమంత్రి ఉజ్వల యోజన 3.0 పథకం పేద మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రారంభించబడింది," అని దేశగిరి కృష్ణ పడాల్ తెలిపారు.

# కొత్తపల్లి గ్రామంలో బోరు పనులకు ఎంపీటీసీ నాగమణి ఆధ్వర్యంలో శంకుస్థాపన

- కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి సాధ్యం
- గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 8:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జీకే వీధి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బోరు పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ పనులు జీకే వీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి నిధులతో, మండల పరిషత్ నిధుల ఆధారంగా చేపట్టబడ్డాయి.ఈ సందర్భంగా ఎంపీటీసీ పసుపులేటి నాగమణి మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం అభివృద్ధి పట్ల కట్టుబడి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధి కోసం విస్తృతంగా నిధులు మంజూరు చేస్తుంది "అని తెలిపారు.ఆమె మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో మండల పరిషత్ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రిమెల రాజేశ్వరి, బీజేపీ నాయకులు రేమెల పాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు అరికట్ల ఆంజనేయులు, ఉప సర్పంచ్ కొర్ర రాంబాబు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జర్రెల పిహెచ్సిలో డాక్టర్ మజీద్ సేవలు కొనసాగించాలని డిమాండ్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 8:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రెల ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మజీద్ ను డిప్యూటేషన్ పై వేరే స్థానానికి బదిలీ చేయడం భావ్యం కాదని, ఆయన సేవలు కొనసాగించాలనే డిమాండ్ సాగుతుంది.వంచుల సర్పంచ్ వనపల కాసులమ్మ మరియు పాడేరు నియోజకవర్గ వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడు వనపల రాజేష్ మాట్లాడుతూ, జర్రెల ప్రాంత ప్రజలకు డాక్టర్ మజీద్ సేవలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వారు మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ మజీద్ అందించిన వైద్య సేవల వల్ల ఆసుపత్రిలో ఓపీలు పెరిగాయి. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళకుండా జర్రెల పిహెచ్సి కి రావడం ప్రారంభించారు.ఆయన రోగులను చక్కగా చూసే విధానం ప్రశంసనీయమని.ఇలాంటి డాక్టర్ను డిప్యూటేషన్ పై బదిలీ చేయటం సరైన పద్ధతి కాదు అన్నారు.అందువల్ల, స్థానికులు అధికారులు డాక్టర్ మజీద్ సేవలు జర్రెల పిహెచ్సిలోనే కొనసాగేలా తక్షణమే చర్యలు తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వం ఇస్తున్న పరిహారంపై రైతులు అభ్యంతరం...






**నాతవరం,పెన్ పవర్ (నవంబర్ 08):** అర్సల్ మెటల్ స్టీల్ ప్లాంట్ కంపెనీ కొరకు నాతవరం మండలం ఎంబి పట్నం పంచాయతీ ఏ. శరభవరం గ్రామం వద్ద గల ఏలూరు కాలువ నుంచి నక్కపల్లి వరకు నీటి సరఫరా కోసం పైప్ లైన్ నిర్మాణం జరుగుతుంది.ఏ.శరభవరం ఏలేరు కాలువ నుండి నీటిని డంప్ చేయడం కొరకు రెండు ఎకరాల భూమిని సేకరణ చేయడం జరుగుతుంది. అయితే ఆ భూములో గల పైల సత్యం,కర్రి ప్రసాద్ అనే ఇద్దరు రైతులు మాత్రం ప్రభుత్వం ఇస్తున్న పరిహారంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి శనివారం అధికారులు సర్వే చేస్తుండగా ఆ ఇద్దరు రైతులు మాకు ఇచ్చే పరిహారం సరిపోదని దీన్ని పెంచాలని డిమాండ్ చేశారు. తమకు పరిహారం పెంచే వరకు భూమిని ఇచ్చే ప్రసక్తే లేదని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేసైన పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని వారు అన్నారు. దీనిపై తాసిల్దార్ ఏ వేణుగోపాల్ ను వివరణ కోరగా అందులో దాదాపు ఎకరా 56 సెంట్లు ఏపీఎస్ఈ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందని,44 సెంట్లు కు సంబంధించి ఇద్దరు రైతులు మాత్రమే ఎక్కువ పరిహారం కావాలని డిమాండ్ చేస్తున్నారని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని అన్నారు.

# జిల్లా స్థాయి ఒకేషనల్ కోర్సులో బాయ్స్-1 పాఠశాలకు జిల్లా స్థాయి బహుమతి.




**అల్లూరి జిల్లా కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 8** అల్లూరి జిల్లా పాడేరు లో నిర్వహించిన వోకేషనల్ కోర్స్ జిల్లా స్థాయి స్కిల్ కాంపిటీషన్ లో కొయ్యూరు బాయ్స్ -1 పాఠశాల (బిఎఫ్ఎస్ఐ ) బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్విస్, అలాగేఇన్స్యూరెన్స్ కోర్స్ లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి లభించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి హెచ్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్యాంకింగ్ సర్విస్, అలాగే ఇన్స్యూరెన్స్ కోర్స్ వోకేషనల్ టీచర్ మాకిరెడ్డి శ్యామ్ మహేష్ బాబు ఇచ్చిన గైడెన్స్ తో విధ్యార్థులకు ఈ జిల్లా స్థాయి ప్రథమ బహుమతి వచ్చినట్టు హెచ్ ఎం తెలిపారు. ఎలెక్ట్రానిక్ అండ్ హార్డ్ వేర్ వోకేషనల్ టీచర్ బొడ్డు సిసింద్రీ నాయుడు శిక్షణ తో తదుపరి విధ్యార్థులకు జిల్లా స్థాయి సెకండ్ బహుమతి ధక్కినట్టు హెచ్ ఎం తెలిపారు. ఈ కాంపిటెషన్ లో విజేతలకు అసిస్టెంట్ కలెక్టర్ సాహితీ, జిసిడిఓ కవిత చేతుల మీదుగా ఈ బహుమతులు విధ్యార్థులు పొందినట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి సిల్క్ కాంఫీటేషన్ కి (బిఎఫ్ఎస్ఐ) ట్రేడ్ ఎంపిక అయ్యినట్టు హెచ్ ఏం శ్రీనివాసరావు తెలిపారు. తమ పాఠశాల నుంచి పాల్గొన్న విధ్యార్థులకు జిల్లా ,రాష్ట్ర స్థాయి బహుమతులు లభించటం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఈ విధ్యార్థులను అభినందించారు.

# అక్రమ మైనింగ్ నిరోధించడంలో అధికారుల తక్షణ చర్యలకు ధన్యవాదాలు....









## లెక్కల వెంకట్ ఎన్నారై...

**నాతవరం,పెన్ పవర్ (నవంబర్ 08):** ప్రభుత్వ భూముల రక్షణ, ఏలేరు కాలువ ఒడ్డున అక్రమ మైనింగ్ నిర్వహించడంలో అధికారులు తీసుకున్న తక్షణ చర్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎన్నారై లెక్కల వెంకట్ తెలిపారు. మండలంలో గల చెర్లోపాలెం పంచాయతీలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ త్రవ్వకాలపై శనివారం ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఎన్నారై లెక్కల వెంకట మాట్లాడుతూ చెర్లోపాలెం గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఏలేరుకాల ఒడ్డున అక్రమంగా గ్రావల్ త్రవ్వకాలు చేసి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇసుక మరియు గ్రావెల్ నిల్వచేసి ప్రజలకు అక్రమంగా అమ్ముతున్నాడని ఆయన తెలిపారు. అంతేకాకుండా భారీ వాహనాలతో గ్రామ రహదారులను దెబ్బతీస్తూ అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని అన్నారు. అయితే ఈ అక్రమ మైనింగ్ కార్యకలాపాలు గత కొన్ని సంవత్సరాలుగా కొంతమంది నాయకుల సహకారంతో కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి,వీఆర్వో, ఎమ్మార్వో పోలీస్ శాఖల దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే తక్షణమే స్పందించి, వాహనాలను స్వాధీనం చేసుకొని నాతవరం పోలీస్ స్టేషన్ కు సదరు వ్యక్తిని తీసుకువెళ్లడం అభినందనీయమని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములను రక్షించడం, ఏలూరు కాలవ వడ్డున జరుగుతున్న అక్రమ మైనింగ్ ను అడ్డుకోవడంలో అధికారుల కృషి, నిబద్ధత ధైర్వంతమైన చర్యలు ప్రశంసనీయమని తెలిపారు.దీనిపై తాసిల్దార్ ఏ.వేణుగోపాల్ ను మీడియా అడగగా చర్లోపాలెం గ్రామానికి సంబంధించి చెరువు పోరంబోక భూములో చాలా కాలం నుండి రమేశ్ అనే వ్యక్తి గ్రావెల్ వేస్తూ, ట్రిప్పర్లు పెడుతూ ప్రజలకు ప్రభుత్వానికి ఇబ్బంది కలుగజేస్తున్నాడని గుర్తించి,స్థానిక ఎస్సై కి లెటర్ రాయడం జరిగిందని, దానిని ఆధారంగా చేసుకుని అక్కడ జరుగుతున్నది వాస్తవమేనని తెలిసిన ఎస్ఐ సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారని వేణుగోపాల్ తెలిపారు.

# వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ అన్న సమారాధన





**గాజువాక: పెన్ పవర్ , నవంబర్ 08:**జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో ఆలయ సేవకులు వారి ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. కార్తీకమాసం మూడవ శనివారం సందర్భంగా ముఖ్య అతిథులు చేతులు మీదుగా అన్న అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామిని కొలిచిన వారికి కోరిన కోరికలు ఏడు వారాలు స్వామివారి దీక్షలు చేసి స్వామి వారి దీక్ష చేసినవారికి స్వామివారి నిదర్శనం ఉంటుందని అన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అడపాల నరసింహాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఆకాశ దీప అలంకరణ సప్త హారతులు వేద పండితులచే నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయ పోషకులు ఆలయానికి ఆర్థికంగా సహాయం చేసిన భక్తులందరూ పాల్గొన్నారు.

## బాల చెరువు రోడ్డుకు మహర్దశ

**-15 కోట్లతో రూపాయలతో విస్తరణకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పల్లా**






**గాజువాక: టెన్ పవర్, నవంబర్ 08**
అభివృద్ధిని ప్రజలు స్వాగతించాలని ఎమ్మెల్యే,తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేపట్టే ప్రతి కార్యక్రమం చరిత్రలో నిలిచేలా ఉండాలని పేర్కొన్నారు.గాజువాక కాకతీయ కూడలి నుంచి పెదగంట్యాడ గాంధీ విగ్రహం కూడలి వరకు 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 కోట్లతో చేపట్టే విస్తరణ పనులకు పెదగంట్యాడ జంక్షన్ లో శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళు ళ్ళగా ఎలాంటి అభివృద్ధికి నోచని ఈ రహదారి విస్తరణ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని చెప్పారు.విస్తరణ పనుల వలన రోడ్డుకి ఇరువైపులా ఉన్నటువంటి చిన్న చిన్న వ్యాపారులకు కాస్త ఇబ్బంది కలిగినా అది అందరి మంచికోసం చేస్తున్నట్టుగా భావించాలని కోరారు.కాకతీయ కూడలి నుంచి జింక్ గేట్ వరకు,పెదగంట్యాడ గాంధీ కూడలి నుంచి గంగవరం,అదే విధంగా గంగవరం పోర్టు నుంచి పాత కర్నవానిపాలెం వై జంక్షన్ వరకు ఉన్న రోడ్లను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు.అభివృద్ధి సంక్షేమం ఈ రెండింటినీ సమపాళ్లలో చూస్తూ ముందుకు వెళుతున్నామని అన్నారు.అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై మాట్లాడుతూ ప్రజల అభిప్రాయమే తన అభిప్రాయంగా పేర్కొన్నారు.ఇక్కడి ప్రజల ఇబ్బందిని తాను ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.కార్పొరేటర్ పులి లక్ష్మీ బాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు,డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు,కార్పొరేటర్లు బొడ్డు నరసింహ పాత్రుడు,తిప్పల వంశీరెడ్డి,గంధం శ్రీనివాస్,పల్లా శ్రీనివాస్,ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్,బీజేపీ నేత కరణంరెడ్డి నరసింగరావు,పులి రమణారెడ్డి,బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు,మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యం ప్రజల హక్కులు వాటిని హరించేందుకు కూటమి కుట్ర





**వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చిన్న శ్రీను**

**భిమిలి, పెన్ పవర్, నవంబ్ 08:**విజయనగరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఈరోజు జరిగిన పత్రికా సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను కూటమి ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా స్పందించారు.

చిన్న శ్రీను మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రజల కనీస హక్కులు. కానీ ప్రస్తుత కూటమి ప్రభు త్వం ఈ హక్కులను ప్రజల నుండి దూరం చేస్తోంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీ కరించే కుట్రకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యా లీలు నిర్వహించబోతున్నాం, అని తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇప్పటికే కోటి సంతకాల సేకరణ ప్రారంభమై, ప్రజల నుండి అద్భుతమైన స్పందన లభించింద ని ఆయన పేర్కొన్నారు.తన ప్రసంగంలో చిన్న శ్రీను గారు మరింతగా అన్నారు అమరావతి పేరుతో వేల కోట్లు అప్పులు తెచ్చి, గత 17 నెలల్లో రెండు లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిన ఈ ప్రభుత్వం, ఒక మెడికల్ కాలేజీకి 500 కోట్లు కేటాయించలేకపోవడం సిగ్గుచేటు. ఆరోగ్యశ్రీ నిలిపివేయడంతో పేదలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. డయాలసిస్ పేషెంట్లు దిక్కు లేకుండా పోయారు.భోగాపురం ఎయిర్ పోర్టు పనుల విషయంలో కేంద్ర మంత్రి రామ్మో హన్ నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.మా వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం 2,203 ఎకరాల భూమిని సేకరించింది, 527 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించింది, 23% పనులు పూర్తిచేసింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు, అని చిన్న శ్రీను విమ ర్శించారు మా ప్రభుత్వం చేపట్టిన పథకాల పేర్లు మార్చి, వాటినే తమ ఖాతాలో వేసుకో వడం తప్ప, గత 17 నెలల్లో కూటమి ప్రభుత్వం కొత్తగా చేసిన పని ఏదీ లేదు.ఇటీవల తుఫాన్ ప్రభావంతో జిల్లాలో పంటలు తీవ్ర నష్టపోయా యని, అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు.తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం తానే కొనుగోలు చేయాలి. అలాగే రైతులకు అవసర మైన గోనెసంచులను కూడా ప్రభుత్వం అందిం చాలి, అని చిన్న శ్రీను డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యద ర్శి నేక్కల నాయుడు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇప్పలి అనంత్, నరసింహ మూ ర్తి, గొర్ల రవి, వేణు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జైహింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేడియాలజీ దినోత్సవం వేడుకలతో మెరిసిన కేజీహెచ్

**ఎక్స్‌రే ఆవిష్కర్త రాంట్జెన్‌కు నివాళులు**

**రేడియాలజీ సేవల ప్రాధాన్యం పై అవగాహనకు పిలుపు**

**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 08 :**కింగ్ జార్జ్ ఆసుపత్రిలో అంతర్జాతీయ రేడియా లజీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా రేడియాలజిస్టులు, రేడియోగ్రాఫర్లు, వైద్య విద్యార్థులు ఉత్సా హంగా పాల్గొని ఎక్స్‌రే ఆవిష్కర్త డాక్టర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రేడియాలజిస్టుల సంఘం అధ్యక్షులు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ రేడియాలజీ ఆధునిక వైద్య రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలి పారు. ప్రజల్లో రేడియాలజీ సేవల ప్రాధాన్యంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు.ముఖ్య అతిథిగా హాజరైన కేజీహెచ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ వాణి మాట్లాడుతూ, ప్రజల నుంచి రేడియాలజీ సేవలపై ఉన్న విపరీతమైన డిమాండ్‌ను కేజీహెచ్ సిబ్బంది సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. సేవలను మరింత మెరుగుపరచడమే మా లక్ష్యం అని అన్నారు.రేడియాలజీ విభాగాధిప తి డాక్టర్ బుజ్జి బాబు మాట్లాడుతూ, 2025 అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవ థీమ్ ు రేడియోగ్రాఫర్స్: కంటికి కనిపించని దానిని చూపించేవారు అని గుర్తుచేశారు. రేడియోగ్రాఫ ర్లు వైద్య రంగంలో నిశ్శబ్ద వీరులుగా పనిచేస్తూ, అనేక ప్రాణాలను రక్షిస్తున్నారని ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో రేడియాలజీ ఫ్యాకల్టీ, రేడియోగ్రాఫర్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్ మరియు ఇమేజింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.




## 87 వార్డులో మౌలిక సదుపాయాలు కల్పనకై వినతులు





**గాజువాక పెన్ పవర్, నవంబర్ 08:**మహా విశాఖ నగరపాలక సంస్థ87వ వార్డు పరిధి వడ్లపూడి శివాజీ నగర్ లో డ్రైన్లు నిర్మించాలని, వీధి దీపాలు మరియు మంచినీటి సమస్యలను పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు వినతిపత్రం సమర్పించగా వార్డు పర్యటనలో భాగంగా రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం పరిశీలించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అపార్ట్మెంట్మెంట్లు నిర్మానాలు ఎక్కువ జరిగాయని. అపార్ట్మెంట్లు నిర్మించిన బిల్డర్ లు వ్యాపారం చేసుకుని మంచినీటి సదుపాయం మరియు సరైన డ్రైనేజ్ నిర్మాణం చెయ్యలేదని. ఇప్పుడు అపార్ట్మెంట్ లో ఫ్లాట్లు కొనుక్కున్నవారు వారు వినియోగిస్తున్న వాడకం నీరు పోవుటకు సరైన డ్రైన్ లేక ఆ మురుకు నీరు ఈ అపార్ట్మెంట్ లకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో చేరి నిలవ ఉండటం వలన దోమలు మరియు దుర్వాసనతో ప్రజలు నరకాయతన పడుతున్నారని. వీధి దీపాలు లేక ఆ ప్రాంతం చీకటిగా ఉందని వారి పరిస్థితిని చూసి సంబంధిత అధికారులు పిలిపించి తక్షణమే ఎస్టిమేషన్ వేయించి పని ప్రారంభం అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, బొండా శ్రీను, ఏఈ మహాలక్ష్మి, వర్క్ ఇన్స్పెక్టర్ నాయుడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సి.ఎస్. ఎన్ ట్రస్ట్ ద్వారా బోర్ వెల్





**అరకులోయ పెన్ పవర్ 8:**అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువెల్లి మండలం లోతేరు పంచాయతీ గల మారుమూల గ్రామమైన ధనసానివలస , కాగువలస. గ్రామములో సి.ఎస్. ఎన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వరంలో మంచినీటి సదుపాయం లేని గ్రామాలను గుర్తించి బోర్వెల్ వేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు మాట్లాడుతూ గ్రామస్తులకు జాగ్రత్తగా వాడుకోవాలని చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు .అలానే ఏ గిరిజన ప్రాంతంలో ఏ గ్రామం కైనా మంచినీటి సౌకర్యం లేకపోతే బోర్వెల్ ట్రస్ట్ ద్వారాగా నిర్మిస్తామన్నారు ,హాజరైన గ్రామ మహిళలు ట్రస్ట్ సభ్యులకు అభినందించారు ,ఈ కార్యక్రమానికి ట్రస్ట్ సెక్రటరీ కిల్లో అప్పలస్వామి ట్రస్ట్ మెంబర్లు తెలగంజి బికారి, (జాన్) అడారి అజయ్, బాబు . మాదల శ్రీనివాసరావు (నెహెమ్యా ) లోతేరు పంచాయితీ జనసేన యువ నాయకులు కిల్లో త్రినాథరావు పాల్గొన్నారు

## వార్డులో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే టిడిపి ప్రభుత్వం లక్ష్యం



**గాజువాక : పెన్ పవర్, నవంబర్ 08**
జీవీఎంసీ 66 వార్డులో సుమారు 50 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, సిసి డ్రైన్లు వేయడం సంగతి విధితమే, అజీమాబాద్ సీతారాం నగర్ ప్రాంతంలో సిసి రోడ్లు సిసి డ్రైనేజీలు పరిశీలించిన విశాఖపట్నం ఉపాధ్యక్షుడు ,66వ వార్డ్ టిడిపి ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ , ఈ ఈ రాయల్ బాబు , ఏడీ వెంకట్రావు , ఏఈ గ్రీన్స్ , వర్క్ ఇన్స్పెక్టర్ గంగరాజు కూటమి నాయకులు, రాష్ట్ర జనసేన నాయకుడు గంధ వెంకట్రావు , జనసేన 66వ అధ్యక్షుడు పోలా రౌతు వెంకటరమణ , 66 వార్డు మైనార్టీ నాయకులు ఆన్సర్ వల్లి, నన్న ,పోలాకి మహేష్ కుమార్, సాయిరాం , ఎలమంద, అన్వర్ మున్వర్ సరూప్ భాష కిరణ్ రాజు మనోహర్ రాజు తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన కూటమి నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## గిరిజన ప్రాంత ప్రజల పైన ఎనలేని ప్రేమను చూపిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

* అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 8:** జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు గిరిజన ప్రాంత ప్రజల పట్ల విశేషమైన ప్రేమాభిమానాలు ఉన్నాయని అందుకు నిదర్శనంగా రొంపల్లి గ్రామపంచాయతీ లోని గూడెం గ్రామం నిదర్శనమని, 75 ఏళ్ల నాటి కలను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిజం చేశారని మరొక్కసారి తన ప్రత్యేక ప్రేమను గిరిజనులపై చూపించరని అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గొర్లే వీర వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనంతగిరి మండలం రొంపల్లి గ్రామపంచాయతీలోని మారుమూల గిరిజన గ్రామం గూడెం విద్యుతీకరణ పొందింది. గూడెం, మండల ప్రధాన కార్యాలయం నుండి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో, 17 గిరిజన కుటుంబాల నివాసస్థానం. ఈ గ్రామానికి ఇంతవరకు రోడ్లు, సురక్షిత తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేవు. తరాలుగా ప్రజలు ఒంటరిగా, అడవి జంతువుల భయంతో రాత్రులు గడిపారు. గిరిజనుల ఇబ్బందులను గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐదు నెలలలో ఆ గ్రామానికి విద్యుత్ అందించాలని నిర్దేశించారు. ఆయన ఆదేశాల మేరకు, సుమారు 9.5 కిలోమీటర్ల వ్యవధిలో 217 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయబడింది. మొత్తం ప్రాజెక్టు ఖర్చు 80 లక్షల రూపాయల పైగా ఉండగా, 15 రోజుల్లోనే పూర్తి చేయబడింది. ప్రతి ఇంటికి ఐదు ఎల్ఈడి బల్బులు మరియు ఒక ఫ్యాన్ ఇచ్చి, స్వాతంత్రం తర్వాత గూడెం గ్రామానికి మొదిసారి విద్యుత్ వెలుగులు అందాయి. ఇది 17 గిరిజన కుటుంబాల జీవితాల్లో కొత్త కాంతి, సౌకర్యం తీసుకువచ్చింది. "గిరిజనుల పట్ల ప్రేమ, ఆదరణ కలిగిన వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ద్వారానే గిరిజన ప్రాంతం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది"అని గొర్లే వీర వెంకట్ అన్నారు.

## సింహాచలంలో వైభవంగా శ్రీ స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 8 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం, దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో నిత్య కల్యాణ మహోత్సవం శ్రద్ధ, భక్తి, ఆరాధనలతో అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. సాంప్రదాయ వైభవంతో సాగిన ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు ఉత్సవమూర్తి శ్రీ గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో కలిసి మండపంలో అధిష్ఠింపజేసి దేవస్థాన ఆచారానుసారంగా నిత్య కల్యాణం ప్రారంభించారు. ఆర్జిత సేవల్లో భాగంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పి, పాంచరాత్ర ఆగమశాస్త్ర విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శుభారంభం చేశారు. అనంతరం కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర%-%బెల్లం కలయిక, మాంగళ్యధారణ, తలంబ్రాల ప్రక్రియలు విశిష్టంగా, ఆచారపూర్వకంగా నిర్వహించబడ్డాయి. భక్తుల నినాదాలతో దేవస్థానం పరిసరాలు మార్మోగాయి. "జయ నరసింహా!", "గోవిందా గోవిందా!" ధ్వనులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమం అంతటా వేదపండితుల వేదఘోష, నాదస్వర ధ్వనులతో ఆ క్షేత్రం దివ్యమంగళంగా మారింది. మంత్రపుష్పం, మంగళాశాసనాల అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించగా, భక్తులు దైవానుగ్రహం పొందిన సంతోషంతో ఆనందభాష్పాలు మిగిల్చారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు కృషి చేసిన దేవస్థానం సిబ్బందికి, అర్చక వర్గానికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# సింహాచలంలో వైభవంగా శ్రీ స్వామివారి గరుడసేవ





**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 8 :** దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామివారి దేవస్థానంలో గరుడసేవ ఆధ్యాత్మిక వైభవంతో, భక్తి ప్రపత్తితో ఘనంగా నిర్వహించబడింది. సింహాచలక్షేత్రం తన ఆధ్యాత్మిక చారిత్రక ప్రాధాన్యాన్ని ప్రతిఫలిస్తూ మరోసారి భక్తుల హృదయాలను అలరించింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తి శ్రీ గోవిందరాజస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, మండపంలో అధిష్ఠింపజేశారు. ఆర్జితసేవలో భాగంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పి, పాంచరాత్ర ఆగమశాస్త్ర విధానంలో వేదపండితులు సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గరుడసేవ సందర్భంగా దేవస్థానం పరిసరాలు "జయ నరసింహా!" నినాదాలతో మార్మోగాయి. భక్తులు నృసింహస్వామివారి దివ్యరూపాన్ని దర్శించుకుని, తాము పొందిన దైవానుగ్రహంతో మంత్రముగ్ధులయ్యారు. మంత్రపుష్పం, మంగళాశాసనాలు అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం దివ్యమంగళంగా సాగి, పాల్గొన్న భక్తులందరికీ ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. కార్యక్రమం విజయవంతంగా నిర్వహణలో దేవస్థానం వర్గాల శ్రద్ధ, సేవభావం స్ఫూర్తిదాయకమని భక్తులు ప్రశంసించారు.

## సింహాచలంలో వైభవంగా శ్రీ స్వామివారి సహస్రనామార్చన



**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 8, 2025:** దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానంలో శనివారం నాడు స్వామివారి సహస్రనామార్చన మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించబడింది. దేవస్థానం పరిసరాలు భక్తి రసమయంగా మారి, నృసింహ నామస్మరణతో మార్మోగాయి. ఈ ఆర్జిత సేవలో భాగంగా, స్వామివారి ఉత్సవమూర్తి అయిన శ్రీ గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో కలిసి మండపంలో ప్రతిష్ఠాపించి సహస్రనామార్చన కార్యక్రమం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర నియమానుసారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు ఘనంగా నిర్వహించగా, భక్తుల గోత్రనామాలతో కూడిన సంకల్పం స్వీకరించారు. వేదపండితులు స్వామివారి సహస్రనామ స్తోత్ర పారాయణంను భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఆచార్యులు మంత్రపుష్పం, మంగళాశాసనాలతో కార్యక్రమాన్ని ముగించి, భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, మరియు ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు స్వామివారి అంతరాలయ దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణం పూలతో, దీపాలతో అలంకరించబడింది. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి కృపాకటాక్షం కోరుకున్నారు. భక్తులు స్వామివారి దర్శనం పొందుతూ "జై నరసింహా! జై సింహాచల నరసింహా!" నినాదాలతో ఆలయం నిండిపోయింది.

## జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా విశాఖ యువతికి గౌరవం

**గణప్రియను సత్కరించి అభినందించన ఎమ్మెల్యే గణబాబు**



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 1 :** జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 31న పార్లమెంట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ రాంపురం గ్రామం, పెందుర్తి మండలానికి చెందిన ఎం. గణప్రియ తన ప్రసంగంతో అందరి మనసులను గెలుచుకుంది. ఇంజినీరింగ్ విద్యార్థినిగా ఉన్న గణప్రియ జాతీయ ఐక్యత, దేశ సమైక్యత, యువత పాత్ర గురించి ఉత్తేజపూరితంగా మాట్లాడి ప్రశంసలు అందుకుంది.
ఈ విశిష్ట సందర్భంలో, విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు గణప్రియను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. యువతిలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గణప్రియ కుటుంబసభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలు ఈ గౌరవం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ప్రసంగించే అవకాశాన్ని పొందిన ఆమె సాధన ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

## జర్రెల పిహెచ్సీ వైద్యుడు డాక్టర్ మజీద్ బదిలీని రద్దు చేయాలి

**మొండిగడ్డ సర్పంచ్ అడపా ప్రియాంక డిమాండ్**



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 8:** అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెం కొత్తవీధి మండలం జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మజీద్ ను డిప్యూటేషన్ పై సీలేరు తరలించడంపై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మొండిగడ్డ గ్రామ సర్పంచ్ అడప ప్రియాంక మాట్లాడుతూ ౹ జర్రెల పిహెచ్సీలో డాక్టర్ మజీద్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, ఆయన వైద్య నైపుణ్యంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఆమె మాట్లాడుతూ "డాక్టర్ మజీద్ అందించే సేవల వల్ల స్థానిక ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా జర్రెల పిహెచ్సీకే వస్తున్నారు. ఇలాంటి వైద్యుడిని అకస్మాత్తుగా డిప్యూటేషన్ పై వేరే ప్రాంతానికి బదిలీ చేయడం ప్రజలకు నష్టకరం. అధికారులు ఆయన బదిలీని వెంటనే రద్దు చేసి జర్రెల పిహెచ్సీలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి," అని ఆమె డిమాండ్ చేశారు. జర్రెల పరిసర ప్రాంత ప్రజలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ, డాక్టర్ మజీద్ సేవలు కొనసాగడం వల్ల గ్రామ ప్రజలకు వైద్య సదుపాయాలు మెరుగుపడతాయి అని పేర్కొన్నారు.

## గులిమి అప్పారావు కుటుంబానికి ప్రభుత్వ విప్ గణబాబు ఆర్థిక సహాయం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, పెందుర్తి 8 :** గోపాలపట్నం కళా సేవ పీఠం సభ్యుడు, ప్రముఖ రంగస్థల నటుడు గులిమి అప్పారావు (68) గత మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు ఆదరణగా నిలిచారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ?50వేలు ఆర్థిక సహాయం చెక్కును అప్పారావు కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ "గులిమి అప్పారావు మంచి రంగస్థల నటులు. ఆయన ప్రదర్శించిన అనేక నాటకాలతో మన ప్రాంతానికి గౌరవం తీసుకువచ్చారు. ఆయన త్వరగా కోలుకొని మళ్లీ నాటకరంగంలో రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు. అలాగే ఆయన గోపాలపట్నం కళా సేవ పీఠం కార్యకలాపాలను ప్రశంసిస్తూ ౹ "కళా సేవ పీఠం రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం పెంచుతోంది. కూటమి ప్రభుత్వం కష్టాల్లో ఉన్న ప్రతి పేదవాడికి అండగా ఉంటుందనే ధ్యేయంతో ముందుకు సాగుతోంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా సేవ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు, గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు, అధ్యక్షులు గొరపల్లి బంగార్రాజు, మాజీ అధ్యక్షులు గోరకల రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# పెదగూడ సర్పంచ్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పాల్గుణ





పార్టీ అండగా ఉంటుందని భరోసా.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 08.** మండలంలో గల పెదగూడ పంచాయతీ, గూడమాలిపుట్టు గ్రామంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక సర్పంచ్ మండి బాబురావును అరకు మాజీ ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ శనివారం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. తన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదేవిధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోష్య రామకృష్ణ కుమారుడు మురళీమోహన్ మృతి చెందిన నేపథ్యంలో శనివారం పెద్దకర్మ చేయడంతో అందులో మాజీ శాసనసభ్యులు పాల్గుణ పాల్గొని మురళి మోహన్ చిత్రపటాని నివాళులర్పించారు. కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందనీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ తమర్బ గణపతి, సర్పంచ్ రమేష్, వైసీపీ పార్టీ శ్రేణులు, జయదేవ్, రాజారావు, సన్యాసిరావు, జగన్నాథం, పిత్త బాస్, పులి రాజు, హనుమంతరావు, పెదబయలు మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, కడిగిరి ఎంపీటీసీ పరదాని భీమలింగేస్, తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 14 షాట్ పుట్ క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి విజేత వైష్ణవి

- షాట్ పుట్ విభాగంలో ద్వితీయ స్థానం.
- జిటిడబ్ల్యూఎస్(గర్ల్స్) ప్రధానోపాధ్యాయులు ఎంవిఎస్ ప్రకాష్.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 08.** రాష్ట్ర స్థాయిల్లో అండర్ 14 షాట్ పుట్ క్రీడా పోటీలలో ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల - 2 విద్యార్థిని వి వైష్ణవి ద్వితీయ స్థానంలో నిలిచిందని ప్రధానోపాధ్యాయుడు ఎంవిఎస్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, పలాస, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గోవిందపుర్ లో జరిగిన అండర్ 14 రాష్ట్రస్థాయి షాట్ పుట్ క్రీడ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. నవంబర్ మూడవ తేదీన విశాఖపట్నంలోని కైలాసగిరి గ్రౌండ్లో జరిగిన క్రీడా పోటీల్లో షాట్ పుట్ విభాగంలో వైష్ణవి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. దీంతోనే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై శనివారం జరిగిన పోటీల్లో షాట్ పుట్ విభాగంలో ద్వితీయ స్థానంలో విజేతగా నిలిచి, డిసెంబర్ 4న మధ్యప్రదేశ్ లో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొంటుందని ఆయన తెలిపారు. స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి దక్కించుకున్న వైష్ణవి ను, పాఠశాల సిబ్బంది, మండల వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఈడి జే మన్మధరావు, పిఈటి పి నిలకంఠం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం ప్రజా వ్యతిరేకం కె.కె. రాజు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోంది



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 08** :ప్రజా ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు తీవ్రం గా విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఇచ్చే కుట్రపూ రిత నిర్ణయం ప్రజాభిప్రాయానికి వ్యతిరేకమని ఆయన అన్నారు. విశాఖ జిల్లా పార్టీ కార్యాల యంలో వైఎస్సార్‌సీపీ," ప్రజా ఉద్యమం" పోస్టర్‌ను కె.కె. రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నవంబర్ 12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజ కవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించనున్న ట్లు తెలిపారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యా, వైద్య రంగాలు ఒక సువ ర్ణయుగాన్ని చూశాయి. పేదల ఆరోగ్య భద్రతకు ఉద్దేశించిన అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభు త్వం ఆ కార్యక్రమాలన్నింటినీ నిర్వీర్యం చేస్తూ ప్రజా ఆరోగ్యం మీద దెబ్బ కొడుతోంది అని రాజు అన్నారు. తాజాగా విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో 12 గంటలకు పైగా విద్యుత్ సరఫ రా నిలిచిపోయినా ప్రభుత్వం స్పందించకపో వడం తమ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోగులు తీవ్ర ఇబ్బందు లు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు అని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 40 రోజులుగా వైఎస్సార్‌సీపీ శాంతియుతంగా నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా కోటి సంత కాల సేకరణ కూడా మహా ఉత్సాహంగా కొనసా గుతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, నియోజకవర్గ పరిశీలకుడు చింత కాయల సన్యాసిపాత్రుడు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లిపుట్టులో తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

- పిఎం జన్మన్ నిధులు 2 కోట్ల 14లక్షల రూపాయలు కేటాయించిన ప్రభుత్వం.
- బరడ పంచాయతీ సర్పంచ్ సీసా పార్వతి, ఎంపిటిసి కోడా నబ్బో.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబరు 08.** మండలంలో గల బరడ పంచాయతీ, బోద్ధపుట్ నుంచి గోలిపుట్టు వరకు పిఎం జన్మన్ నిధులతో సుమారు రెండు కిలోమీటర్లు 2కోట్ల 14 లక్షలు నిధులతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని పంచాయతీ సర్పంచ్ సీసా పార్వతి, ఎంపిటిసి కోడ నబ్బో తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొద్ధపుట్టు నుండి గొల్లిపుట్టు వరకు రహదారి నిర్మాణానికి అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ జగనాదం, వైసిపి నేత సీసా బాలరాజు, వైసిపి పంచాయతీ అధ్యక్షులు విక్రమ్, గ్రామస్తులు శివ, నాగేష్, ముకుంద, రామూర్తి, గోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ భీర్సా ముండా విగ్రహావిష్కరణకు ఒడిశా సీఎం, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరు






**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 8:** గిరిజన స్వాతంత్ర్య యోధుడు భగవాన్ భీర్సా ముండా 150వ జయంతి సందర్భంగా, ఈ నెల 17వ తేదీన విగ్రహావిష్కరణ కార్యక్రమం పాడేరు సమీపంలో ఘనంగా నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంజి, అలాగే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా, రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్, పాడేరు జనసేన పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్. వంపూరు గంగులయ్య ఆధ్వర్యంలో పాడేరు లో అఖిలపక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి భాజపా రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశం వనవాసి కళ్యాణ్ ఆశ్రమం సంచాలకుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా ప్రసంగించిన డాక్టర్. వంపూరు గంగులయ్య మాట్లాడుతూ "గిరిజన యోధుడు భగవాన్ భీర్సా ముండా స్ఫూర్తితో గిరిజన జాతి ఐక్యంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాము. ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఒడిశా ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరవడం గిరిజన సమాజానికి గౌరవకరం. స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన వీరుల త్యాగాలు మనకు మార్గదర్శకం," అని పేర్కొన్నారు. "ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామస్థాయి నుంచి ప్రతి గిరిజన యువకుడు, ప్రజా ప్రతినిధి భాగస్వామ్యం కావాలి. ఇది కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాని, దేశవ్యాప్తంగా గిరిజన సమాజానికి లభించిన అరుదైన గౌరవం," అని అన్నారు. ఈ సందర్భంగా గిరిజన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, అఖిలపక్ష నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, ఎఎంసీ డైరెక్టర్ పాంగి శివాజీ, జిల్లా కార్యనిర్వహణ కమిటీ సభ్యుడు తాంగులా రమేష్, పాడేరు పి.ఏ.సి.ఎస్. డైరెక్టర్ వంపూరు రమేష్, మండల అధ్యక్షులు మురళీకృష్ణ నందోలి, అధికార ప్రతినిధి బొంకుల దివ్యాలత, పట్టణ అధ్యక్షులు మజ్జి నాగేష్, సాలేబు అశోక్, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల సీబీఎస్ఈ ప్రాంతీయ సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించిన విజ్ఞాన్ స్టీల్ సిటీ పబ్లిక్ స్కూల్, దువ్వాడ





**కూర్మన్నపాలెం : పెన్ పవర్, నవంబర్ 08**

సి బి ఎస్ ఈ ప్రాంతీయ సైన్స్ ఎగ్జిబిషన్ విజ్ఞాన్ స్టీల్ సిటీ పబ్లిక్ స్కూల్, దువ్వాడలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సుమారు 40 పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేదిక యువ ఆవిష్కర్తలకు తమ శాస్త్రీయ జ్ఞానం, సృజనాత్మకత, పరిశోధనా నైపుణ్యాలనులిలి ప్రదర్శించే అద్భుత అవకాశం కల్పించింది.ఎమొదటి రోజున విద్యార్థులు వివిధ విభాగాలలో 80 వినూత్న ప్రాజెక్టులు ప్రదర్శించారు, వీటిలో వారి ఆసక్తి, పరిశీలనా దృక్పథం మరియు శాస్త్రీయ చైతన్యం ప్రతిబింబించాయి. అన్ని బృందాలు సి బి ఎస్ ఈ మార్గదర్శకాల ప్రకారం తమ ప్రదర్శనలు విజయవంతంగా పూర్తి చేశాయి. తుది సమావేశంలో విద్యార్థుల ప్రదర్శనలు, జ్యూరీ ద్వారా మూల్యాంకనం మరియు ఫలితాల ప్రకటన వెల్లడించారు.

జడ్జింగ్ ప్యానెల్‌లో ప్రముఖ నిపుణులు డా. సురేంద్ర కుమార్ శర్మ, సైంటిస్ట్ జి , బి ఎ ఆర్ సి విశాఖపట్నం. డా. ఎన్. తాతం నాయుడు అసిస్టెంట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్స్ విభాగం, కేజీహెచ్ ,ఎం ఎమ్ సి. ప్రొఫెసర్ కె. వెంకటేశ్వర్లు కంప్యూటర్ సైన్స్ %ఝ% ఇంజినీరింగ్ విభాగం, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం.

ఏ. శ్రీను అసిస్టెంట్ డైరెక్టర్, ఎం ఎస్ ఎం ఈ పి ఎఫ్ ఓ, భారత ప్రభుత్వంబీ మరియు ఎన్. వెంకట్ రెడ్డి సీఈవో టెక్కీ బోట్ అండ్ విహాన్ ఎలక్ట్రిక్, పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపిక చేయబడిన 14 ఉత్తమ వినూత్న ప్రాజెక్టులను ఎంపిక చేశారు. జాతీయ స్థాయి ప్రదర్శన ఢిల్లీ నగరంలో జరగనుంది.

సైన్స్ ఎగ్జిబిషన్ ఉద్దేశ్యం సి.బి.ఎస్ ఈ విద్యార్థుల్లో శాస్త్రీయ విచారణ,ఆవిష్కరణా దృక్పథాన్ని ప్రోత్సహించడం మరియు వాస్తవ జీవిత సమస్యలకు ఉపయోగకరమైన పరిష్కారాలు కనుగొనే నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడం.

విజ్ఞాన్ స్టీల్ సిటీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. మాధురి ఈ విలువైన అవకాశాన్ని కల్పించినందుకు సి బి ఎస్ ఈ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విధమైన కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచన, అన్వేషణా మనోభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# సమాచారం ఇవ్వకపోవడంతో మనస్థాపం - వార్డు సభ్యురాలు రాజీనామా



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 8:** అల్లూరి జిల్లా మండలం గూడెం కొత్త వీధి మండలం జీకే వీధి పంచాయతీకి చెందిన రెండవ వార్డు సభ్యురాలు జర్త రాజేశ్వరి తన పదవికి రాజీనామా చేశారు. అభివృద్ధి కార్యక్రమాలపై తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో మనస్థాపం చెంది రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో రెండవ వార్డు సభ్యురాలిగా ఎన్నికైన జర్త రాజేశ్వరి, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాల వివరాలు తనకు తెలియజేయడం లేదని తెలిపారు. ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమానికి కూడా తనకు సమాచారం అందించలేదని, దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నాకు సమాచారం ఇవ్వకుండా వార్డు పరిధిలో కార్యక్రమాలు నిర్వహించడం బాధాకరం. ప్రజా ప్రతినిధిగా నన్ను పక్కన పెట్టడమే తగదని భావించి రాజీనామా చేస్తున్నాను," అని ఆమె రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. జర్త రాజేశ్వరి తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు సమర్పించారు.

# ఆయుర్ జీవా కార్యక్రమం తాజా సమాచారం

**విశాఖ పెన్ పవర్ నవంబర్ 8:** ఈ రోజు ఆయుర్ జీవా సిబ్బంది అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవ అవగాహన కార్యక్రమంను అనకాపల్లి జిల్లా మహిళల కోసం నిర్వహించారు.




**మన సిబ్బంది వివరించారు:**

క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు
పోషకాహారపు అలవాట్లు మరియు ఆరోగ్యకరమైన జీవనశైలుల ప్రాముఖ్యత
ఆసుపత్రుల్లో లభించే వివిధ పరీక్షల గురించి సమాచారం
క్యాన్సర్ బాధితుల స్మరణార్థం దీపాలు వెలిగించారు

కార్యక్రమంలో అవగాహన పోస్టర్లు ప్రదర్శించబడ్డాయి. అన్ని మహిళలు చురుకుగా పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## జిల్లా విభజనలో ఏకపక్ష నిర్ణయాలు తగదు-సతీష్ బాబు



**గోపాలపురం, పెన్ పవర్, నవంబర్ 8.** జిల్లాల పునర్విభజనలో కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని పి సి సి సభ్యులు జ్యేష్ట సతీష్ బాబు అన్నారు. జిల్లాల పునర్విజనకు సంబంధించి శనివారం అయిన పత్రికా ప్రకటన విడుదల చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ముఖ్య కేంద్రమైన గోపాలపురం కేవలం 35 కిలోమీటర్ల దూరంలో జిల్లా ముఖ్య కేంద్రం రాజమహేంద్రవరం, 20 కిలోమీటర్ల దూరంలో కొవ్వూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం లు ఉన్నాయి అన్నారు. అయితే దగ్గర్లో ఉన్న వీటిని కాదని సుమారు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏలూరు జిల్లాలో గోపాలపురం కలపడం సరికాదు అని పలికారు. క్యాబినెట్ సభ కమిటీ పర్యటన చేసి ప్రజల నుండి ఏ రకమైన సలహాలు సూచనలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో జిల్లాల పునర్విభజన కార్యక్రమం చేపట్టడం మంచి పద్ధతి కాదు అన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల నియోజకవర్గ ప్రజానీకం ఎంతో ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి గోపాలపురాన్ని రాజమహేంద్రవరం జిల్లాలో మాత్రమే ఉండేలా చూడాలని కోరారు. లేని పక్షంలో అన్ని పార్టీల నాయకుల యొక్క అభిప్రాయం సేకరించి అఖిలపక్షం ఏర్పాటు చేసి పోరాటానికి సిద్ధమవుతామని సతీష్ బాబు గారు.

## ప్రింటింగ్ ప్రెస్ అధినేత శంకర్ మృతి



**అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్ 8:** ముద్రణారంగంలో సుమారు 40 సంవత్సరాలుగా అంబాజీపేట లో గౌరీ శంకర్ ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్న అప్పారి శంకరనారాయణ (58) అనారోగ్యం తో శనివారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బండారులంక గ్రామానికి చెందిన అప్పారి నరసింహమూర్తి అంబాజీపేట లో గౌరీ శంకర్ ప్రింటింగ్ ప్రెస్ ను స్థాపించారు. తదనంతరం ఆయన పెద్ద కుమారుడు శంకరనారాయణ (శంకర్) వారసత్వం గా తండ్రి స్థాపించి 58 సంవత్సరాలు అయ్యిందని అప్పటి నుండి మా అన్నయ్య శంకరనారాయణ ప్రింటింగ్ ప్రెస్ ను నిర్వహిస్తాడని ఇటీవల అనారోగ్యం తో బాధపడుతూ మృతిచెందారని సోదరుడు అప్పారి శ్రీను తెలిపారు. ఆయన కుటుమబానికి పలువురు సంతాపం తెలిపారు.

## రెండు ఇసుక లారీలు పట్టివేత



**జీలుగుమిల్లి, పెన్ పవర్, నవంబర్ 8 :** అక్రమంగా ఆంధ్ర నుండి తెలంగాణకి ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు ఎస్సై వి క్రాంత్ కుమార్ తెలిపారు .శనివారం లక్ష్మీపురం గ్రామం సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా వాటిని గుర్తించినట్లు తెలిపారు. ఇసుకకు సంబంధించిన బిల్లులు జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామానికి తరలిస్తున్నట్లు ఉన్నాయి. విచారించగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుండి తెలంగాణకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## స్కిల్స్ లో బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయికి ఎంపిక



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 08:** ఈనెల 7 న జిల్లా స్థాయిలో అమలాపురం నందు సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల వృత్తి నైపుణ్య పోటీలలో మండల కేంద్రంలోని డా. బొబ్బా జయశ్రీ జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్ టు కు చెందిన విద్యార్థినులు టి.గ్లోరీ, ఏం.లిఖితా రెడ్డి, యు.మణి బ్యూటీ లు వెల్ నెస్ విభాగంలో అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థాయి విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు సీనియర్ ఉపాధ్యాయులు కవి మల్లిక్ శనివారం తెలిపారు. ఈ మేరకు విజేతలకు జిల్లా స్థాయి అధికారులైన డిఈఓ షేక్ సలీం భాషా, ఏపిసి జి.మమ్మీ, ఒకేషనల్ కోఆర్డినేటర్ రమేష్, జిసిడిఓ ఏం.ఏ. కే.భీమారావు, తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తించి శిక్షణనిచ్చిన ఏం.లక్ష్మిని జిల్లా అధికారులు అభినందించారన్నారు. అలాగే హెచ్ఎం కె.ఉమకు, ఉపాధ్యాయ బృందానికి అధికారులు ప్రత్యేక అభినందనలు తెలియజేసినట్లు సీనియర్ ఉపాధ్యాయులు మల్లిక్ తెలిపారు.

## జన్ మన్ హౌసింగ్ లబ్ధిదారులకు పెంచిన లక్ష రూపాయలు విడుదల చేయాలి



**ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్.**

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 7 :**-చింతపల్లి గిరిజన ఉద్యోగుల భవనంలో ఆదివాసీ గిరిజన సంఘం చింతపల్లి, జీకేవీధిమండలాల సంయుక్త సమావేశం కొర్రా బాలయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ పీఎం జన్ మన్ హౌసింగ్ పథకం కింద పివిటిజీ గ్రామాల్లో ఇళ్లు నిర్మించిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు లక్ష రూపాయలు తక్షణమే చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ఈ పథకం కింద చేపట్టాల్సిన 11 రకాల అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరింది.

ఈనెల 10న అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు.

పీఎం జన్ మన్ పథకంలో భాగంగా పివిటిజీ కుటుంబాలకు ఇల్లు నిర్మాణానికి ?2.39 లక్షల యూనిట్ ధరతో మంజూరు చేసినప్పటికీ, పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలకు ఆ మొత్తం సరిపోవడం లేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ?1 లక్ష ఇవ్వాలని జీవో జారీ చేసినా, ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదని పేర్కొన్నారు.

అలాగే, పథకం ప్రకారం పివిటిజీ గ్రామాల్లో చేయాల్సిన అనుసంధాన రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, సామాజిక భవనాలు, చెక్ డ్యాంలు, అంగన్వాడీ భవనాలు, పోడు భూమి పట్టాలు వంటి అభివృద్ధి పనులు ఏ గ్రామంలోనూ పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్న పడాల్, మండల కార్యదర్శులు సాగిన చిరంజీవి, ముర్ల చంటిబాబు, నాయకులు సింహాచలం, రాంబాబు, దావిదు, లక్ష్మయ్య, రామచంద్ర, మహేష్, కృష్ణ, రమేష్, జగన్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లాలో రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభం





**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు/గూడెం కొత్త వీధి, పెన్ పవర్, నవంబర్ 8:** ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు అండర్ 14, 17, 19 విభాగాల్లో జరుగుతున్నాయి. రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి సుమారు 1000 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని పోటీలను మరింత ఉత్సాహభరితంగా మారుస్తున్నారు. మొట్టమొదటగా జరుగుతున్న ఈ పోటీలు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ యొక్క ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారుల సహకారంతో నిర్వహించబడుతున్నాయి. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పాంగి సూరిబాబు సారథ్యంగా ఈ పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ క్రీడా పోటీలు ముగిసిన తర్వాత, అండర్ 14 బాలబాలికలు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి, అండర్ 17 విభాగం రాంచీ (ఝార?ండ్), అండర్ 19 విభాగం మణిపూర్‌లోని ఇంఫల్‌లో జాతీయ స్థాయి పోటీలకు తరలించబడతారు. గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం పొందనున్నారు. క్రీడాకారుల సరసన మాజీ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి భవాని సత్యవతి, రాజులమ్మ, పద్మావతి, ప్రియాంక, బుద్ధ, బాలరాజ్, చంద్రరావు, బాబురావు, సద్దు మాధవరావు, రామారావు కృష్ణమూర్తి మరియు ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి శ్రీ పాంగి సూరిబాబు మాట్లాడుతూ, "ఈ పోటీలు విద్యార్థులలో క్రీడా ప్రతిభను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధం అవుతున్నారు" అని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఇతర అధికారులు పోటీలను పరిశీలించారు.



## కాఫీ కార్మికుల డిమాండ్ పై చర్చలు జరగాలి.

### సంస్థ రక్షణ కోసం సమ్మె కొనసాగిస్తామని హెచ్చరిక

**సిఐటీయు.**



**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 7:-** చింతపల్లి మండలం కొమ్మంగి ఎస్టేట్ గందల వీధి గ్రామంలో కాఫీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 10న చింతపల్లి డివిజనల్ ఆఫీసులో యాజమాన్యంతో చర్చలు జరగనున్నాయని, ఆ చర్చలు జయప్రదంగా సాగాలని తాము కోరుకుంటున్నామని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ విజ్ఞప్తి చేశారు.

ఇచ్చిన చర్చల నోటీసును చూపిస్తూ, ఈ చర్చలు సానుకూల దృక్పథంతో జరగాలని అన్నారు. సంస్థ రక్షణతో పాటు కార్మికుల ప్రయోజనం కోసం కాఫీ కార్మిక సంఘం సిఐటియు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. చింతపల్లి, పాడేరు, ఆర్వీ నగర్, నర్సీపట్నం డివిజనల్ మేనేజర్ల సంతకాలతో కూడిన నోటీసు ప్రకారం చర్చలు జరగనున్నాయని తెలిపారు. చర్చలు కేవలం సిఐటియు కాఫీ కార్మిక సంఘంతోనే జరగాలని, మరే ఇతర సంఘంతో కలిపి చర్చలు జరిపితే సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు.

డిమాండ్ల పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిఐటియు నాయకుడు మోరి వెంకటగిరి, కాఫీ కార్మికులు సిదరి రంభ, కంఠ కుమారి, సిదరి సన్యాసిరావు, వంతల రామారావు, సిదరి సాయి, మర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## జొన్నాడలో భారీ వన సమారాధన.



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 08:** మండలంలోని జొన్నాడలో వేంచేసియున్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో కార్తీకమాస(వన) అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టు ఆరాధనతో ప్రారంభమై అనంతరం జరిగిన వన సమారాధనలో సుమారు పదివేల మంది యాత్రికులు వివిధ గ్రామాల నుంచి హాజరయ్యారు. విందు భోజనాన్ని మించేలా విస్తరి నిండేలా ఐటమ్స్ ఏర్పాటు చేశారు. ఇందుకు దాతలు బొబ్బా సత్యనారాయణ మూర్తి, ఆయన కుటుంబ సభ్యులు కలసి సాంబార్, గోడవర్తి సత్యనారాయణ మూర్తి(జిఎస్ఎన్) కాజాతో పాటుగా రూ. 50,000 నగదు అందజేశారు. అలాగే నామాల వెంకట సుబ్బారావు చక్కెర పొంగలి, నెక్కంటి వీరబాబు బూరి, వంటిపల్లి కఅష్ణారావు మిరపకాయ బజ్జి,గన్ని సత్యనారాయణమూర్తి(పెద్దబ్బు) పులిహోర, నడిపల్లి వీర వెంకట సూర్య నాగ సతీష్, శిరీష దంపతులు పప్పు మామిడికాయ, నామాల లక్ష్మీ తులసమ్మ బంగాళాదుంప కర్రీ, ముత్యాల శ్రీనివాస్ దొండకాయ కొబ్బరికాయ, గన్ని చిన్న అబ్బు కంద బచ్చలి, వట్టికూటి సర్వేశ్వరరావు పెరుగు, నామల సూరిబాబు రూ. 10,000, కోపాక వెంకటేశ్వరావు రూ. 15,000, గొడవర్తి దుర్గా ప్రసాద్(బాబి), గన్ని సత్యనారాయణ మూర్తి, వట్టికూటి గణపతి లు కలసి రూ. 25,000, నామాల సత్యనారాయణ మూర్తి (వీరన్న) రూ. 5,116 సమకూర్చగా చిన్న మొత్తాలలో పలువురు దాతలు విరాళాలు అందజేశారు.

# శ్రీవల్లి కార్తికేయ ఆటో కన్సల్టెన్సీ ప్రారంభం

**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 8:** స్థానిక జేవిఆర్ సెంటర్ లో రాయల్ ఇన్ ఫీల్డ్ షోరూమ్ పక్కన నూతన వ్యాపార సంస్థ శ్రీవల్లి కార్తికేయ ఆటో కన్సల్టెన్సీ షోరూమ్ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ హాజరై షోరూమ్ ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, మాజీ మంత్రి తోట నరసింహం హాజరయ్యారు. ఈసందర్భంగా యజమానులు మాట్లాడుతూ శ్రీవల్లి కార్తికే ఆటో కన్సల్టెన్సీలో సెకండ్ హ్యాండ్ అన్ని రకాల బైకులు, అన్ని రకాల కార్లు సరసమైన ధరలకే లభిస్తాయని స్పాట్ ఫైనాన్స్ సౌకర్యం కూడా కలదని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, జగ్గంపేట ఏరియా మెకానిక్ సోదరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు సర్వ మత సమానాన్ని పాటించాలి-ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం,పెన్ పవర్, నవంబర్ 8:** ప్రతి ఒక్కరు సర్వమత సమానాన్ని పాటించవలసిన అవసరం ఎంతైనా ఉందని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నల్లజర్ల మండలం ప్రకాష్ రావు పాలెం గ్రామంలో శనివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల క్రైస్తవ మత బోధకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా డిసెంబర్ 14వ తేదీన క్రిస్మస్ వేడుకలు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని ప్రార్థనాలయాలకు చెందిన మత బోధకులు హాజరు అవ్వాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పలువురు పాస్టర్లు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రేషన్ కార్డులు, పింఛన్లు, రహదారులు, మురికి నీటి కాలువల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వార సిద్ధార్థ



**గోపాలపురం,పెన్ పవర్, నవంబర్ 8**
రాష్ట్రస్థాయి అండర్ 14 కబడ్డీ పోటీలకు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న వారా సిద్ధార్థ నింపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు పి వెంకట కనక పద్మ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14 బాలుర కబడ్డీ పోటీలు గోపన్నపాలెంలో జరిగాయన్నారు. ఆ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన తమ పాఠశాల విద్యార్థి సిద్ధార్థ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సిద్ధార్థ ను తనకు తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఈ రత్నరాజు, టి సురేష్, డి అశోక్ లను మండల విద్యాశాఖ అధికారులు జి శ్రీనివాసరావు, ఏ మహేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

# అమలాపురం డిపో నందు ఆన్ కాల్ డ్రైవర్లుకు ఆహ్వానం

**అమలాపురం, పెన్ పవర్, నవంబర్ 08:** ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపోలో రోజువారీ వేతన ప్రాతిపదికన ఆన్ కాల్ డ్రైవర్ పోస్టుల భర్తీకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించబడుచున్నవి.
**అర్హతలు:** డ్రైవింగ్లో నైపుణ్యం కలిగి, 2 సంవత్సరాలు దాటిన హెవీ లైసెన్స్, లేటెస్ట్ జెన్యూన్ సర్టిఫికెట్లు మరియు సేవా భావం కలిగిన నిరుద్యోగ డ్రైవర్ సోదరులు అమలాపురం డిపోలోని సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ శ్రీ%. రమేష్ బాబు, ఫోన్ నం : 94410 41270, 7382909829 లను సంప్రదించగలరు.

# పార్టీ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం-సత్యనారాయణ





**గోపాలపురం,పెన్ పవర్, నవంబర్ 8**
తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నాయకులు కార్యకర్తలు అభిమానులు సమిష్టిగా కృషి చేయాలని టిడిపి మండల శాఖ మాజీ అధ్యక్షులు రంగాల సత్యనారాయణ అన్నారు. టిడిపి గ్రామ నాయకుల సమావేశం ఏపీఎస్ ఆవరణలో శనివారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు బూరెడ్ వాసు అధ్యక్షతన జరిగినఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రొంగల సత్యనారాయణ, జ్యేష్ఠశ్రీధర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు నాయకులు కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా రజక , గౌడ పేటల తో పాటు పెద్దగూడెం వెళ్లే రహదారి వంటి పలు సమస్యలను సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# నేడు సుబ్రమణ్య మైదానంలో ఉద్యోగ మేళా - మెప్మా పిడి టి. కనక రాజు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 8:**మెప్మా , నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 9 గంటల నుంచి ఉద్యోగ మేళా ను స్థానిక సుబ్రమణ్య మైదానం లో నిర్వహించ నున్నట్లు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి కనక రాజు శనివారం తెలియ చేశారు.రిటైల్, హెల్త్కేర్, బ్యాంకింగ్ , ఫైనాన్స్, హాస్పిటాలిటీ, మాన్యు ఫాక్చరింగ్, ఎడ్యుకేషన్ వంటి విభిన్న రంగాలకు చెందిన 15 కంటే ఎక్కువ ప్రఖ్యాత కంపెనీలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొననున్నాయన్నారు.ఈ మేళా నిరుద్యోగ యువతకు, ఉద్యోగార్థులకు అనుకూలమైన ఉపాధి అవకాశాలను కల్పించడానికి వేదికగా నిలుస్తుందన్నారు. అర్హతలు: 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మా, నర్సింగ్ మొదలైన విద్యార్హతలు కలిగిన వారు పాల్గొనవచ్చున్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ విజ్ఞప్తి చేశారు.ప

## కరాటే మాస్టర్ తాండ్రోతు వీర వెంకటరమణకు డాక్టరేట్



**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 8:** జగ్గంపేటకు చెందిన కరాటే మాస్టర్, డి ఫిట్నెస్ జిమ్ అధినేత తాండ్రోతు వీర వెంకటరమణకు విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ వారు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. 1986 నుండి కరాటే మాస్టర్ గా సేవలందిస్తూ గవర్నమెంట్ హైస్కూల్ నుండి అన్ని స్కూళ్లలో నేర్పిస్తూ జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో కరాటే పోటీల్లో స్టూడెంట్స్ కొన్ని వేల మెడల్స్ సాధించే విధంగా ట్రైనింగ్ ఇస్తున్నారు. 2017 నుండి ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్ క్లాసుల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జిగా పనిచేస్తున్నారు. 2001లో జిమ్ కోచ్ గా పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ ఫిట్నెస్ కోచింగ్ ఇస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులను పంపిస్తున్నారు. 2004 నుండి జూడో ఒలంపిక్ గేమ్ కోచింగ్ ఇస్తూ జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో ప్రతి సంవత్సరం 100 మందికి పైగా జూడో పోటీల్లో కోచింగ్ ఇచ్చి స్టూడెంట్స్ ని పంపిస్తున్నారు. వారు ఎన్నో మెడల్స్ సాధిస్తూ రాష్ట్రంలో ఛాంపియన్షిప్ మన జిల్లాకు రావడమే మనకు గర్వకారణం. ఆంధ్ర యూనివర్సిటీలో జూడో బోర్డ్ మెంబర్ గా సేవలందిస్తూ జేఎన్టీయూ యూనివర్సిటీ బోర్డ్ జూడో మెంబర్ గా నన్నయ యూనివర్సిటీ జూడో బోర్డు మెంబర్ గా స్పోర్ట్స్, ఫిట్నెస్ కోచింగ్ తీసుకున్న 100 మందికి పైగా ఈయన విద్యార్థులు గవర్నమెంట్ ఉద్యోగాలు సాధించారు. గత 40 సంవత్సరాలుగా ఎటువంటి ఫీజు తీసుకోకుండా ఉచితంగా కరాటే, జూడో, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ ఉచితంగా నేర్పించి ఎంతోమంది విద్యార్థులు తీర్చిదిద్దిన ఆయన ఇప్పటికీ ఎంతమంది వచ్చినా ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలియజేస్తున్నారు. ఆయనకు గౌరవ డాక్టరేట్ రావడంతో ఆయన ఎన్నాళ్లు చేస్తున్న సేవలకు సరైన గౌరవం దక్కిందని ఆయన సన్నిహితులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## పీఎంపీల కార్తీక వనసమారాధన



**కోరుకొండ, పెన్ పవర్, నవంబర్8:**కమ్యూనిటీ పారామెడిక్స్%ఉ%ప్రైమరీ హెల్త్ కేర్ (ప్రావైడర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) కోరుకొండ మండలం ఆధ్వర్యంలో రాజమండ్రి సన్ స్టార్ హాస్పిటల్ వారి సహకారంతో బూరుగుపూడి ఆకుల వెంకటేశ్వరరావు(రత్నా వారి) తోటలో శనివారం మండల అధ్యక్షులు కుంచే వినోద్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు, కార్తిక వనసమారాధన జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బళ్ళా శ్రీనివాసరావు,పి దేవానందం లు మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో ఇలాంటి వనసమారాధన ద్వారా సాంప్రదాయ ఆహారం, అలవాట్లు అలవాటు అవుతాయని సంపూర్ణ ఆరోగ్యం కు ఈ ఆహారపు నియమాలే ఉపయోగపడతాయని అన్నారు.తొలుత ఉసిరిచెట్టు వద్ద కార్తీక మాసం దామోదర పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా కోశాధికారి పి చిన్ని,బూరుగుపూడి ప్రాథమిక వైద్యులు అడపా శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు,రాజమండ్రి అధ్యక్షులు రహమాన్ ఖాన్,రాజమండ్రి మండల కార్యదర్శి మట్టా రమేష్, కోరుకొండ మండల కార్యదర్శి సూరిశెట్టి భాస్కర్, కోశాధికారి బీహెచ్ శివకుమార్,రాజమండ్రి కోశాధికారి యు ప్రసాద్ బాబు, రాజానగరం మండల కార్యదర్శి కే సత్తిబాబు, కోశాధికారి ఏ నాగేశ్వరరావు, టి రామకృష్ణ,పీవీఎస్ ప్రసాద్,గంగాధర్, జోగారావు,డి వీర్రాజు, లతో పాటు సభ్యులు హాజరయ్యారు.

## తులిప్స్ లో జాతీయ సమైక్యత వేడుకలు...




**అమలాపురం, పెన్ పవర్, నవంబర్ 08:** జాతీయ సమైక్యతను చాటుతూ అమలాపురం తులిప్స్ పబ్లిక్ స్కూల్ లో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతి,సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఆయా వేష ధారణతో చిన్నారులు అలరించారు.అంతేకాకుండా జాతీయ నాయకులు,స్వాతంత్ర్య సమరయోధులు,ప్రకృతితో మమేకమై జీవించే రైతుల వేష ధారణతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు తాము ధరించిన వేషాల విశిష్టతను వివరించారు.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నెల్లి రమేష్, ప్రిన్సిపాల్ నెల్లి సబిత,ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు...

# భీమవరం లో ఫిట్ ఇండియా

* ఉత్సాహం గా "సైక్లోథాన్ 5కె సైకిల్ ర్యాలీ"

**భీమవరం, పెన్ పవర్ నవంబర్ 8 :**పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు కార్యాలయం ఆధ్వర్యంలో, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సమన్వయంతో "ఫిట్ ఇండియా" కార్యక్రమం భాగంగా నిర్వహించిన "సైక్లోథాన్ 5కె సైకిల్ ర్యాలీ" శనివారం ఉత్సాహంగా సాగింది.
జిల్లా కలెక్టర్ సి. నాగరాణి, మరియు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.
శనివారం ఉదయం 7 గంటలకు విష్ణు కళాశాల ప్రాంగణం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ, ఆరోగ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ నగరం గుండా సాగే 5 కిలోమీటర్ల మార్గం అనంతరం అల్లూరి సీతారామరాజు స్మృతివనం వద్ద ముగిసింది.
జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ, ప్రజలు మరియు అధికారుల ఆరోగ్యం దృష్ట్యా జిల్లా యంత్రాంగం ప్రతి నెలా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానుందని తెలిపారు. ఇకనుండి ప్రతి నెలా 2కే రన్, యోగా, సైక్లింగ్, వాక్ వంటి వ్యాయామ కార్యక్రమాలను పోలీసు మరియు రెవెన్యూ అధికారులతో కలసి నిర్వహిస్తామని వెల్లడించారు.
జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, మాట్లాడుతూ, శారీరక మరియు మానసిక ఆరోగ్యం ప్రాధాన్యతను గుర్తు చేశారు. కలెక్టర్ నాగరాణి చొరవను ఆయన అభినందిస్తూ, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు భవిష్యత్తులో మరిన్ని విభిన్న ఆరోగ్య కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.
ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ, జిల్లాను ఆరోగ్యవంతమైన మరియు ఉత్సాహక జిల్లాగా మార్చడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. యువత క్రీడలు, వ్యాయామాలపై దృష్టి సారించాలంటూ ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.వి.వి. సత్యనారాయణ, భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్. జయసూర్య, నరసాపురం సబ్ డివిజన్ డీఎస్పీ జి. వేద, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ డీఎస్పీ డి. విశ్వనాథ్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.వి.వి.ఎన్. సత్యనారాయణతో పాటు రెవెన్యూ అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘనంగా భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతోత్సవం..



**అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్ 8,** భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శత జయంతి మహోత్సవాన్ని అంబాజీపేటలో శనివారం వైభవంగా నిర్వహించారు. అంబాజీపేటకు చెందిన నిట్టాల రామం స్వగృహం వద్ద ఆయన కుమార్డు నిట్టాల విజయసాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం ఓంకారము, సుప్రభాతము,నగర సంకీర్తన, పతాకావిష్కరణ గావించారు. సాయంత్రం దీపారాధన, కలశ స్థాపన, అభిషేకము, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం అంబాజీపేట జోన్ భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో అఖండ నామ సంకీర్తన నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించే జయంతోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం (నేడు) సాయంత్రం పునః పూజ,మంగళహారతి, తీర్థ ప్రసాదములు అందజేస్తామని నిట్టాల విజయసాయి తెలిపారు.

# రామవరం-రాజుపాలెం రోడ్డు పనులు వెంటనే మొదలుపెట్టాలి

* అధికారులకు సూచించిన ఎమ్మెల్యే నెహ్రూ





**జగ్గంపేట, పెన్ పవర్, నవంబరు 8:** జగ్గంపేట మండలం రామవరం నుంచి కిర్లంపూడి మండలం రాజుపాలెం వెళ్లే ప్రధాన రహదారి పనులు వెంటనే మొదలు పెట్టాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధికారులకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే నెహ్రూ అధికారులను రామవరం గ్రామం తీసుకొచ్చి ఈ గ్రామంలో ప్రజలు పడుతున్న కష్టాలను వివరించారు. అనంతరం రామవరం సచివాయలంలో అధికారులతో సమావేశమయ్యారు. త్వరితగతిన రోడ్డు ఏర్పాటు చేయడం లేదా మరమత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు పెద్ద పెద్ద గుంతలమయంగా మారడంతో వర్షాలు పడిన సమయంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వెంటనే ఈ రోడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రామవరం గ్రామంలో హైవే నుంచి ముత్యాలమ్మ చెరువు వరకు పూర్తిగా సిమెంటు రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే నెహ్రూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# రేపాక గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించాలి...



**కూనవరం,పెన్ పవర్,నవంబర్ 8.** పోలవరం ముంపులో మండలంలోని రేపాక గ్రామాన్ని కలపాలంటూ సిపిఎం మండల కార్యదర్శి బాబు బోరయ్య రేపాకు గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపాక గ్రామాన్ని 41.15 కాంటూర్ లో చేర్చాలని భూమి ప్యాకేజీ,ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.2022 సంవత్సరంలో ప్రభుత్వం పోలవరం ముంపునకు గురయ్యే గ్రామాలను రైడర్ సర్వేల ద్వారా గుర్తించినప్పుడు రేపాక గ్రామంలో ఊరి మధ్యలో రైడర్ సర్వే సంబంధించిన ప్లస్ గుర్తు స్టాగును వేశారు.కానీ ఆ గ్రామాన్ని కాంటురులో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు.సచివాలయంలోని సర్వేయర్ల సిబ్బందితో సర్వే చేయించడమే కాకుండా డ్రోన్ కెమెరాలతో సర్వే కూడా చేశారు.కానీ రేపాక గ్రామాన్ని 41.15 కాంటురులో చేర్చలేదని అన్నారు.రేపాక గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ ని కలిసి మా గ్రామాన్ని ముంపులో ఎందుకు చేర్చలేదని రైడర్ సర్వేలో ముంపుగా గుర్తించిన కలపలేదని లేదని అడిగినప్పుడు,ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారితో విచారణ చేస్తామని హామీ ఇచ్చారు.రైడర్ సర్వే పేరుతో ముంపు బాధితులను తప్పుడు తడకల లెక్కలు చూపి నిర్వాసితులను గందరగోళం చేస్తున్నారని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు స్థానిక సర్పంచ్ మడకం నాగమణి,మడకం బుజ్జి,మడకం సత్యనారాయణ,మడకం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితులను మోసం చేస్తున్న ప్రభుత్వం




* కొండ మొదలు గ్రామస్తుల వలె మిగతా గ్రామస్తులకు భూమి ఇవ్వాలి
* కేంద్రంతో ఒప్పందం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మించడం తగదు
* ప్రభుత్వానికి నిధులపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులపై లేదు
* నిర్వాసితుల తరపున రాష్ట్రపతి, గవర్నర్ల కు వినతి నివేదికలు
* ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు సూర్యనారాయణ

**రాజమహేంద్రవరం,పెన్ పవర్, నవంబర్,8:** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను రాష్ట్ర ప్రభుత్వం మోసగిస్తుందని , సగం ప్యాకేజీ మాత్రమే ఇచ్చి దళిత , గిరిజనలకు అన్యాయం చేస్తున్న వ్యవహారంపై రాష్ట్రపతికి, గవర్నర్ కు లేఖలు సమర్పిస్తామని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో సగం చెల్లించారనే ఆందోళనతో ఉన్న నిర్వాసితుల ఫిర్యాదులు స్వీకరించేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేసారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2014 జనవరి 1వ తేదీ నుండి అమలులోకి వచ్చిన కొత్త భూసేకరణ చట్ట ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల 86 వేలు, ఇతర కులస్థులకు రూ.6 లక్షల 36, వేలు చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్యాకేజీ పెంచితే ఒక్కొక్క నిర్వాసితుడికి రూ.11 లక్షల 80 వేలు, ఎస్టీలు అటవీ ఉత్పత్తుల కోల్పో తున్నందున పీసా చట్టం ప్రకారం ఒక్కొక్కరికి రూ.2 లక్షలు అదనంగా కలిపి ఎస్టీలకు రూ.13 లక్షల 80 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఆర్థికంగా నష్టం కలిగేలా వ్యవహరిం చడం కూడా ఎస్సీ, ఎస్టీ చట్ట ప్రకారం నేరమేనని 2016 సవరణ చట్టంలో ఉందన్నారు. 2018 సవరణ చట్టం లో కొత్తగా సెక్షన్ 18ఎ చేర్చారన్నారు. ఈ సెక్షన్ ప్రకారం ప్రభుత్వ అధికారులపై బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ జరుపకుండానే ఎఫ్.ఐ.ఆర్. నమోద వుతుందన్నారు. అధికారులు ఎస్సీ, ఎస్టీలకు చెల్లించే ఆర్థిక అంశాల్లో చట్ట ప్రకారం వ్యవహరించాలని లేకుంటే నేరస్థులవుతారని ఆదివాసీ మహాసభ తరపున హెచ్చరించారు. కాగ్ నిర్ణయం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంతో ఎంఓయు కుదుర్చుకుని పనులు చేపట్టాల్సి ఉందని , ఇంతవరకు ఒప్పందం కూదుర్చుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. గిరిజనులు, ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై ఆదివాసీ మహాసభ తరపున ప్రజా , న్యాయ పోరాటం సాగిస్తామని స్పష్టం చేసారు. ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే కొండ మొదలు గ్రామం మినహా, మిగతా 275 గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ఖాళీ చేశారని అధికారులు హైకోర్టును తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. వాస్తవానికి పోలీసు బలగాలతో బలవంతంగా ఖాళీ చేయించారని గుర్తు చేశారు. దాంతో ప్రభుత్వం కొండ మొదలు గ్రామస్తులకు మాత్రమే ఒకొక్కరికి ఎకరం భూమి కేటాయిస్తూ 426 ఎకరాల భూమి కొనుగోలుకు నిధులు విడుదల చేసిందన్నారు. జాతీయ ప్రాజెక్టు కింద నిర్వాసితులయ్యే 270 పైబడి గ్రామాల నిర్వాసితులకు భూమికి భూమి తో పాటు, కూడా చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.60 వేల కోట్ల రూపాయలు నిధులు తెచ్చు కుంటూ, భూ సేకరణ చట్టం 2013 ప్రకారం కనీసం 10 శాతం కూడా నిర్వసితులకు ఖర్చు చేయకపోవడం బట్టి రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులను మనుషులుగా చూడడం లేదని అర్థమవుతుందన్నారు. పోలవరం పేరు చెప్పి గత జగన్ ప్రభుత్వం,నేటి కూటమి ప్రభుత్వాలు ఇతర పథకాలకు మళ్ళిస్తున్నాయని విమర్శించారు. జగన్ ప్రభుత్వం 2021 లో రూ.10 లక్షలు ఆర్ఆర్ చెల్లిస్తామని జీవో విడుదల చేయగా, అమలకు నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం ఇంతవరకు నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియలలో దేశీయ, విదేశీ నిపుణులతో పర్యవేక్షణకు ఆసక్తి చూపిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసం పై ఎందుకు శ్రద్ధ చూపించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈనెల 1వ తేదీన ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుతో నిర్వాసితులకు సగం ఆర్ఆర్ ప్యాకేజీ ఇచ్చారని, మిగతా సగాన్ని ఎగవేతకు పాల్పడి గిరిజనులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక నిధులు మళ్లింపులను నివారించేందుకు, నిర్వాసితులకు న్యాయం జరిగేందుకు, జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మహాసభ నాయకులు మిడియం వెంకటస్వామి, అరగంటి వీరభద్రారెడ్డి, మిడియం వెంకటేష్, గిన్నెపల్లి వెంకటరెడ్డి, సరియం విజయ రత్నకుమార్, జక్కులు పాండవులు, అరగంటి నాగిరెడ్డి, తాళ్లూరి రామిరెడ్డి, న్యాయవాది చిలకమర్తి వెంకటరత్నం పాల్గొన్నారు.

# లబ్ధిదారుల సమస్యల పరిష్కార దిశగా కార్యాచరణ

## భీమడోలు గృహనిర్మాణ సంస్థ ఏఈ చైతన్య కృష్ణ





**ఏలూరు నవంబర్ 7 పెన్ పవర్:** భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ముందుగా వందేమాతర గీతం ఆలాపించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షులు కొండబాబు అధ్యక్షత వహించారు.ఈ గ్రామ సభలో గుండుగలను గ్రామ పరిధిలోని గణేష్ నగర్ భో, లక్ష్మీపురం లేఅవుట్ల లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ గ్రామ సభలో ఏ ఈ చైతన్య కృష్ణ మాట్లాడుతూ గుండుగొలను గ్రామ పరిధిలో 1050 ప్లాట్లు ప్లాట్లు లక్ష్మీపురం భోగాపురం భోగాపురం గణేష్ నగర్ లేఅవుట్లలోని లబ్ధిదారులకు కేటాయి మంజూరు చేయడం జరిగిందన్నారు.వాటిలో 587 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని కాలనీలలో నివసిస్తున్నారు. 463 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సి పూర్తి కావాల్సి ఉందన్నారు. వీటిలో 375 మంది లబ్ధిదారులు కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. వీటిలో లెంటల్ బేస్మెంట్ స్థాయిలో 193 నిర్మాణాలు ఉన్నాయన్నారు.ఈ నిర్మాణాలు వేగవంతం చేసి లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేసి ఈ ఏడాది డిసెంబర్ నాటికి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఇళ్ల నిర్మాణాలలో లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటిని నియోజకవర్గ నేతల దృష్టికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి గృహ నిర్మాణ సంస్థ కృషి చేస్తుందన్నారు.లబ్ధిదారుల సమస్యలు గుర్తించడానికి వీఆర్వోలు హౌసింగ్ అసిస్టెంట్లు గృహ నిర్మాణాలు పూర్తికాని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిర్మాణాలు చేపట్టేందుకు ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని గృహ నిర్మాణ సంస్థకు తెలియపరుస్తారన్నారు. ప్రభుత్వం స్థలం మంజూరు చేసిన ఇల్లు కట్టుకుంటారా లేదా అనే విషయం, ఎందుకు నిర్మాణం చేపట్టలేదు,స్థలం ఎందుకు వద్దంటున్నారు అనే విషయం కూలం కుశంగా లబ్ధిదారులతో చర్చించి, రుణ సదుపాయం కల్పిస్తే కల్పిస్తే ఇల్లు కట్టుకుంటారా లేదా నిర్మాణానికి ఏమైనా సమస్యలు ఉన్నాయా? తదితర అంశాలను తెలుసుకొని,ఈ ఏడాది డిసెంబర్ లోగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లక్ష్మీపురం లేఅవుట్లో 19 మంది కి ప్లాట్లు మంజూరు చేయగా 19 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు వీటిలో 25 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి శాంక్షన్ పెట్టామని 21 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సమస్యలు ఉంటే గృహ నిర్మాణ సంస్థ ద్వారా రుణ సౌకర్యం కల్పించడం డ్వాక్రా ద్వారా రుణాలు మంజూరు చేయడం అనే అంశాలపై ఈ గ్రామసభలో లబ్ధిదారులకు కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సిఎస్ డి టి భరత్ కుమార్, మాజీ ఎంపీటీసీ, గృహ నిర్మాణ సంస్థ, రెవెన్యూ,సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

# అడ్డుకొండ భూమిలో ఇండస్ట్రియల్ పార్క్ ఆలోచన విరమించుకోవాలి




కర్నాకుల వీరాంజనేయులు

**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 8:** మల్లిసాల, కె.గోపాలపురం మధ్యలో ఉన్న అడ్డుకొండ భూమిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. ఈనెల 11వ తేదీన కాకినాడ జిల్లా జగ్గంపేటలో జరిగే విప్లవ అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో శనివారం ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా మల్లిశాల, కే.గోపాలపురం మధ్యలో ఉన్న ప్రభుత్వ పోరంబోకైన అడ్డుకొండ (585 ఎకరాల) భూమిని రెండు గ్రామాల్లో ఉన్న నిరుపేదలకు పంచి పెట్టాలని పోరాటం సాగిస్తూనే ఉన్నా ప్రభుత్వాలు ఎన్ని మారినా ఆ భూమిని పేద ప్రజలకు దక్కనీయకుండా చూస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించుకున్న స్థానిక నియోజకవర్గం కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కూడా ఈ భూమిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నారని, ఆ ఆలోచన విరమించుకోవాలని ఆయన అన్నారు. నవంబర్ మాసమంతా విప్లవ అమరవీరులను స్మరించుకుంటూ జగ్గంపేటలో 11, కాకినాడలో 15, రంపచోడవరంలో 22, రాజమండ్రిలో 25తేదీలలో జరిగే విప్లవ అమరవీరులు సంస్మరణ సభలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, రైతులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ టీ యు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు కర్నాకుల రామలింగేశ్వర రావు, గ్రామ నాయకులు మరుకుర్తి అబ్బులు, అప్పారావు, బోడకుర్తి అప్పారావు, బోడకుర్తి అన్నారం, ముత్త చందర్రావు, ఆగంటి అప్పారావు, కుంకునుపుడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వికాస్ ఫార్మసీ కళాశాలకు యుజిసి అటానమస్ స్టేటస్...



**కోరుకొండ, పెన్ పవర్, నవంబర్ 8:** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం మధురపూడి వికాస్ ఫార్మసీ యూజీసీ అటానమాస్ స్టేటస్ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కళాశాల ఏవో తన్నీరు ఉదయభాస్కరరావు ప్రకటన విడుదల చేశారు. దేశంలో ప్రథమంగా యూజీసీ అటానమస్ స్టేటస్ గుర్తింపు లభించిందన్నారు. సౌండ్ ఎలోన్ ప్రైవేట్ ఫార్మాసి కళాశాల అయిన వికాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రతిష్టాత్మక స్వయం ప్రతిపత్తి హోదాని అధికారికంగా ప్రకటించిందని వెల్లడించారు. దేశంలోనే ప్రప్రథమంగా వికాస కళాశాలకు భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ తన్నీరు వెంకట నారాయణ, ఆ కళాశాల సెక్రటరీ డాక్టర్ తన్నీరు భరత్ వికాస్, ప్రిన్సిపల్ డాక్టర్ సుమలత, కళాశాల చైర్మన్ తన్నీరు చిన్న సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ మురళీధర్, పి వాసు బాబు, ఇబ్బందులకు దేశంలోని పలు రాష్ట్రాల నుండి కళాశాల యాజమాన్యాలు ప్రిన్సిపల్ అభినందన తెలియజేసినట్లు తెలిపారు కళాశాల అవలంబిస్తున్న అంతర్జాతీయ నాణ్యత పరిణామాలను పరిశీలించి ఈ హోదా కల్పించడం ముదావహం అన్నారు.

# కుంకుమపూడి గ్రామస్తుల ఏకగ్రీవ నినాదం : "మేమంతా జగన్ అన్న వెంటే!"





- కూటమి నాయకుల కల్లబొల్లి మాటలు ప్రజలను ప్రభావితం చేయలేవు
- ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, నవంబర్ 8:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం కుంకుమపూడి గ్రామస్తులు ఏకగ్రీవంగా "మేమంతా జగన్ అన్న వెంటే ఉంటాం, ఎప్పటికీ వైసీపీతోనే ఉంటాం" అని ప్రకటించారు. గ్రామస్థులు కూటమి నాయకుల అబద్ధపు ప్రచారాలు, కల్లబొల్లి హామీలు ప్రజలలో ఎలాంటి నమ్మకాన్ని కలిగించలేవని తెలిపారు.వారి మాటల్లో "ఇల్లులు మంజూరు చేస్తాం, దరఖాస్తులు ఇవ్వండి" అంటూ గ్రామస్తులను పిలిపించి ఫోటోలు తీసి, తరువాత "కుంకుమపూడి గ్రామం టీడీపీ లో చేరింది" అని పత్రికల్లో ప్రచారం చేయడం కూటమి నాయకుల దురుద్దేశపూరిత చర్య అని విమర్శించారు.జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోడు భూములకు పట్టాలు, రైతు రుణ సదుపాయాలు, రైతు భరోసా, అమ్మఒడి, పెన్షన్, చేయూత, వాహన మిత్ర వంటి అనేక సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాలను మార్చారని గ్రామస్థులు గుర్తుచేశారు.ఇక ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్, రైతు భరోసా 20,000, నిరుద్యోగులకు 3,000, మహిళలకు 1,500 రూపాయలు వంటి హామీలను ఇచ్చి ఒక్కటినీ సరిగ్గా అమలు చేయలేదని మండిపడ్డారు."జగన్ మోహన్ రెడ్డి కులం, మతం, పార్టీ తేడా లేకుండా అందరికీ అభివృద్ధి చేశారు. కానీ ప్రస్తుత కూటమి నాయకులు మా పార్టీ లో చేరితేనే పథకాలు ఇస్తామని చెబుతున్నారు ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం" అని గ్రామస్థులు స్పష్టం చేశారు. "ఇకపై ఇలాంటి రాజకీయ ఒత్తిడి, మోసపూరిత చర్యలు చేయరాదని హెచ్చరిస్తున్నాం," అని గ్రామస్థులు హెచ్చరిక జారీ చేశారు.

**ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన:**

ఈ సందర్భంగా జీకే వీధి మండల పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో "ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం" నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జీకే వీధి సర్పంచ్ కొర్ర సుభద్ర, మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, యూత్ అధ్యక్షులు కొర్ర బాబి,ఎస్టి సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణరావు,వైసీపీ సోబోయి రామూర్తి, కొర్ర కృపా కొర్ర నూకరాజు, గెమ్మెల మార్క్, కొర్ర సీమన్న, అలాగే కుంకుమపూడి గ్రామస్థులు కొర్ర గౌతమ్, కొర్ర చందర్‌రావు, కొర్ర వెంకటరావు, వంతల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల యోజన 3.0 పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు

- గ్యాస్ కనెక్షన్ లేని కుటుంబాల మహిళలకు లబ్ధి
- ఉద్యోగస్తులకు ఈ పథకం వర్తించదు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 8:**ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) 3.0 పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ఈ పథకం ద్వారా ఇంతవరకు గ్యాస్ కనెక్షన్ పొందని కుటుంబాల మహిళలకు మాత్రమే లబ్ధి చేకూరనుంది.ఈ విషయాన్ని గూడెం కొత్త వీధి గ్యాస్ గోడౌన్ మేనేజర్ దేశగిరి కృష్ణ పడాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. "ఈ పథకంలో 18 సంవత్సరాలు నిండిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబంలో ఎవరైనా ఇప్పటికే గ్యాస్ కనెక్షన్ పొందిన వారు అయితే ఈ పథకానికి అర్హులు కారు. అలాగే ఉద్యోగస్తులు కూడా ఈ పథకానికి అర్హులు కారని" అయన వివరించారు.ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు"రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు,కుల ధృవపత్రం,బ్యాంక్ ఖాతా వివరాలు,తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు"పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ పరిధిలో ఉన్న సమీప గ్యాస్ ఆఫీస్ లేదా గ్యాస్ గోడౌన్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు."ప్రధానమంత్రి ఉజ్వల యోజన 3.0 పథకం పేద మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రారంభించబడింది," అని దేశగిరి కృష్ణ పడాల్ తెలిపారు.

# కొత్తపల్లి గ్రామంలో బోరు పనులకు ఎంపీటీసీ నాగమణి ఆధ్వర్యంలో శంకుస్థాపన

- కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి సాధ్యం
- గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 8:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జీకే వీధి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బోరు పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ పనులు జీకే వీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి నిధులతో, మండల పరిషత్ నిధుల ఆధారంగా చేపట్టబడ్డాయి.ఈ సందర్భంగా ఎంపీటీసీ పసుపులేటి నాగమణి మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం అభివృద్ధి పట్ల కట్టుబడి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధి కోసం విస్తృతంగా నిధులు మంజూరు చేస్తుంది "అని తెలిపారు.ఆమె మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో మండల పరిషత్ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రిమెల రాజేశ్వరి, బీజేపీ నాయకులు రేమెల పాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు అరికట్ట ఆంజనేయులు, ఉప సర్పంచ్ కొర్ర రాంబాబు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జర్రెల పిహెచ్సిలో డాక్టర్ మజీద్ సేవలు కొనసాగించాలని డిమాండ్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 8:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రెల ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మజీద్ ను డిప్యూటేషన్ పై వేరే స్థానానికి బదిలీ చేయడం భావ్యం కాదని, ఆయన సేవలు కొనసాగించాలనే డిమాండ్ సాగుతుంది.వంచుల సర్పంచ్ వనపల కాసులమ్మ మరియు పాడేరు నియోజకవర్గ వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడు వనపల రాజేష్ మాట్లాడుతూ, జర్రెల ప్రాంత ప్రజలకు డాక్టర్ మజీద్ సేవలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వారు మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ మజీద్ అందించిన వైద్య సేవల వల్ల ఆసుపత్రిలో ఓపీలు పెరిగాయి. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళకుండా జర్రెల పిహెచ్సి కి రావడం ప్రారంభించారు.ఆయన రోగులను చక్కగా చూసే విధానం ప్రశంసనీయమని.ఇలాంటి డాక్టర్ను డిప్యూటేషన్ పై బదిలీ చేయటం సరైన పద్ధతి కాదు అన్నారు.అందువల్ల, స్థానికులు అధికారులు డాక్టర్ మజీద్ సేవలు జర్రెల పిహెచ్సిలోనే కొనసాగేలా తక్షణమే చర్యలు తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వం ఇస్తున్న పరిహారంపై రైతులు అభ్యంతరం...






**నాతవరం,పెన్ పవర్ (నవంబర్ 08):** అర్సల్ మెటల్ స్టీల్ ప్లాంట్ కంపెనీ కొరకు నాతవరం మండలం ఎంబి పట్నం పంచాయతీ ఏ. శరభవరం గ్రామం వద్ద గల ఏలూరు కాలువ నుంచి నక్కపల్లి వరకు నీటి సరఫరా కోసం పైప్ లైన్ నిర్మాణం జరుగుతుంది.ఏ.శరభవరం ఏలేరు కాలువ నుండి నీటిని డంప్ చేయడం కొరకు రెండు ఎకరాల భూమిని సేకరణ చేయడం జరుగుతుంది. అయితే ఆ భూములో గల పైల సత్యం,కర్రి ప్రసాద్ అనే ఇద్దరు రైతులు మాత్రం ప్రభుత్వం ఇస్తున్న పరిహారంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి శనివారం అధికారులు సర్వే చేస్తుండగా ఆ ఇద్దరు రైతులు మాకు ఇచ్చే పరిహారం సరిపోదని దీన్ని పెంచాలని డిమాండ్ చేశారు. తమకు పరిహారం పెంచే వరకు భూమిని ఇచ్చే ప్రసక్తే లేదని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేసైన పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని వారు అన్నారు. దీనిపై తాసిల్దార్ ఏ వేణుగోపాల్ ను వివరణ కోరగా అందులో దాదాపు ఎకరా 56 సెంట్లు ఏపీఎస్ఈ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందని,44 సెంట్లు కు సంబంధించి ఇద్దరు రైతులు మాత్రమే ఎక్కువ పరిహారం కావాలని డిమాండ్ చేస్తున్నారని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని అన్నారు.

# జిల్లా స్థాయి ఒకేషనల్ కోర్సులో బాయ్స్-1 పాఠశాలకు జిల్లా స్థాయి బహుమతి.




**అల్లూరి జిల్లా కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 8** అల్లూరి జిల్లా పాడేరు లో నిర్వహించిన వోకేషనల్ కోర్స్ జిల్లా స్థాయి స్కిల్ కాంపిటీషన్ లో కొయ్యూరు బాయ్స్ -1 పాఠశాల (బిఎఫ్ఎస్ఐ ) బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్విస్, అలాగేఇన్స్యూరెన్స్ కోర్స్ లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి లభించినట్టు పాఠశాల ప్రధానోఫాధ్యాయులు సి హెచ్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్యాంకింగ్ సర్విస్, అలాగే ఇన్స్యూరెన్స్ కోర్స్ వోకేషనల్ టీచర్ మాకిరెడ్డి శ్యామ్ మహేష్ బాబు ఇచ్చిన గైడెన్స్ తో విధ్యార్థులకు ఈ జిల్లా స్థాయి ప్రథమ బహుమతి వచ్చినట్టు హెచ్ ఎం తెలిపారు. ఎలెక్ట్రానిక్ అండ్ హార్డ్ వేర్ వోకేషనల్ టీచర్ బొడ్డు సిసింద్రీ నాయుడు శిక్షణ తో తదుపరి విద్యార్థులకు జిల్లా స్థాయి సెకండ్ బహుమతి ధక్కినట్టు హెచ్ ఎం తెలిపారు. ఈ కాంపిటెషన్ లో విజేతలకు అసిస్టెంట్ కలెక్టర్ సాహితీ, జిసిడిఓ కవిత చేతుల మీదుగా ఈ బహుమతులు విధ్యార్థులు పొందినట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి సిల్క్ కాంఫీటేషన్ కి (బిఎఫ్ఎస్ఐ) ట్రేడ్ ఎంపిక అయ్యినట్టు హెచ్ ఏం శ్రీనివాసరావు తెలిపారు. తమ పాఠశాల నుంచి పాల్గొన్న విధ్యార్థులకు జిల్లా ,రాష్ట్ర స్థాయి బహుమతులు లభించటం పట్ల పాఠశాల ఉపాద్యాయులు, సిబ్బంది ఈ విధ్యార్థులను అభినందించారు.

# అక్రమ మైనింగ్ నిరోధించడంలో అధికారుల తక్షణ చర్యలకు ధన్యవాదాలు....









## లెక్కల వెంకట్ ఎన్నారై...

**నాతవరం,పెన్ పవర్ (నవంబర్ 08):** ప్రభుత్వ భూముల రక్షణ, ఏలేరు కాలువ ఒడ్డున అక్రమ మైనింగ్ నిర్వహించడంలో అధికారులు తీసుకున్న తక్షణ చర్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎన్నారై లెక్కల వెంకట్ తెలిపారు. మండలంలో గల చెర్లోపాలెం పంచాయతీలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ త్రవ్వకాలపై శనివారం ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఎన్నారై లెక్కల వెంకట మాట్లాడుతూ చెర్లోపాలెం గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఏలేరుకాల ఒడ్డున అక్రమంగా గ్రావల్ త్రవ్వకాలు చేసి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇసుక మరియు గ్రావెల్ నిల్వచేసి ప్రజలకు అక్రమంగా అమ్ముతున్నాడని ఆయన తెలిపారు. అంతేకాకుండా భారీ వాహనాలతో గ్రామ రహదారులను దెబ్బతీస్తూ అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని అన్నారు. అయితే ఈ అక్రమ మైనింగ్ కార్యకలాపాలు గత కొన్ని సంవత్సరాలుగా కొంతమంది నాయకుల సహకారంతో కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి,వీఆర్వో, ఎమ్మార్వో పోలీస్ శాఖల దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే తక్షణమే స్పందించి, వాహనాలను స్వాధీనం చేసుకొని నాతవరం పోలీస్ స్టేషన్ కు సదరు వ్యక్తిని తీసుకువెళ్లడం అభినందనీయమని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములను రక్షించడం, ఏలూరు కాలవ వడ్డున జరుగుతున్న అక్రమ మైనింగ్ ను అడ్డుకోవడంలో అధికారుల కృషి, నిబద్ధత ధైర్వంతమైన చర్యలు ప్రశంసనీయమని తెలిపారు.దీనిపై తాసిల్దార్ ఏ.వేణుగోపాల్ ను మీడియా అడగగా చర్లోపాలెం గ్రామానికి సంబంధించి చెరువు పోరంబోక భూములో చాలా కాలం నుండి రమేశ్ అనే వ్యక్తి గ్రావెల్ వేస్తూ, ట్రిప్పర్లు పెడుతూ ప్రజలకు ప్రభుత్వానికి ఇబ్బంది కలుగజేస్తున్నాడని గుర్తించి,స్థానిక ఎస్సై కి లెటర్ రాయడం జరిగిందని, దానిని ఆధారంగా చేసుకుని అక్కడ జరుగుతున్నది వాస్తవమేనని తెలిసిన ఎస్ఐ సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారని వేణుగోపాల్ తెలిపారు.

# మాగంటి ఫ్యామిలీ ట్రబుల్



**హైదరాబాద్ నవంబర్ 8, పెన్ పవర్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మాగంటి గోపీనాథ్ మృతి పై తలెత్తుతున్న ఆరోపణలు సంచలనంగా మారాయి. స్వయంగా మాగంటి గోపీనాథ్ తల్లి మహానందకుమారి చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ ప్రభావం ఎన్నికలపై చూపే అవకాశముంటుందని తెలిపారు. మాగంటి గోపీనాథ్ తన భార్యకు విడాకులు ఇవ్వకుండా మాగంటి సునీతను వివాహం చేసుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. అయితే ఆయనను ఆసుపత్రిలో మరణించినప్పటికీ బయటకు చెప్పకుండా ఎందుకు దాచిపెట్టారో చెప్పాలని మహానందకుమారి ప్రశ్నించారు. చివరకు తన కుమారుడిని చివరి చూపు చూసేందుకు కూడా తనను ఎందుకు అనుమతించలేదంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనంగా మారాయి.మరొకవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా మాగంటి గోపీనాథ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కేసులో ఆరోపణలను ఎదుర్కొంటున్న వారిని ఎందుకు అరెస్ట్ చేయరని ప్రశ్నించారు. మాగంటి గోపీనాథ్ మృతిపై ఉన్న మిస్టరీని బాహ్య ప్రపంచానికి తెలియజెప్పాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా దీనికి సమాధానం ఇచ్చారు. మరణంపై ఫిర్యాదు ఎవరైనా చేస్తే విచారణ చేస్తామని తెలిపారు. ఏతల్లీ కుమారుడు మరణంపై వివాదం చేయరని అన్నారు. తల్లి చేసిన వ్యాఖ్యలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు విచారణ చేస్తారని తెలిపారు. ఆ వివాదంలోకి తనను లాగ వద్దని తెలిపారు. మాగంటి గోపీనాథ్ మృతి విచారకరమని, అయితే దీనిపై వివాదాలుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.మరొకవైపు మాగంటి గోపీనాథ్ వారసత్వంపై కూడా వివాదం బయలుదేరింది. మాగంటి సునీతకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ ఇవ్వడంపై గోపీనాథ్ భార్య మాలినీ దేవి, కుమారుడు ప్రద్యుమ్న తారక్ తో పాటు గోపీనాథ్ తల్లి మహానందకుమారి కూడా ఫిర్యాదు చేశారు. తాను దగ్గరుండి మాలినీదేవికి, గోపీనాథ్ కు వివాహం చేశానని, అయితే తాను సునీతతో వివాహం చేయలేదని తెలిపారు. ఈ వివాదంపై శేరిలింగంపల్లి తాహసిల్దార్ కార్యాలయానికి చేరింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రధాన రాజకీయ పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో గులాబీ పార్టీ తరపున పోటీ చేస్తున్న మాగంటి సునీతకు సంబంధించిన వ్యవహారం ఒకటి తెరపైకి వచ్చింది. వాస్తవానికి మాగంటి గోపీనాథ్ కు సునీత రెండవ భార్య.. ఆయనకు గతంలోనే వివాహం జరిగింది.. ఆయన మొదటి భార్య పేరు మాలిని దేవి.. ఆయన ద్వారా ఆమెకు ఒక కుమారుడు సంతానంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల గోపినాథ్ మొదటి భార్య కొడుకు విలేకరుల ఎదుటకు వచ్చారు. సునీత గోపీనాథ్ కు చట్టబద్ధమైన భార్య కాదని ఆరోపించారు. ఆమెకు తమ ఇంటిపేరు వాడుకునే అధికారం లేదని పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్ సునీతకు నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై విచారణ కూడా సాగించారు. ఇది జరుగుతుండగానే మాగంటి గోపీనాథ్ మాతృమూర్తి విలేకరుల ఎదుటికి వచ్చారు. ఆమె కూడా కొన్ని సందేహాలను వ్యక్తం చేశారు..మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆ విషయం ఆమెకు చెప్పలేదట. ఆస్పత్రిలో ఉన్నప్పుడు అతడిని చూసేందుకు వీలులేదని చెప్పారట. ఇదే విషయాన్ని కేటీఆర్ తో చెబితే.. నేను చూసుకుంటా అన్నాడట. ఆ తర్వాత ఆస్పత్రిలో ఆమెకు తెలియకుండానే వేరే మార్గం నుంచి వెళ్లిపోయారట. కేటీఆర్ వచ్చి వెళ్లిన తర్వాత తన కొడుకు చనిపోయాడు అని చెప్పారని.. తన కొడుకు మరణం వెనుక తెలియని విషయాలు చాలా ఉన్నాయని ఆమె వాపోయారు. అంతేకాదు మాగంటి సునీత ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హురాలు కాదని ఆమె వ్యాఖ్యానించారు. మరోవైపు మాగంటి గోపీనాథ్ మొదటి భార్య, ఆయన కుమారుడు విలేకరుల ఎదుట వచ్చారు. వారు కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. మొత్తంగా చూస్తే మాగంటి గోపీనాథ్ కుటుంబ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ పరిణామం ఎక్కడికి దారి తీస్తుంది? సునీత విజయం సాధిస్తుందా? కుటుంబ సభ్యులు అనేక ప్రశ్నలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మాగంటి సునీత భవితవ్యం ఏమవుతుందనేది తెలియాల్సి ఉంది.వారసత్వం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం చుట్టూ నడుస్తున్న వివాదంపై అధికారులు కూడా స్పందించారు. కుటుంబ సభ్యులు విచారించిన అనంతరం తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు. మొత్తం మీద మాగంటి గోపీనాథ్ కుటుంబంలో తలెత్తిన విభేదాలు ఈ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముందన్న విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

# గులాబీకి దగ్గరవుతున్న ముస్లింలు

**హైదరాబాద్, నవంబర్ 8, పెన్ పవర్**

రాజకీయక్షేత్రంలో ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేయడంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అపర చాణక్యుడు అనే విషయం అంద రికీ తెలిసిందే. ప్రత్యర్థులను తన వ్యూహాలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరిన నాయకుడు కేసీఆర్. అయితే కేసీఆర్ రాజకీయ చతురతను, అనుభవాన్ని ఆయన కుమారుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుణికిపుచ్చుకున్నారు. తండ్రికితగ్గ తనయుడు అనే విధంగా ప్రస్తుతం తన వ్యూహాలను అమలుపరుస్తున్నారు.ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ల సందర్భంగా బీఆర్ఎస్ ప్రచారంలో కేటీఆర్ అవలంబిస్తున్న రాజకీయ ఎత్తుగడలే ఇందుకు నిదర్శనం. అయితే కేటీఆర్ ఊహించిన విధంగానే కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ బుట్టలో పడినట్టు కనిపిస్తున్నది. వాస్తవానికి జూబ్లీహిల్స్ మెట్రో పాలిటన్ నగరమైన హైదరాబాద్ పరిధిలో ఉంది. సహజంగానే గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ తక్కువగా నమోదు అవుతుంది.మూడు ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో నమోదు అయిన పోలింగ్ శాతాన్ని గమనించినా ఇదే పరిస్థితి. గత మూడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేవలం 50 శాతానికి కాస్త అటు ఇటుగా పోలింగ్ నమోదైంది. అయితే మొత్తం ఓట్లలో కేవలం 30 శాతం ఓట్లను సాధించిన అభ్యర్థి గెలుపు పక్కా అవుతుంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ముస్లిం ఓటర్లకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఎందుకంటే జూబ్లీహిల్స్‌లో దాదాపు 25 శాతం ముస్లిం ఓటర్లు ఉన్నారు.దీంతో బీఆర్ఎస్, కేటీఆర్ ముస్లిం ఓటర్లను ఆకర్షించడంలో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. వ్యూహాలకు అనుగుణంగా కార్యాచరణ అవలంబించి కాంగ్రెస్ పార్టీకి ముస్లిం ఓటర్లను దూరం చేయడంలో సఫలీకృతం అయ్యా రు. వాస్తవానికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గెలుపొందడంలో ముస్లింలే కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో ఎంఐఎం పార్టీ కూడా బీఆర్ఎస్‌కు సహకరించడంతో గెలుపు మరింత సులువు అయింది.అయితే ఉప ఎన్నికలు వచ్చేసరికి పరిస్థితులు తారుమారు అయ్యా యి. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్‌ను బరిలో నిలిపింది. దీంతో బీసీ సామా జికవర్గంలోని ఇతర కులాల ఓట్లతోపాటు యాదవుల ఓట్లన్నీ కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతాయని అంచనా వేసింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో నవీన్‌యాదవ్ ఎంఐఎం పార్టీ నుంచి పోటీచేసిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో ఎంఐఎం పార్టీ ఉప ఎన్నికల్లో అభ్యర్థిని నిలుపకుండా కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న నవీన్ యాదవ్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడమే కాకుండా కాంగ్రెస్‌కు 30 వేల మెజార్టీ వ స్తుందని అంతా భావించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన వ్యూహాలకు పదును పెట్టారు. తనకున్న వాక్చాతుర్యం, భాషా నైపుణ్యంతో అటు తెలుగు, ఇటు ఉర్దూలోనూ మాట్లాడి ముస్లిములను ఆకట్టుకున్నారు.ముస్లింలకు కాం గ్రెస్ ప్రభుత్వ మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల పాలనలో ముస్లింలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింలకు కల్పిం చిన ప్రాధాన్యతను ముస్లింలకు వివరించారు. మంత్రివర్గంలో ముస్లింలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ రాజకీయ ఎత్తుగడలను అధికార పార్టీ పసిగట్టలేకపోయింది. కేటీఆర్ వేసిన ట్రాప్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పడిపోయారు. జూబ్లీహిల్స్ రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్ లేవనెత్తిన మంత్రి పదవి అంశంతో ముస్లింల నుంచి పెరిగిన ఒత్తిడికి తలొగ్గిన సీఎం రేవంత్‌రెడ్డి ఉప ఎన్నికలకు కొద్ది రోజులే ఉన్నా అజారుద్దీన్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించారు. అయితే అజారు ద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంతోనే అసలు సమస్య మొదలైంది. వాస్తవానికి ముస్లిం వర్గాలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఆధిపత్యాన్ని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లింలు జీర్ణించుకోలేకపోతున్నారు.ఉప ఎన్నికల సందర్భంగా ఎంఐఎం మద్దతుపై అసంతృప్తితో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సర్దుకుపోయారు. ఇదిలాఉండగా ముస్లింలలో ఎంఐఎం ప్రాధాన్యత, ఆధిపత్యాన్ని తగ్గించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టింది. అయితే అజారుద్దీన్‌కు మంత్రి పద వి ఇవ్వ డం అసదుద్దీన్‌కు గిట్టకపోవడంతో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య చిచ్చు రేగింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ సందర్భంగా అసదుద్దీన్ మద్ద తు ప్రకటించడం, ఎంఐఎం నాయకులు నవీన్ యాదవ్ తరపున ప్రచారం పాల్గొన్నప్పటికీ తాజా పరిణా మాలతో ఈ రెండు పార్టీల మధ్య దూరం పెరిగిందని స్పష్టమవుతుంది. దీంతో అసదుద్దీన్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు దూరంగా ఉండటమే కాకుండా కేవలం బీహార్ ఎన్నికలపై దృష్టి సారించారు. ఎంఐఎం నాయకు లు, కార్యకర్తలు కూడా కాంగ్రెస్ సహకరించడం లేదు.దీనికి తోడు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఎంఐఎం ం పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయడం లేదని అనడంతో ఈ రెండు పార్టీల మధ్య ఉన్న చిచ్చుకు మరింత ఆజ్యం పోసినట్టు అయిం ది. దీంతో డామేజీను గ్రహించిన కాంగ్రెస్ పార్టీ అజారుద్దీన్‌ను కూడా ప్రచారానికి దూరంగా ఉంచుతుంది. కాంగ్రెస్ అనాలోచితంగా ఎంఐఎం మద్దతు తీసుకోవడంపై కాంగ్రెస్‌లోని ముస్లింలు..అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో ఎంఐఎం పార్టీకి సంబంధించిన ముస్లింలు, ప్రస్తుతం ప్రచారానికి దూరంగా ఉంచడంతో అజారుద్దీన్ సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ పరిణామాలతో మొత్తంగా జూబ్లీహిల్స్‌లోని ముస్లింల ఓట్లన్నీ బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపుతున్నాయి. తాజాగా ఉప ఎన్నికలపై పలు సంస్థలు చేసిన సర్వే నివేదికలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాయి. ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయంగా కన్పిస్తున్న ది. రేవంత్‌రెడ్డిని ట్రాప్‌లోకి దింపి, ముస్లింల ఓట్లను చాకచక్యంగా తమ వైపు తిప్పడంలో కేటీఆర్ వ్యూహం సమర్థవంతంగా ఫలించింది. తద్వారా జూబ్లీహిల్స్ గడ్డపై మరోసారి గులాబీ జెండాను పాతేందుకు మార్గం సుగ మం అయిందని పరిశీలకులు భావిస్తున్నారు.

# హన్మాపురం ఐకేపీ సెంటర్ ను తనిఖీ చేసిన కలెక్టర్



**యాదాద్రి: పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేసారు. భువనగిరి మండలం హన్మాపురం గ్రామంలోని ఐకెపి సెంటర్ ను సందర్శించారు. ధాన్యాన్నివెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే జియో ట్యాగ్ ఎంటర్ చేయాలని అధికారులను ఆదేశించారు..

# సీఎం రేవంత్ జన్మదినం యాదాద్రిలో ప్రత్యేక పూజలు

**యాదాద్రి: పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శుభాకాంక్షలు విలువ పోటెత్తుతుంది. సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా.. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు గోత్రనామాలతో అర్చకులు అర్చన చేసారు.

# ఇన్నోవా పల్టీ పలువురికి గాయాలు



**నల్గొండ: పెన్ పవర్:**నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, గుండ్రాంపల్లి వద్ద జాతీయ రహదారి 65 హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో వెళ్తున్న ఇన్నోవా వాహనం.. అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ప్రమాద ధాటికి.. ఇన్నోవా వెహికల్ రోడ్డుపైనే పల్టీలు కొట్టింది. దీంతో, కార్ ఇంజన్ లో మంటలు చెలరేగి, వాహనం నడిరోడ్డుపైనే దగ్ధమయింది. అయినప్పటికీ.. ఇన్నోవా నుంచి ఎనిమిది మంది సురక్షితంగా 8 మంది ప్రయాణికులు ప్రాణాలతో బైట పడ్డారు. వాహనం రోడ్డుకు అడ్డం పడడంతో హైద్రాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవే పై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఓ లారీ అదే సమయంలో రాగా.. అందులో ప్రయాణిస్తున్న వారు.. ప్రాణాలకు తెగించి.. ఇన్నోవా వెహికల్ లోని ప్రయాణికులకు కాపాడారు. ఈ క్రమంలో వారికి కాలిన గాయాలు అయ్యాయి. మొదటగా చౌటుప్పల్ ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

# ఎన్నిక ప్రచారం దోశలు వేసిన మంత్రి జూపల్లి



**హైదరాబాద్, నవంబర్ 8: పెన్ పవర్:**జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారంలో పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, మద్యనిషేధ %ి% ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని సుల్తాన్‌నగర్‌లో నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేయాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని, ప్రజలు ఈ ఉపఎన్నికలో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.సుల్తాన్ నగర్ లో ప్రచారం చేస్తున్న మంత్రి జూపల్లి.. ఓ హోటల్‌లో దోసెలు వేసి అక్కడ ఉన్నవారిని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు.

# బీసీల కోసం మరో ప్లాన్...



**హైదరాబాద్, నవంబర్ 8, పెన్ పవర్:** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, బీసీల ఓటు బ్యాంకును పూర్తిగా తమవైపు ఉండేలా ప్లాన్‌లు వేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే రిజర్వేషన్ల పెంపునకు ప్రయత్నాలు చేస్తోంది. ఇది ఇప్పటికీ కోర్టుల్లో పెండింగ్‌లో ఉంది. కొత్త రిజర్వేషన్ల ఆధారంగానే స్థానికసంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావించినప్పటికీ న్యాయపరమైన చిక్కులు, కేంద్రం మోకాలు అడ్డేయడంతో వీలు కాలేదు. అందుకే ఇప్పుడు మరో ప్లాన్ వేస్తోంది. రాష్ట్రంలో మరో డిప్యూటీ సీఎం పదవిని క్రియేట్ చేయబోతోంది. అది బీసీలకు ఇవ్వాలని చూస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల తర్వాత మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికే దీని కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే మంత్రి పదవుల్లో ఉన్న వారికి ఉద్వాసన పలికి కొత్త వారికి స్థానం కల్పించాలని భావిస్తున్నారు. వివాదాలను సృష్టిస్తున్న వారి స్థానంలో మరికొందరు సీనియర్లను మంత్రివర్గంలోకి తీసుకుంటారు. అలా తీసుకున్న వారిలో బీసీలతో మ్యాచ్ చేయాలని చూస్తోంది. ఇలా తీసుకున్న బీసీల్లో ఒకరికి ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టనున్నారు. ఇప్పటికే ఉన్న మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా మల్లుభట్టి విక్రమార్క ఉన్నారు. ఆయన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేత. ఇప్పుడు కొత్తగా బీసీలకు మరో ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తే ఆయా వర్గాల్లో కాంగ్రెస్ పట్ల ఆదరాభిమానాలు పెరుగుతాయని భావిస్తున్నారు. ఓవైపు ఇప్పటికే ఎస్సీ, ఎస్టీల్లో ఉన్న ఓటు బ్యాంకును బలోపేతం చేసుకుంటూనే బీసీల్లో స్ట్రాంగ్ ఓటింగ్ పెంచుకోవాలని చూస్తున్నారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాంటి వాళ్లను తప్పించబోతున్నారు. వారి స్థానంలో కొత్త వారిని కూడా అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను నియమించుకోనున్నారు. ఈ క్రమంలో మంత్రివర్గం నుంచి తప్పిస్తున్న వీళ్లకు పార్టీలో గౌరవప్రదమైన పదవులు కట్టబెట్టాలని చూస్తున్నారు. ఈ మార్పులు చేర్పుల్లో భాగంగా పీసీసీ చీఫ్‌గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి వరించబోతోంది. ఆయన స్థానంలో పొన్న ప్రభాకర్‌ను నియమించనున్నారు. చీఫ్‌గా ఉన్న మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి పదవితోపాటు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇస్తారనే ప్రచారం జోరుగా పార్టీలో సాగుతోంది. ఇలా చేయడం వల్ల బీసీలకు ప్రయార్టీ ఇచ్చారనే వాదనతోపాటు సీనియర్‌ను కూడా గుర్తించారనే ప్రచారం నేతలకు చేరుతుందని భావిస్తున్నారు. ఇలా అన్ని రంగాల్లో బీసీలకు ప్రయార్టీ ఇవ్వడంతోపాటు, వచ్చే ఎన్నికలకు గ్రౌండ్ ప్రిపేర్ చేసినట్టు ఉంటుందని భావిస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేసుకొనేలా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఇలా అన్ని జాతీయ స్థాయిలో చేసే రాజకీయాలకు తెలంగాణను ఓ మోడల్‌గా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.

# కారు బీభత్సంలో ముగ్గురు మృతి



**జగ్గంపేట: పెన్ పవర్:**కాకినాడ జిల్లాలో 16 నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడ మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అన్నవరం నుంచి జగ్గంపేట వస్తున్న కారు మార్గమధ్యలోని కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం జంక్షన్ వద్ద వచ్చేసరికి కారు యొక్క టైరు బరస్ట్ అవడంతో బైకును రిక్షాను ఢీ కొట్టి అక్కడితో ఆగకుండా బస్ స్టాప్ లోకి దూసుకుపోయింది.. దీంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్రంగా గాయాలు అవ్వడంతో చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు ఆస్పత్రి తరలించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..

# దుగ్గిరాల లో వ్యాపారి దారుణ హత్య

**మంగళగిరి: పెన్ పవర్:**దుగ్గిరాలలో వ్యాపారి దారుణ హత్య జరిగింది. వీరబాబు అనే వ్యాపారిని దుండగులు హత్య చేసారు. అప్పు ఇవ్వలేదనే వీరబాబును నవీన్, కృష్ణ హత్య చేసారు. నిందితులు నవీన్, కృష్ణ పరారీలో వున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మళ్లీ బిఆర్ఎస్ వైపు గూడెం బ్రదర్స్.?

**సంగారెడ్డి: పెన్ పవర్:**శుక్రవారం జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి ప్రత్యక్షమయ్యారు. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి 2014, 2018, 2023 ఎన్నికల్లో వరుసగా గెలిచిచారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయ పరిణామాలు మారాయి. దాంతో అయన అధికార కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. అయితే మహిపాల్ రెడ్డి ఇప్పటి వరకూ కాంగ్రెస్, బిఆర్ఎస్ సమదూరం పాటించారు. తెరపైకి ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు వచ్చింది. ఇటీవల కొల్లూరులో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ పర్యటన జరిగినప్పుడు అయనకు ఆహ్వానం అందలేదు. సరైన సమాచారం ఇవ్వలేదు అంటూ కాంగ్రెస్ మంత్రుల తీరుపై గూడెం మహిపాల్ రెడ్డి అసంతృప్తిగా వున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ లో ఇండ్ల వద్ద బిఆర్ఎస్ ఆత్మీయ సమావేశం నిర్వహించింది.
సమావేశానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి హజరయ్యారు. మహిపాల్ రెడ్డీ సైతం టిఆర్ఎస్ లోకి వస్తారంట అని ప్రచారం నడుస్తోంది.

# రోడ్ల తవ్వకాలపై గ్రేటర్ అధికారులు సీరియస్
# అనుమతి లేకుండా తవ్వితే జరిమానాలు




**హైదరాబాద్, నవంబర్ 8, పెన్ పవర్:**
హైదరాబాద్‌లో రోడ్ల తవ్వకాలపై జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రోడ్లు తవ్వితే, వాటిని తిరిగి వేయాల్సిన బాధ్యత పూర్తిగా ఆయా శాఖలదేనని స్పష్టం చేసింది. ఈక్రమంలో నగరంలో రోడ్ల తవ్వకంలో నిర్లక్ష్యం వహించిన వాటర్ బోర్డు నుంచి బల్దియా రూ.58 కోట్లు వసూలు చేసింది. ఆ నిధులతో రోడ్లు పునరుద్ధరించనుంది. రోడ్ల తవ్వకానకి ముందు పర్మిషన్ తీసుకోవాలని.. అనుమతి లేకుండా తవ్వితే జరిమానాలు విధించాలని భావిస్తోంది. .హైదరాబాద్ నగరంలో నిత్యం ఏదో ఒక చోట రోడ్లకు సంబంధించిన పనులు సాగుతునే ఉంటాయి. నగరంలో వివిధ అభివృద్ధి పనుల కోసం అనగా.. పైప్ లైన్, డ్రైనేజ్, కేబుల్స్, ఎలక్ట్రిసిటీ వంటి పనుల నిమిత్తం రోడ్లను తవ్వుతుంటారు. అది బాగానే ఉంది. పని పూర్తయ్యాక రోడ్లను తిరిగి వేస్తారా అంటే లేదు. దీంతో నగరంలో చాలా వరకు మెయిన్ రోడ్ల నుంచి కాలనీ రహదారుల వరకు గుంతలు పడి ఉంటాయి. దీని వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతుంటారు. జీహెచ్ఎంసీ యంత్రాంగం మీద విమర్శలు చేస్తారు. ఈక్రమంలో నగరంలో రోడ్ల తవ్వకాల మీద జీహెచ్ఎంసీ దృష్టి సారించింది. రోడ్ల తవ్వకాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది.ఇకపై రోడ్లు తవ్వితే వాటిని తిరిగి వేయాల్సిన బాధ్యత పూర్తిగా ఆయా శాఖల మీదనే ఉందని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది. అలానే రోడ్లు తవ్వి.. వాటిని తిరిగి వేయకపోవడంపై వాటర్ బోర్డుకు.. జీహెచ్ఎంసీ హెచ్చరికలు జారీ చేసింది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను వాటర్ బోర్డు నుంచి బల్దియా రూ.58 కోట్లునుంచి వసూలు చేసింది.ప్రజలను ఇబ్బందికి గురి చేసేలా రోడ్లను తవ్వి వదిలివేయడంపై బల్దియా ఆగ్రహం వ్యక్తం చేసింది. వీటిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇకపై, నగరంలో ఎక్కడైనా రోడ్లు తవ్వాలంటే తప్పనిసరిగా.. జీహెచ్ఎంసీ నుంచి ఎన్వోసీ తీసుకోవాలని ఆదేశించింది. అంతేకాకుండా, రోడ్లు తవ్వే కాంట్రాక్టర్‌తోనే.. తిరిగి రోడ్డు వేయించాలని సూచించింది. లేదంటే అందుకు అయ్యే ఖర్చును వారి వద్ద నుంచే వసూలు చేస్తామని హెచ్చరించింది. తాజాగా వాటర్ బోర్డు ఇలానే రోడ్ల తవ్వకం అంశంలో నిర్లక్ష్యం వహించడంతో జీహెచ్ఎంసీ.. జలమండలికి చెల్లించే బిల్లుల్లో రూ.58 కోట్ల కోతలు విధించింది. ఈ నిధులతో వాటర్ బోర్డ్ పనుల కోసం రోడ్లు తవ్విన ప్రాంతాల్లో.. బల్దియా తిరిగి రోడ్లను వేయబోతుంది.గ్రేటర్లో 9,013 కి.మీ మేర రోడ్లు విస్తరించి ఉన్నాయి. వీటిల్లో 2,846 కి.మీ మేర బీటీ రహదారులు కాగా మిగతా.. 6,167 కి.మీ మేర అంతర్గత సీసీ రోడ్లు ఉన్నాయి. నగరంలోని రోడ్లపై ఎలాంటి పనులు చేపట్టాలన్నా సంబంధిత శాఖల నుంచి ముందుగానే ఎన్వోసీలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ పనులు పూర్తయిన తర్వాత.. తవ్వని రోడ్లను తిరిగి వేసే బాధ్యత సదరు కాంట్రాక్టర్ మీదనే ఉంటుంది. ఒకవేళ కాంట్రాక్టర్ రోడ్లు వేయకపోతే.. ఆ పనికి సంబంధించిన బిల్లలను అధికారులు ఆపవచ్చు. వారికి ఆ అధికారం ఉంది. అయినా సరే అధికారులు దీన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. దీన్ని అలుసుగా తీసుకుని కాంట్రాక్టర్లు రోడ్లు బాగు చేయకుండానే చేతులు దులుపుకుంటున్నారు. పైగా చాలా వరకు కాంట్రాక్టర్లు .. ఎన్వోసీలు తీసుకోకుండానే రాత్రికి రాత్రే రోడ్లు తవ్వి అలానే వదిలేస్తున్నారు.దీనిపై నగరవాసులు జీహెచ్ఎంసీని విమర్శిస్తున్నారు. అందుకే ఇక మీదట అనుమతి లేకుండా రోడ్లు తవ్వే వారు.. ఆపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై నిఘా పెట్టేందుకు బల్దియా రెడీ అవుతోంది. అలాంటి వారికి జరిమానాలు సైతం విధించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది.

# అడ్డంగా ఇరుక్కున్న కాంగ్రెస్ సర్కార్



**వరంగల్, నవంబర్ 8, పెన్ పవర్:**
తెలంగాణ ప్రభుత్వం పథకాల అమలు విషయంలో ఇప్పటికే ఎన్నో విమర్శలు ఎదుర్కొటోంది. దానికి తోడు ప్రజలకు ఇస్తామని ప్రకటించిన తులం బంగారం హామీకి ఇప్పుడు తిలోదకాలు ఇచ్చారు. కల్యాణ లక్ష్మి పథకంలో భాగంగా పెళ్లికి తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టారు. ఈ పథకంపై పెళ్లిళ్లు చేసుకుంటున్న వారు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. అయితే దాన్ని ఇవ్వలేమని బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తాము హామీ ఇచ్చినప్పుడు రూ.యాభై వేలు ఉన్న బంగారం ధర ఇప్పుడు లక్ష దాటిందని అందుకే ఆ ఖర్చును ప్రభుత్వం భరించలేదని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళలకు తులా బంగారం ఇస్తామని ప్రచారం చేసింది, కానీ అధికారంలోకి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ "ఇవ్వలేము" అని చెప్పడం విపక్షాలకు ఆయుధంగా మారింది. "ఎన్నికల సమయంలో 'బంగారం' ఇస్తామని చెప్పి, పాలిత తర్వాత 'బడ్జెట్ లేకపోతుంది' అనడం మోసం" అంటూ %దీ=ూ% నేతలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు 'ప్రాక్టికల్ కాదు' అంటూ తప్పించుకోవడం మహిళలను మోసంమ చేయడం అనే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. తెలంగాణలో పెళ్లి సమయంలో మహిళలకు ఆర్థిక సహాయం అవసరమని కల్యాణ లక్ష్మి పథకం రూపొందింది. పేద కుటుంబాల్లో పెళ్లి ఖర్చులు 5–10 లక్షలకు చేరుకుంటాయి.. ఈ ఖర్చులో బంగారానికి ఎక్కువ వాటా. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా తులం బంగారం ఇస్తే ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. కానీ ప్రభుత్వం తమకు ఆర్థిక భారమని తప్పించుకుంటోంది. పార్టీ 420 హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి నేతలు ఇప్పటికే విమర్శలు ప్రారంభించారు. "కాంగ్రెస్ ఎన్నికల ముందు 'బంగారం' చెప్పి, ఇప్పుడు 'ఇవ్వలేము'.. మహిళలను మోసం చేస్తున్నారు" అని కేటీఆర్ మండిపడ్డారు. మహిళల పథకాలు 'పేపర్ ప్రామిస్‌లు' మాత్రమే" అని విమర్శిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన తర్వాత తీవ్రమైన విమర్శలు వస్తున్నా ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో మహిళల్ని విపరీతంగా ఆకర్షించిన అంశాల్లో తులం బంగారం పథకం కూడా ఒకటి. ఆ పథకం ప్రకటన వల్ల మహిళల ఓట్లు పెద్ద ఎత్తున పడి ఉంటాయని అంచనాలు ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ పథకాన్ని ఇవ్వలేమంటే ప్రజలు ముఖ్యమంగా మహిళలు అసంతృప్తికి గురవుతారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'కల్యాణ లక్ష్మి పథకం' పెళ్లి సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే ముఖ్యమైన స్కీమ్. %ూజ/ూ/దీజ/జుౌ%/మైనారిటీలకు చెందిన అమ్మాయిల పెళ్లికి రూ. 1,00,116 సహాయం ఇస్తుంది. 2014లో కేసీఆర్ హయాంలో ప్రారంభమయింది. పేద కుటుంబాల్లో అమ్మాయిల పెళ్లి ఖర్చులు తగ్గించడం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు. 2014 నుంచి 10 లక్షలకు అమ్మాయిలకు పెళ్లిళ్లకు సాయం చేశారు. ఈ పథకానికి మరింత వాల్యూ యాడ్ చేసి ఓట్లు సంపాదించాలనుకున్న కాంగ్రెస్.. తులం బంగారం ప్రకటన చేసి ఇరుక్కుపోయింది. ఇప్పుడు పథకం ఇవ్వకపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిలయినట్లే అవుతుంది.

# ఫోర్త్ సిటీలో ఇంటర్నేషనల్ స్టేడియం

**హైదరాబాద్, నవంబర్ 8, పెన్ పవర్:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీనిని లార్డ్స్, సిడ్నీ వంటి దిగ్గజ స్టేడియాలకు ధీటుగా రెండు సంవత్సరాలలో తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. రవాణా సౌలభ్యం ఉన్న రంగారెడ్డి జిల్లా కందుకూరులో ఈ స్టేడియం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఒక్కటే అంతర్జాతీయ మ్యాచ్‌లకు వేదికగా ఉంది.



ఒక అద్భుతమైన శుభవార్త. హైదరాబాద్ మహానగరం త్వరలో తన రెండో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని సొంతం చేసుకోబోతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ 'ఫ్యూచర్ సిటీ'లో ప్రపంచ స్థాయి క్రికెట్ స్టేడియం ఏర్పాటుపై కీలక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఈ కొత్త స్టేడియం కేవలం మ్యాచ్‌లు నిర్వహించడానికి మాత్రమే కాకుండా, చారిత్రక క్రీడా వేదికలైన లార్డ్స్, సిడ్నీ, మెల్‌బోర్న్ వంటి దిగ్గజ స్టేడియాల తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకోవాలని అధికారులకు ఆదేశించినట్లు తెలుస్తోంది. రాబోయే రెండు సంవత్సరాలలో ఈ స్టేడియాన్ని పూర్తి చేసి, అద్భుతంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.రవాణా సౌకర్యాలు, అనుసంధానం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని.. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు ప్రాంతంలో ఈ కొత్త స్టేడియాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, సౌకర్యాల గురించి అధ్యయనం చేయడానికి.. మాజీ క్రికెటర్లతో కూడిన ఒక బృందం త్వరలో విదేశాలకు వెళ్లనున్నట్లు సమాచారం. హైదరాబాద్‌ను క్రీడా రాజధానిగా మరింత బలోపేతం చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు ఈ కొత్త స్టేడియం ఒక చిహ్నంగా నిలవనుంది.తెలంగాణలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు వేదికగా.. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఉంది. ఉప్పల్‌లో ఉన్న ఈ స్టేడియం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధీనంలో నిర్వహణ సాగుతోంది. సుమారు 39,200 నుంచి 55 వేల వరకు ప్రేక్షకులకు ఆతిథ్యం ఇచ్చే సామర్థ్యం దీనికి ఉంది. అంతర్జాతీయ మ్యాచ్‌లు, ఐపీఎల్ మ్యాచ్‌లను ఇక్కడ విజయవంతంగా నిర్వహిస్తున్నారు.హైదరాబాద్ లో లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియం కూడా ఒకప్పుడు అంతర్జాతీయ మ్యాచ్‌లకు ప్రధాన వేదికగా ఉండేది. ప్రస్తుతం ఇది మీటింగ్ లకు, ఇతర కార్యక్రమాలను వేదిగా మారింది. ఇక దేశవాళీ మ్యాచ్‌లు, ప్రాక్టీస్ సెషన్స్ కోసం వినియోగించే చారిత్రక మైదానం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్. దీనిలో లోకల్ ఆటగాళ్లు ఆడుకోవడానికి అనువైన మైదానంగా చెప్పుకోవచ్చు. కొత్త స్టేడియం రాకతో తెలంగాణకు రెండో అంతర్జాతీయ క్రికెట్ వేదిక లభించినట్టవుతుంది.

# అభివృద్ధిపైనే ఆశలు

**విజయవాడ, నవంబర్ 8, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిపైనే ఫోకస్ పెట్టారు. విడిపోయి నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని ఏడు పదులు దాటిన వయసులోనూ చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలను ఎవరూ కాదనలేరు. పెట్టుబడుల కోసం ఒక ముఖ్యమంత్రి కాలికి బలపం కట్టుకుని విదేశాల చుట్టూ తిరగడం ఒక్క చంద్రబాబు విషయంలోనే చూస్తున్నాం. ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి తనకంటూ రాజకీయాల్లో ఒక మార్క్ ను క్రియేట్ చేసుకోవాలని పడుతున్న తపన స్పష్టంగా కనపడుతుంది. అందుకే వయసును, అలసటను లెక్క చేయకుండా ఆయన పనిచేస్తున్నారు. అయితే కార్యకర్తలు మాత్రం చంద్రబాబు పనితీరుపై కొంత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో జరిగిన పొరపాట్లను కూడా గుర్తించడం లేదని కార్యకర్తలే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కేవలం అభివృద్ధి సంక్షేమం తమను మరొకసారి అధికారంలోకి తెస్తుందన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. కానీ టీడీపీ కార్యకర్తలు మాత్రం అందుకు విరుద్ధంగా సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పోస్టు చేస్తుండటం పార్టీలో చర్చనీయాంశమైంది. 1999లో రెండోసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సైబరాబాద్ ను అభివృద్ధిని చేసినప్పటికీ 2004 ఎన్నికల్లో దాని చుట్టు పక్కల పరిధిలో ఉన్న యాభై శాసనసభ నియోజకవర్గాల్లో రాజేంద్ర నగర్ నియోజకవర్గం మినహా మరే చోట టీడీపీ గెలవలేకపోవడాన్ని ఈ సందర్భంగా కార్యకర్తలు గుర్తు చేస్తున్నా 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి అమరావతితో పాటు అనంతపురంలో కియా పరిశ్రమను తెచ్చారని, కానీ అమరావతి చుట్టు పక్కలతో పాటు, అనంతపురంలో కియా పరిశ్రమను ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ పార్టీ పూర్తిగా 2019 ఎన్నికల్లో చతికలపడటానానికి గల కారణాలను కూడా గుర్తుంచుకోవాలని మరికొందరు కోరుతున్నారు. గతంలో కంటే ఈసారి కాస్త భిన్నంగా చంద్రబాబు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని కూడా సమపాళ్లలో తీసుకెళుతున్నా వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు టీడీపీకి అనుకూలంగా ఉంటాయన్న గ్యారంటీ ఉందా? అని కొందరు నేరుగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా చంద్రబాబు వాస్తవంలోకి వచ్చి కార్యకర్తల సంక్షేమాన్ని కూడా పట్టించుకోవాలని కోరుతున్నారు.



# పొలిటికల్ టర్న్ తీసుకున్న డ్రగ్స్ కేసు



**విశాఖపట్టణం, నవంబర్ 8, పెన్ పవర్:** విశాఖలో చోటుచేసుకున్న డ్రగ్స్ కేసు ఇప్పుడు రాజకీయ మలుపు తిరుగుతోంది. ఈ కేసులో వైసీపీ స్టూడెంట్ వింగ్ నాయకుడు కొండారెడ్డి అరెస్టు వివాదాస్పదంగా మారింది. పోలీసులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని చెబుతుండగా, వైసీపీ మాత్రం దీనిని ప్రభుత్వ కుట్రగా పేర్కొంటోంది. పార్టీ నేతలు, కార్యకర్తలు పోలీసు వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఆరోపణల ప్రకారం.. కొండారెడ్డిని ఉదయం 7 గంటల సమయంలోనే పోలీసులు అరెస్టు చేశారని, అయితే కేసు నమోదు మాత్రం సాయంత్రం 4.30కి చేశారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అధికారుల పాత్రపై వైసీపీ అనుమానం వ్యక్తం చేస్తోంది. పార్టీ నాయకులు పలు వీడియోలు, టైమ్ స్టాంపులు ఆధారంగా చూపిస్తూ.. అరెస్టు సాయంత్రం జరిగిందని పోలీసులు చెబుతుంటే, ఉదయం 11.30 గంటలకు టీడీపీ అధికారిక సోషల్ మీడియా పేజీలో అరెస్ట్ ఫోటోలు ఎలా వచ్చాయి? అని ప్రశ్నించారు. కొండారెడ్డి అరెస్టు అనంతరం ఆయనను సమీపంలోని టాస్క్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్ (మూడే కిలోమీటర్ల దూరంలో)కి తీసుకెళ్లకుండా.. 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో స్థలానికి తీసుకెళ్లారని వైసీపీ ఆరోపిస్తోంది. ఆ టైమ్‌లో కొండారెడ్డి ఎక్కడ ఉన్నారు? ఎవరిని కలిశారు? ఎవరైనా ఒత్తిడి చేశారా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు. అరెస్టు అనంతరం కొండారెడ్డి మీడియా ముందు కన్నీళ్లతో మాట్లాడుతూ.. నా కొడుకును నిర్దోషిగా లాక్కెళ్లి, ప్రైవేట్ పార్ట్స్‌పై కొట్టి బలవంతంగా నేరాన్ని ఒప్పించారని ఆరోపించారు. డ్రగ్స్ కేసుతో తన కుమారుడికి ఎలాంటి సంబంధం లేదని, అవసరమైతే ఏ టెస్టుకైనా సిద్ధంగా ఉన్నామని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ఈ ఘటనను రాజకీయంగా ప్రేరేపిత అరెస్టుగా పేర్కొంటూ.. హోమ్ మినిస్టర్ కేవలం జగన్‌ని విమర్శించడానికే ఉన్నారు. ప్రజల భద్రత గురించి పట్టించుకోవడం లేదు అని వైసీపీ ప్రతినిధులు వ్యాఖ్యానించారు.. ఇక వైసీపీ మహిళా నాయకులు కూడా హోమ్ మినిస్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఎన్సీఆర్బీ రిపోర్టు ప్రకారం, అమ్మాయిల మిస్సింగ్ కేసులు రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఆమె ఏ హోమ్ కి మినిస్టర్ అంటూ వైసీపీ విమర్శలు గుప్పించారు. కొండారెడ్డి అరెస్టు వ్యవహారంలో వైసీపీ వీడియోలు బయట పెట్టడంతో డైలమాలో కూటమి ప్రభుత్వం పడిందని విమర్శించారు.

# యాక్టివ్ పాలిటిక్స్ లో ధర్మాన

**శ్రీకాకుళం, నవంబర్ 8, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇటీవల సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు యాక్టివ్ అయ్యారు. అయితే ఆయన ఓటమి నుంచి చేరుకోవడానికి ఏడాదికి పైగా పట్టింది. అయితే ఒకే ఒక షరతుతో ఆయన పార్టీలో యాక్టివ్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. సుదీర్ఘకాలం ఉమ్మడి ఏపీలో రాజకీయాలు చేశారు ధర్మాన ప్రసాదరావు. అయితే గత ఎన్నికల్లో ఒక సామాన్య సర్పంచి చేతిలో ఓడిపోయారు. అది మొదలు తీవ్ర నైరాస్యంలోకి వెళ్లిపోయారు. ఇప్పుడు ఉన్నఫళంగా యాక్టివ్ అయ్యారు. దీంతో రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆది నుంచి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆయన భిన్న వైఖరి అనుసరిస్తూ వచ్చారు. ఒకానొక దశలో పార్టీకి దూరమవుతారని ప్రచారం నడిచింది. కానీ కూటమిలో ఆప్షన్ లేకపోవడంతోనే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని తెలుస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలోనే ఏకధాటిగా 12 సంవత్సరాలపాటు మంత్రిగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు పైగా రెవెన్యూ లాంటి కీలక శాఖ బాధ్యతలను చూశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ సమయంలో కాంగ్రెస్ మంత్రిగా ఉండేవారు. జగన్మోహన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2014 లో గత్యంతరం లేని స్థితిలో ఆయన జగన్ చెంతకు వెళ్లారు. అయినా ఓటమి పలకరించింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న వేవ్ దృష్ట్యా చాలా యాక్టివ్ గా పని చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో తనకు మంత్రి పదవి ఖాయమని అంచనా వేశారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదు. సోదరుడు కృష్ణదాస్కు ఇవ్వడంతో తీవ్ర మనస్థాపంతో మూడేళ్లపాటు గడిపారు. దీంతో విస్తరణలో ధర్మాన ప్రసాదరావు కు ఛాన్స్ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. అయితే జగన్ విషయంలో విభిన్న వైఖరితో ఉన్న ధర్మాన మంత్రిగా తన మార్కు చూపించుకోలేకపోయారు. 2024 ఎన్నికల్లో ఓడిపోయేసరికి జగన్ నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకు రాలేదు కూడా. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ అయ్యారు ధర్మాన ప్రసాదరావు. అయితే ఈ యాక్టివ్ వెనుక కుమారుడు రామ్ మనోహర్ నాయుడు భవితవ్యం ఉన్నట్లు తేలుతోంది. 2024 ఎన్నికల్లోనే తన కుమారుడికి టిక్కెట్ ఇవ్వాలని కోరారు ధర్మాన ప్రసాదరావు. అందుకు జగన్ అంగీకరించలేదు. ఎన్నికల్లో ఓడిపోవడంతో శ్రీకాకుళం నియోజకవర్గంలో వైసిపి గెలుపు కష్టం అన్న ఆలోచనకు వచ్చారు. పార్టీ ఆవిర్భవించి మూడుసార్లు ఎన్నికలు జరిగితే ఒకసారి మాత్రమే గెలిచింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2024 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో టిడిపి అభ్యర్థి 52,000 ఓట్ల తేడాతో గెలిచారు. అంటే ఏ స్థాయిలో ఇక్కడ తెలుగుదేశం అనుకూల వాతావరణం ఉందో గ్రహించారు ధర్మాన ప్రసాదరావు. అందుకే టిడిపి తో పాటు కూటమి పార్టీలో చేరేందుకు ప్రయత్నించారు. అది వర్కౌట్ కాకపోవడంతో వైసీపీలో కొనసాగుతున్నట్లు విశ్లేషణలు ఉన్నాయి. అయితే ధర్మాన ప్రసాదరావు విషయంలో పార్టీ హైకమాండ్ అల్టిమేట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో కొనసాగుతారా? లేదా? లేకుంటే ప్రత్యామ్నాయం చూసుకోమంటారా? అని గట్టిగానే కోరినట్లు తెలుస్తోంది. అప్పుడే ధర్మాన ప్రసాదరావు ఒక షరతు పెట్టినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు టికెట్ ఇస్తే పార్టీలో యాక్టివ్ అవుతానని ధర్మాన ప్రసాదరావు చెప్పినట్లు తెలుస్తోంది. అధినేత జగన్మోహన్ రెడ్డి అంగీకరించడంతోనే ధర్మాన యాక్టివ్ అయినట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.



## పల్టీ కొట్టి బోల్తా పడ్డ ఇన్నోవా
# ప్రయాణికులు సురక్షితం

**నల్గొండ: పెన్ పవర్:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఇన్నోవా కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ప్రమాద ధాటికి ఇంజన్ లో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఎనిమిది మంది ప్రయాణికులు ఇన్నోవా నుంచి సురక్షితంగా బయటపడ్డారు. వాహనం రోడ్డుకు అడ్డం పడడంతో హైదరాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవే పై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది..

# విద్యార్థులపై దూసుకెళ్లిన కారు.. ముగ్గురు మృతి

**కాకినాడ : పెన్ పవర్:** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం దగ్గర హైవేపై కారు బీభత్సం సృష్టించింది. బస్టాప్లో వేచివున్న విద్యార్థులపైకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఫ్రంట్ టైరు పేలడంతో కారు అదుపుతప్పి విద్యార్థులపైకి దూసుకెళ్లింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# ఎలన్ మస్క్ కు 88 లక్షల కోట్లు ప్యాకేజీ



**న్యూయార్క్, నవంబర్ 8, పెన్ పవర్:** మనదేశంలో అత్యధిక వేతనాలు తీసుకొనే ప్రైవేట్ కంపెనీల అధినేతలలో ముకేశ్ అంబానీ, కావేరి మారన్, రోషిణి నాడార్, ఆనంద్ మహీంద్రా ముందు వరసలో ఉంటారు. వీరి వార్షిక వేతనం కోట్లల్లో ఉంటుంది. ప్రతి ఏడాది వీరి వేతనం పెరుగుతూనే ఉంది. పెరిగిన వేతనం ద్వారా వీరు రికార్డులు సృష్టిస్తూనే ఉన్నారు.. కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త ఘనతలను అందుకుంటునే ఉన్నారు. మన దేశం గురించి కాస్త పక్కన పెడితే.. ప్రపంచంలోనే అత్యధిక వేతనం తీసుకుంటున్న వ్యక్తిగా రికార్డ్ సృష్టించాడు టెస్లా అధినేత మస్క్.టెస్లా.. ఎక్స్, స్పేస్ ఎక్స్ కంపెనీల అధినేతగా.. ప్రపంచ కుబేరుడిగా పేరుపొందాడు మస్క్. ఇంకా తన వ్యాపారాలను మరింత స్థాయికి విస్తరించడానికి ఆయన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టెస్లా కార్ల విక్రయాల ద్వారా సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నారు. అటువంటి మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యాపారం లోకి కూడా అడుగు పెట్టారు. త్వరలోనే భారతదేశంలో సేవలు అందించబోతున్నారు. దీనికి సంబంధించి అనుమతులు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో మస్క్ మరో రికార్డు సృష్టించారు. కార్పొరేట్ ప్రపంచం కనీ విని ఎరుగని ఘనతను ఆయన అందుకున్నాడు. అమెరికా ఎన్నికల్లో ట్రంప్ తరఫున ప్రచారం చేశాడు మస్క్. ట్రంప్ ప్రభుత్వంలో క్రియాశీలక పాత్ర కూడా పోషించాడు. ఆ తర్వాత ఆ స్థానం నుంచి తప్పుకున్నాడు. ట్రంప్ తో తనకు విభేదాలు ఉన్నాయని పేర్కొన్నాడు. ట్రంప్ తో స్నేహం ముగిసిన అధ్యాయమని మస్క్ వెల్లడించాడు.. ఇక ఇప్పుడు మస్క్ కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించాడు. ఆయనకు వన్ ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇవ్వడానికి టెస్లా కంపెనీకి చెందిన 75 శాతం షేర్ హోల్డర్లు ఆమోదం తెలిపారు. వన్ ట్రిలియన్ డాలర్లు అంటే దాదాపు 88 లక్షల కోట్లు. ఫలితంగా కార్పొరేట్ ప్రపంచంలో అత్యధిక వేతనం అందుకుంటున్న ఆయన చరిత్ర సృష్టించాడు. అయితే మస్త్ నెల జీతం గా కాకుండా.. ఆ మొత్తాన్ని వచ్చే పది సంవత్సరాలలో స్టాక్స్ రూపంలో ఆయన పొందుతారు. ప్రస్తుతం 476 బిలియన్ డాలర్ల సంపద తో మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్నాడు.

## బెంగళూరు వర్సెస్ హైదరాబాద్
# ఓఆర్ఆర్, హైటెక్స్..

**హైదరాబాద్, నవంబర్ 8, పెన్ పవర్:** బెంగళూరు, హైదరాబాద్ మధ్య తేడాలు, పోలికలు సర్వసాధారణమే. దేశంలో, మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో టాప్ నగరాలైన ఈ రెండింటి మధ్య సోషల్ మీడియాలో నెటిజన్లు తరచూ చర్చలు జరుపుతూనే ఉంటారు. అయితే ఇప్పుడు వారి దృష్టి రెండు నగరాల ఔటర్ రింగ్ రోడ్లపై పడింది. ఈ క్రమంలోనే ఓ నెటిజన్.. బెంగళూరు ఓఆర్ఆర్, హైదరాబాద్ ఓఆర్ఆర్‌ల మధ్య తేడాలను వివరిస్తూ పెట్టిన పోస్ట్ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.దేశంలో సిలికాన్ వ్యాలీ సిటీగా బెంగళూరు.. ఐటీ రాజధానిగా హైదరాబాద్.. దేనికదే చాలా ప్రత్యేకం. ఇక ఐటీ విషయంలో రెండు నగరాలు పోటాపోటీగా ఉంటాయి. గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇక రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు.. పలు అంశాలపై నువ్వా నేనా అన్నట్లు మాటల యుద్ధాలు సాగించేవి. అయితే రెండు నగరాల్లో ఉండే వారు కూడా.. అక్కడ, ఇక్కడ పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు, ట్రాఫిక్ గురించి.. సోషల్ మీడియా వేదికగా తరచూ చర్చ జరుపుతూనే ఉంటారు. ఈ క్రమంలోనే తాజాగా హైదరాబాద్, బెంగళూరు నగరాల మధ్య సరికొత్త చర్చ నడుస్తోంది.భారతదేశంలోని ప్రధాన ఐటీ కేంద్రాలైన హైదరాబాద్, బెంగళూరు మధ్య ఇప్పుడు సోషల్ మీడియాలో ఔటర్ రింగ్ రోడ్ల పోలికపై పెద్ద చర్చ నడుస్తోంది. ఒక ఎక్స్ యూజర్ చేసిన పోస్ట్‌లో.. బెంగళూరులో ఉన్న దారుణమైన ట్రాఫిక్, రోడ్ల సమస్యలను ప్రస్తావిస్తూ.. హైదరాబాద్ ఓఆర్ఆర్ ఎంత మెరుగ్గా ఉందో చూపించడంతో ఈ చర్చ ప్రారంభమైంది. హైదరాబాద్ ఓఆర్ఆర్.. 8 లేన్లు, గుంతలు లేని రోడ్లు, స్పష్టమైన లేన్ మార్కింగ్‌లు, అత్యుత్తమ నిర్వహణ కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. అదే సమయంలో బెంగళూరు ఓఆర్ఆర్ గురించి ప్రస్తావిస్తూ.. సరైన లేన్ మార్కింగ్‌లు లేకపోవడం, గుంతలతో కూడిన రోడ్లు, రోడ్ల ఉపరితలాలు సరిగా లేకపోవడం, అపరిశుభ్రత వంటి సమస్యలు ఉన్నాయని చెప్పడం గమనార్హం.ఇక ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. చాలా మంది నెటిజన్లు హైదరాబాద్ ఓఆర్ఆర్‌ను దేశంలోనే 'బెస్ట్ ప్లాన్డ్ ఎక్స్‌ప్రెస్ వే'గా ప్రశంసలు గుప్పిస్తున్నారు. బెంగళూరు అధికారులు త్వరగా సమస్యను పరిష్కరించి 'సిలికాన్ సిటీ'కి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ గురించి.. గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతున్న వేళ.. ఈ పోస్ట్ మరింత అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఈ క్రమంలోనే ఒక ఎక్స్ యూజర్ పోస్ట్ చేసిన ఫోటోలు, పోలిక ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి.

ఇక బెంగళూరులో ఉన్న పరిస్థితులపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన ఆ నెటిజన్.. తాను బెంగళూరు నగరాన్ని ద్వేషించడం లేదని స్పష్టం చేశారు. కానీ తమ బెంగళూరు నగరంలో ఉన్న అత్యంత దారుణమైన మౌలిక సదుపాయాల గురించి.. ఆ రోడ్లపై ప్రయాణించి ప్రజలు ఎంత అలసిపోతున్నారో మాత్రమే చెబుతున్నానని పేర్కొన్నారు. 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి 'సిలికాన్ సిటీ'కి న్యాయం చేస్తుందని ఆశిస్తున్నానంటూ ఆ యూజర్ పేర్కొన్నారు.ఈ పోస్ట్‌కు వేలాదిగా నెటిజన్ల నుంచి రియాక్షన్లు వచ్చాయి. చాలా మంది యూజర్లు హైదరాబాద్ ఓఆర్ఆర్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు.. బహుశా దేశంలోనే అత్యంత చక్కగా ప్రణాళిక చేసి.. మెయింటైన్ చేస్తున్న ఎక్స్‌ప్రెస్ వేలలో ఒకటి అని ఒక నెటిజన్ పేర్కొన్నారు. ఇది ప్రమాణాలను చాలా పెంచేసిందని ప్రశంసించారు. బెంగళూరులో ఔటర్ రింగ్ రోడ్డుకు కేవలం ఔటర్ అనే పేరు మాత్రమే ఉందని.. 15 ఏళ్ల క్రితం అది ఔటర్‌గా ఉండేదని.. కానీ ఇప్పుడు నగరం అందులో కలిసిపోయిందని ఇంకొంకరు వ్యాఖ్యానించారు.అయితే చారిత్రక అంశాలు, వేగవంతమైన అభివృద్ధి కారణంగా బెంగళూరు రోడ్లు ఇలాంటి దుస్థితికి చేరాయని కొందరు నెటిజన్లు వాదిస్తున్నారు. మౌలిక సదుపాయాల విషయంలో హైదరాబాద్ ముందు చూపుతో ప్లాన్ చేసిందని ఈ చర్చ నిరూపిస్తోంది.

## వైసీపీ గూటికే విజయిసాయి...



**నెల్లూరు, నవంబర్ 8, పెన్ పవర్:** విజయసాయిరెడ్డి యూటర్న్ తీసుకున్నారా? జగన్మోహన్ రెడ్డికి దగ్గర అవుతున్నారా? లిక్కర్ స్కామ్ కేసులో సాక్షులుగా ఉన్న ఆయన అల్లుడు పిటిషన్ వేయడం ఏంటి? వాంగ్మూలం వెనక్కి తీసుకోవాలని కోరడం ఏంటి? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. విజయసాయిరెడ్డి వ్యవహారంలో రెండు పరిణామాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. విశాఖ బీచ్ ను విధ్వంసం చేశారని ఆయన కుమార్తె కంపెనీ పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జీవీఎంసీ కి నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. అదే సమయంలో లిక్కర్ స్కాం కేసులో సాక్షులుగా ఉన్న రోహిత్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందానికి ఇచ్చిన వాంగ్మూలాలను వెనక్కి తీసుకోవాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కొన్ని నెలల కిందట విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఆయన వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు. కానీ అనూహ్యంగా లిక్కర్ స్కాం కేసులు అనధికారిక అప్రూవర్ గా మారారు. ఆయన ఇచ్చిన సమాచారంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసుల నమోదు, అరెస్టులు జరిగాయని అంతా భావించారు. కానీ ఇటీవల విజయసాయిరెడ్డి ఫుల్ సైలెంట్ అయ్యారు. కనీసం ఎక్కడ ఉన్నారో కూడా తెలియడం లేదు. గతంలో విజయసాయి రెడ్డి అల్లుడు రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు శరత్ చంద్రారెడ్డి లిక్కర్ స్కామ్ దర్యాప్తు చేస్తున్న సిట్ కు వాంగ్మూలం ఇచ్చారు. తమ కంపెనీల ద్వారా లిక్కర్ స్కాం నగదును చలామణి చేశారని.. అందులో రూపాయి కూడా తాము సంపాదించలేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ వాంగ్మూలాన్ని వెనక్కి ఇప్పించాలని కోర్టులో వారు పిటిషన్ దాఖలు చేయడం మాత్రం సంచలనంగా మారింది. దీని వెనుక విజయసాయిరెడ్డి ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.కచ్చితంగా కేసులకు భయపడి విజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారని సాక్షాత్ జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. వైసీపీ శ్రేణులు సైతం ఇదే విషయాన్ని చెప్పుకుంటూ వస్తున్నాయి. ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి అసలు సూత్రధారుడు అన్న విజయసాయిరెడ్డి.. అవసరమైతే ప్రత్యేక దర్యాప్తు బృందానికి అన్ని వివరాలు సమర్పిస్తానని చెప్పుకొచ్చారు. మొత్తం విజయసాయిరెడ్డి ఇచ్చిన వివరాలతోనే ఇప్పటి వరకు అరెస్టులు జరుగుతున్నాయని అంతా భావించారు. అయితే ఇప్పుడు ఆయన అల్లుళ్లు ఇద్దరు పిటిషన్లు దాఖలు చేయడంతో.. విజయసాయిరెడ్డి అడ్డం తిరిగారు అన్న టాక్ వినిపిస్తోందివిజయసాయిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరతారని ప్రచారం సాగింది. ఆయనకు ఇప్పుడు ఆప్షన్ లేదు. జగన్మోహన్ రెడ్డికి గత్యంతరం లేదు. జగన్ పక్కన విజయసాయిరెడ్డి ఉండడంతో చాలా రకాల పనులు ఇట్టే జరిగిపోయేవి. ఢిల్లీ స్థాయిలో చాలా పనులను చక్కదిద్దే వారు విజయసాయిరెడ్డి. కానీ జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పేరు మోసిన బిగ్ హాండ్స్ కలిసి రావడం లేదు. ఇటువంటి తరుణంలో విజయసాయిరెడ్డి తో రాజీ చేసుకుంటే మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏ కేసులకు భయపడి వైసీపీ నుంచి బయటకు వచ్చారో.. అది నెరవేరడం లేదు. అందుకే విజయసాయిరెడ్డి నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## నిమ్మకాయలకు మళ్లీ ఆశలు

**రాజమండ్రి, నవంబర్ 8 పెన్ పవర్:**
టీడీపీలో సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప తిరిగి యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తుంది. ఆయనకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం లభిస్తుందన్న అంచనాల్లో నిమ్మకాయల అనుచరులున్నారు. దశాబ్దకాలం నుంచి టీడీపీనే నమ్ముకుని ఉన్న నిమ్మకాయల చినరాజప్ప 2014 ఎన్నికల్లో పెద్దాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు మంత్రివర్గంలో చేరారు. అప్పట్లో హోంమంత్రి బాధ్యతను చేపట్టారు. అంతేకాదు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా లభించింది. చంద్రబాబుకు, లోకేశ్ కు అత్యంత సన్నిహితుడైన, నమ్మకమైన నేతగా ఆయన పేరు తెచ్చుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయనకు ఈసారి మంత్రిపదవి దక్కలేదు కేవలం సామాజిక వర్గాల సమతూకంలో భాగంగానే నిమ్మకాయల చినరాజప్పకు మంత్రిపదవి దక్కలేదు. అయితే వచ్చే ఏడాదిలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈసారి ఖచ్చితంగా నిమ్మకాయల చినరాజప్పకు మంత్రి పదవి దక్కుతుందన్న ఆశలో ఉన్నారు. ప్రస్తుతం ఉన్న కాపు సామాజికవర్గం మంత్రుల్లో నుంచి తప్పించిన వారి స్థానంలో రాజప్పకు అవకాశం దక్కుతుందని అంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా కావడం ఒకింత మంత్రిపదవికి ఇబ్బందికరంగా మారుతుందంటున్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. జనసేనకు చెందిన ఇద్దరు మంత్రులు ఉండటంతో మరో కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ఎలా అప్పగిస్తారన్న ప్రశ్న కూడా కలుగుతుంది. కానీ పెద్దాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నిమ్మకాయల చినరాజప్ప మాత్రం ఆశలు వదులుకోకుండా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తూర్పు గోదావరి జిల్లాలో తానే పార్టీలో సీనియర్ కావడంతో పాటు పార్టీని నమ్ముకుని ఉండటం కూడా తనకు కలసి వస్తుందని నమ్ముతున్నారు. కానీ సామాజికవర్గం కోణంలో చూస్తే మాత్రం కూటమి ప్రభుత్వంలో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశాలు చాలా తక్కువేనని అంటున్నారు. ఈ టర్మ్ లో మంత్రి పదవి రాకపోతే వచ్చే ఎన్నికలకు తాను శాసనసభకు పోటీ చేయకుండా పార్టీ నామినేటెడ్ పదవి అంటే రాజ్యసభకు వెళ్లాలన్న యోచనలో కూడానిమ్మకాయల చినరాజప్ప ఉన్నట్లు తెలిసింది. మొత్తం మీద ఒక ప్రయత్నం చేస్తే పోయేదేముంది అన్న రీతిలో ఆయన తన వంతుగా ప్రయత్నాలు చేస్తున్నారట.

## నానికే కాపుకాస్తారా...

**విజయవాడ, నవంబర్ 8, పెన్ పవర్:** మాజీ మంత్రి పేర్ని నానికి క్రేజ్ ఉంది. మచిలీపట్నంలో ఆయనకు కాపు సామాజికవర్గం కూడా అండగా ఉండేది. ఎక్కువ మంది కాపులు ఆయనకు మద్దతిచ్చేవారు. కానీ 2019 ఎన్నికల తర్వాత పేర్ని నాని పై కాపుల్లో వ్యతిరేకత మొదలయింది. పేర్ని నాని ఒంటికాలిపై పవన్ కల్యాణ్ పై లేస్తుండటం, ఆయనపై విమర్శలు చేస్తుండటంతో సొంత సామాజికవర్గం నానికి దూరమయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. పేర్ని నాని మంచి వాగ్ధాటి ఉన్న నేత. నాడు జగన్ కేబినెట్ లో మంత్రిగా ఉండి పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేయడం వల్లనే కాపు సామాజికవర్గం నానికి దూరమయిందన్నది వాస్తవం. అంతకు ముందు ఆయనకు



బలంగా నిలిచిన వర్గం కూడా ఆయన వైపు నిల్చోకపోవడానికి జనసేన కారణమని చెప్పాలి.. కొన్ని పరిణామాలు పేర్ని నానికి అనుకూలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గత పదహారు నెలల నుంచి కొంత మౌనంగా ఉండటంతో పాటు కందుకూరు ఘటనపై మాట్లాడకపోవడంతో పాటు గతంలో మచిలీపట్నంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, నామినేటెడ్ పదవుల్లో తమకు అన్యాయం జరిగిందని భావించడం, మచిలీపట్నంలో ప్రస్తుతం కాంట్రాక్టులు, నామినేటెడ్ పదవులు కొందరికే దక్కుతుండటంతో నానికి అనుకూలంగా క్రమంగా కాపులు కూడా మారుతున్నారన్నది వాస్తవం. ఇది ఎవరు అవునన్నా కాదన్నా నిజం. అక్కడి పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయి స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఖచ్చితంగా ఫలితాలు నాని వైపు ఉంటాయన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికతోనూ ఫలితాలు ఉంటాయని అంటున్నారు. మచిలీపట్నం జనసేనలో మాత్రం కూటమి సర్కార్ పై కొంత అసహనం ఏర్పడింది. అందులోనూ టీడీపీపై కొంత వ్యతిరేకతతో ఉన్నారు. పవన్ కల్యాణ్ కూడా పార్టీ కోసం కష్టపడిన తమను పట్టించుకోవడం లేదన్న అభిప్రాయంలో ఉన్నారు. అయితే దీనిని పేర్ని నాని రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశముంది. మంత్రి కొల్లు రవీంద్ర కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణంపై రోడ్డు విస్తరణ పనులు కూడా నాని బయటకు తెచ్చి తన వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరి పేర్ని నాని ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయన్నది చూడాలి.

# జంతువుల కొవ్వుతో నెయ్యి...

**కాకినాడ, నవంబర్ 8, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కల్తీ నెయ్యి దందా కలకలం రేపుతోంది. పిఠాపురం కేంద్రంగా జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేసి కొవ్వును గుర్తించారు. అనంతరం నమూనాలు.. ఆహార నియంత్రణ విభాగానికి పంపించారు. అయితే జంతు కొవ్వు కలిసిన ఈ కల్తీ నెయ్యి వల్ల ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.నెయ్యిని చాలా మంది ఇష్టంగా తింటుంటారు. వేడి వేడి అన్నంలో పచ్చడి కలుపుకుని.. కాస్త నెయ్యి వేసి తింటే అద్భుతమే! వంటల్లో మంచి ఫ్లేవర్, టేస్ట్ రావడానికి కూడా నెయ్యి విరివిగా ఉపయోగిస్తుంటారు. అయితే ప్రజల అవసరాన్ని కొందరు క్యాష్ చేసుకుంటున్నారు. కల్తీ నెయ్యి తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తాజాగా ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లో వెలుగు చూసింది. ఏకంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్య వహిస్తున్న పిఠాపురం కేంద్రంగా అక్రమ నెయ్యి దందా సాగుతున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పిఠాపురంలో జంతు కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని ఫిర్యాదుల అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. అయితే తనిఖీల్లో జంతువుల కొవ్వును గుర్తించడం కలకలం రేపుతోంది. బుధవారం (నవంబర్ 5న) అర్ధరాత్రి పిఠాపురం పట్టణంలోని అన్నపూర్ణా థియేటర్ వెనుక.. మాధవనగర్‌లోని ఓ ఇంట్లో జంతు కొవ్వు నిల్వలను హిందూ సంఘాలు గుర్తించాయి. అనంతరం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఇంటిని సీజ్ చేశారు. గురువారం సాయంత్రం ఎస్సై మణికుమార్, ఆర్ఐ వెంకటేష్, పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్ కల్తీ నెయ్యి తయారు చేస్తున్న ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఆ ప్రదేశంలో 12 డబ్బాల కొవ్వు, నెయ్యి ఉన్నట్లు గుర్తించారు. నమూనాలు సేకరించి ఆహార నియంత్రణ విభాగానికి పంపించారు. మిగిలిన జంతు కొవ్వును పారిశుద్ధ్య కార్మికులతో.. భూమిలో పూడ్చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ విషయంపై భవన యజమాని మణికంఠపై కేసు నమోదు చేశామని పోలీసులు వెల్లడించారుకేంద్రంగా గత కొంత కాలంగా కల్తీ నెయ్యి తయారవుతోందని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా వెంకటేశ్వరరావు ఆరోపించారు. పిఠాపురం నియోజకవర్గంలో కల్తీ నెయ్యి తయారు చేసే స్థావరాలు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల కొవ్వు, కల్తీ నెయ్యి గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా ఈ కల్తీ నెయ్యిని ఆలయాలకు సరఫరా చేస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.కల్తీ నెయ్యిలో అనారోగ్యకరమైన జంతు కొవ్వులు, నూనెలు కలిస్తే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగి గుండె జబ్బులు వచ్చే ప్రమాదముంది. ఇలాంటి నెయ్యి తినడం వల్ల అజీర్తి, కడుపు ఉబ్బరం, కడుపు నొప్పి, వికారం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. కల్తీ నెయ్యి వల్ల అలర్జీలు కూడా వచ్చే ప్రమాదముంది. వీటిలో పోషకాలు ఉండకపోవడానికి తోడు.. శ్వాసకోస సంబంధిత వ్యాధులు తెచ్చి పెడతాయట. చర్మ వ్యాధులు, రోగనిరోధక శక్తి తగ్గడం, ఎముకలపై కూడా ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# మంత్రుల వ్యవహారశైలిపై అసంతృప్తి

**గుంటూరు, నవంబర్ 8, పెన్ పవర్:**
ఏపీ క్యాబినెట్ మీటింగ్ జరిగే సమయాల్లో మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు తరచూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు వారి శాఖపై ఏమాత్రం పట్టు సాధించలేని పరిస్థితి నెలకొందని.. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలోను%ొ%ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను గట్టిగా తిప్పికొట్టడంలోను మంత్రుల ఇవ్వాల్‌మెంట్ సరిగా ఉండడంలేదనే భావనలో సీఎం ఉన్నారనే గుసగసలు వినిపిస్తున్నాయి. అటు పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా మంత్రులు పాల్గొనలేకపోతున్నారనే చర్చ పార్టీ నేతల్లో ఉందట. సగం మంది మంత్రులు హైదరాబాద్, వైజాగ్, బెంగళూరులకు షటిల్ సర్వీస్ చేస్తున్నారనే విమర్శలున్నాయట. క్యాబినెట్ భేటీలో మంత్రుల తీరుపై చర్చ:. గత ఆరు నెలల కాలంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ రాష్ట్రంలో అక్కడక్కడా పర్యటనలు చేస్తూ.. ప్రభుత్వం పై సంబంధింత శాఖల మంత్రుల పై ఆరోపణలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆ శాఖలకు సంబంధించిన మంత్రులు గాని.. మిగిలిన వారు కానీ వైసీపీ నేతల నుంచి, జగన్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇవ్వడంలో విఫమలవుతున్నారనే చర్చ టీడీపీలో నడుస్తోందట. ఈ విషయమై ప్రతి క్యాబినెట్ భేటీలోను మంత్రుల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.. ప్రజలను అయోమయానికి గురి చేస్తున్న వైసీపీ అధ్యక్షుడు:. వైసీపీ అధ్యక్షుడు జగన్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని, వాస్తవాలు ప్రజలకు చెప్పటంలో మంత్రులు వైఫల్యం చెందుతున్నారని చంద్రబాబు అసంతృ వ్యక్తం చేస్తూనే ఉన్నారట. చంద్రబాబు ఎన్నిసార్లు అసంతృప్తి వ్యక్తం చేసినా నేతల తీరులో మాత్రం మార్పు రావడం లేదట. తాజాగా మంత్రుల పై లోకేష్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం పార్టీ నుంచి కానీ, మంత్రుల నుంచి కానీ గట్టి కౌంటర్ ఎందుకు ఇవ్వలేకపోయారని అడిగినట్లు టాక్ వినిపిస్తోంది. గ్రీవెన్స్‌సెల్‌ను పట్టించుకోవడం లేదని లోకేష్ ఆగ్రహం:. ప్రతిపక్షంగా వైసీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రులు లైట్ తీసుకుంటున్నారనే ఫీలింగ్‌లో ఉన్న నాయకత్వానికి.. టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రీవెన్స్ సెల్‌ను కూడా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదనే చర్చ నడుస్తోందట. ప్రజాదర్బార్ విషయంలో నారా లోకేష్ కూడా సీరియస్ అయినట్లు చెప్తున్నారు. ప్రజా దర్బార్?ను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన యువనేత, అసలు



చాలా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం లేదని మండిపడ్డారట. ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన లోకేష్, ఆ ప్రజా దర్బార్? కు వేల సంఖ్యలో ప్రజలు రావడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారట సుమారు ఐదు గంటల పాటు సమస్యలు విని అసలు ఎందుకు ఈ ఇంతమంది సమస్యలతో పార్టీ కార్యాలయానికి వచ్చారంటే నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారట. ఇకపై నియోజకవర్గాల్లో, మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించాల్సిందనేని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌కు మంత్రులు తప్పకుండా హాజరు కావాలిని ఆదేశాలు జారీ చేశారట. ఆ క్రమంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయిలో మంత్రులు ప్రజా సమస్యలను పట్టించుకోడంలేదా అనే చర్చ మొదలైందట. మరోవైపు వైసీపీ చేస్తున్న విమర్శల్ని దీటుగా ఎదుర్కొన లేకపోవడం మంత్రుల వైఫల్యంగా మారిందనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. 2014 –19 మధ్య కూడా వైసిపి చేసిన ప్రచారాన్ని ధీటుగా సమాధానం చేప్పకపోవడం వల్లే 2019 ఎన్నికల్లో ఓటమి కారణంగా పార్టీ అధిష్ఠానం భావిస్తుందనే చర్చ కూడా పార్టీ నేతల్లో ఉందట:. గతంలో జరిగిన తప్పిదాన్ని మరోసారి జరక్కుండా చూసుకోవాలని అధిష్ఠానం భావిస్తుందట. విశాఖపట్నం సమ్మిట్ అయిపోయిన తర్వాత జిల్లాల వారీగా మంత్రులు ఎమ్మెల్యేలతో లోకేష్ సమావేశం కావాలని నిర్ణయం తీసుకున్నారట. ప్రతిపక్ష పార్టీ చేసే ప్రతి విమర్శకి సంబంధిత జిల్లా నుంచి అయితే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు.. రాష్ట్రస్థాయిలో అయితే ఆ శాఖ మంత్రి, ప్రభుత్వ అధికారులతో వెంటనే రిప్లై ఇప్పించాలని యోచిస్తున్నారట. పార్టీ, ప్రభుత్వం రెండు కలిసి పనిచేసే విధంగా అధిష్ఠానం కసరత్తు చేస్తుందట. త్వరలోనే ఫాక్ట్ చెక్ పేరుతో టీడీపీ కమిటీ వేయాలని చెప్పి నిర్ణయం తీసుకున్నట్లు నేతలు చెబుతున్నారట. ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు.. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు.. దానికి కౌంటర్ గా ఏ రకంగా ముందుకు వెళ్లాలి అనేదానిపై కమిటీ వేసే ఆలోచనలో టీడీపీ ఉందట. టీడీపీ అధిష్టానం కార్యచరణ ఎంత వరకు వర్కౌట్ అవుతుందో చూడాలి

# కొలికపూడి తగ్గట్లే...

**విజయవాడ,నవంబర్ 8, పెన్ పవర్:**
తెలుగుదేశంపార్టీలో ఇటీవల విభేదాలు వీధిన పడుతున్నాయి. వాటిని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది నాయకత్వం. నిన్ననే టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుటకు వచ్చారు విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. కొద్ది రోజుల కిందట ఈ ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ నేపథ్యంలో టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారు. వేర్వేరుగా హాజరై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఇది జరిగిన తరువాత కూడా ఓ పరిణామం టిడిపి నాయకత్వానికి షాక్ ఇచ్చింది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఓ కార్యక్రమంలో ఎంపీ కేసినేని చిన్నిని విస్మరించడం వివాదం కొనసాగుతుందే తప్ప.. ఫుల్ స్టాప్ పడలేదని అర్థం అవుతుంది.విజయవాడ ( ఎంపీగా గెలిచారు కేసినేని చిన్ని. అదే సమయంలో తిరువూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు కొలికపుడి శ్రీనివాసరావు. టిడిపిలో నెలకొన్న పరిణామాలతో ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు కేసినేని నాని. ఆయనకు ప్రత్యామ్నాయంగా ఆయన సోదరుడు చిన్నిని ప్రోత్సహించింది టిడిపి నాయకత్వం. నాని వైసీపీలో చేరి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగారు. చిన్ని టిడిపి అభ్యర్థిగా పోటీ చేశారు. తన పార్లమెంట్ స్థానం పరిధిలోని తిరువూరు టిక్కెట్ను కొలికపూడి శ్రీనివాసరావుకు ఇవ్వాలని సిఫారసు చేశారు. ఇద్దరూ గెలిచారు.

కానీ తరచూ తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు వివాదాస్పదంగా మారారు. సొంత పార్టీ శ్రేణులు సైతం ఆయనను వ్యతిరేకిస్తూ హై కమాండ్కు ఫిర్యాదు చేశాయి. ఈ తరుణంలో తిరువూరు సమన్వయ బాధ్యతలను కేసినేని చిన్నికి అప్పగించింది టిడిపి నాయకత్వం. అయితే తనను విస్మరించి మాజీమంత్రి జవహర్ ను తెరపైకి తెచ్చారని చిన్ని పై అనుమానం పెంచుకున్నారు శ్రీనివాసరావు. అప్పటినుంచి వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే కేవలం అక్కడ సమన్వయ బాధ్యతలను అప్పగిస్తే.. మరింత జఠిలం చేశారని ఎంపీ చిన్ని పై టిడిపి నాయకత్వం ఆగ్రహంగా ఉంది.కొద్ది రోజుల కిందట ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సంచలన ఆరోపణలు చేశారు. అసెంబ్లీ టికెట్ కోసం ఎంపీ చిన్ని తన వద్ద ఐదు కోట్లు డిమాండ్ చేశారని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అది మొదలు రచ్చ ప్రారంభం అయింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆ ఇద్దరూ టిడిపి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారు.

కొలికపూడికి ఇదే లాస్ట్ ఛాన్స్ అని ప్రచారం నడిచింది. అయితే క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరైన శ్రీనివాసరావు చంద్రబాబు పట్ల గౌరవ భావాన్ని ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు నడుచుకుంటానని చెప్పుకొచ్చారు. దీంతో ఈ వివాదం ముగిసిందని అంతా భావించారు. కానీ లోకేష్ ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ నిర్వహించారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. రాష్ట్రవ్యా ప్తంగా ఎమ్మెల్యేలు ప్రజా దర్బార్ నిర్వహించకపోవడంపై లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రజా దర్బార్ నిర్వహించారు. కానీ అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపీ కేశినేని చిన్ని ఫోటో లేదు. దీంతో ఎంపీ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కొలికపూడి సంకేతాలు ఇచ్చినట్లు అయింది.

# అభిషేక్ శర్మ వరల్డ్ రికార్డ్.. సూర్యను వెనక్కి నెట్టి సరికొత్త చరిత్ర




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరిగిన ఐదో టీ20 మ్యాచ్ లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ వరల్డ్ రికార్డ్ నెలకొల్పాడు. అతి తక్కువ బంతుల్లో అంతర్జాతీయ టీ20 ఫార్మాట్ లో (పూర్తి సభ్యత్వ దేశాల లిస్ట్ తీస్తే) 1000 పరుగులు పూర్తి చేసుకున్న బ్యాటర్ గా వరల్డ్ రికార్డ్ సృష్టించాడు. కేవలం 528 బంతుల్లోనే అభిషేక్ తన 1000 పరుగుల మార్క్ అందుకోవడం విశేషం. అంతకముందు ఈ రికార్డ్ టీమిండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ పేరిట ఉంది. నిన్నటివరకు ఫాస్టెస్ట్ 1000 పరుగుల మార్క్ ను సూర్య 573 బంతుల్లో పూర్తి చేసి అగ్ర స్థానంలో కొనసాగుతుంటే తాజాగా అభిషేక్ శర్మ ఈ రికార్డ్ బద్దలు కొట్టాడు.

అంతర్జాతీయ టీ20ల్లో బంతుల పరంగా ఫాస్టెస్ట్ 1,000 రన్స్ చేసిన ఆటగాళ్లు (పూర్తి సభ్య దేశాలు):

528 – అభిషేక్ శర్మ (భారతదేశం)
573 – సూర్యకుమార్ యాదవ్ (భారతదేశం)
599 – ఫిల్ సాల్ట్ (ఇంగ్లాండ్)
604 – గ్లెన్ మాక్స్వెల్ (ఆస్ట్రేలియా)

ఈ మ్యాచ్ కు ముందు 1000 పరుగుల మార్క్ కు 11 పరుగుల దూరంలో ఉన్న ఈ టీమిండియా ఓపెనర్ శనివారం (నవంబర్ 8) బ్రిస్బేన్ వేదికగా గబ్బాలో జరిగిన మ్యాచ్ లో 11 బంతుల్లోనే 23 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్ లో 1000 పరుగుల మార్క్ ను అందుకున్న అభిషేక్ అతి తక్కువ ఇన్నింగ్స్ ల్లో 1000 పరుగులు చేసిన ప్లేయర్ల లిస్ట్ లో ఐదో స్థానంలో నిలిచాడు. తొలి నాలుగు స్థానాల్లో వరుసగా డేవిడ్ మలాన్, కెండెల్ కడోవాకి, బాబర్ అజామ్, విరాట్ కోహ్లీ ఉన్నారు.

ప్రస్తుతం అంతర్జాత్యా టీ20ల్లో నెంబర్ వన్ ర్యాంక్ లో ఉన్న అభిషేక్ మరిన్ని రికార్డ్స్ బ్రేక్ చేయడం ఖాయంగా కనిపిస్తుంది.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. ఇండియా, ఆస్ట్రేలియా మధ్య ఐదో టీ20 వర్షం కారణంగా రద్దయింది. శనివారం (నవంబర్ 8) బ్రిస్బేన్ లోని గబ్బా వేదికగా ప్రారంభమైన ఈ మ్యాచ్ లో కేవలం 4.5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. వర్షం ఎంతసేపటికీ తగ్గకపోవడంతో మ్యాచ్ ను అంపైర్లు రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఐదో టీ20 రద్దు కావడంతో టీమిండియా 2-1 తేడాతో సిరీస్ గెలుచుకుంది. వికెట్ నష్టపోకుండా 4.5 ఓవర్లలో 52 పరుగులు చేసిన భారత జట్టు భారీ స్కోర్ పై కన్నేసింది. అయితే ఈ దశలో భారీ వర్షం కురవడంతో మ్యాచ్ ను ఆపేశారు. వర్షం ఇంతకీ తగ్గకపోవడంతో మ్యాచ్ ను రద్దు చేశారు. గిల్ 16 బంతుల్లో 29 పరుగులు.. అభిషేక్ శర్మ 13 బంతుల్లో 23 పరుగులు చేసి అజేయంగా నిలిచారు.

# దుమ్ములేపుతున్న జురెల్.. సౌతాఫ్రికా-ఏ పై రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీల మోత



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ ధృవ్ జురెల్ సెంచరీలతో హోరెత్తిస్తున్నాడు. సౌతాఫ్రికా-ఏ తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ లో రెండు ఇన్నింగ్స్ ల్లోనూ శతకాలతో చెలరేగాడు. శనివారం (నవంబర్ 8) మూడో రోజు ఆటలో భాగంగా రెండో ఇన్నింగ్స్ లో జురెల్ తన సెంచరీ మార్క్ అందుకున్నాడు. భారత జట్టు రెండు ఇన్నింగ్స్ ల్లో కష్టాల్లో ఉన్నప్పుడు జురెల్ తన సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. రెండో ఇన్నింగ్స్ లో 116 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన భారత జట్టును జురెల్ నిలబెట్టాడు. హర్ష దూబేతో కలిసి ఆరో వికెట్ కు 184 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టును పటిష్ట స్థితికి చేర్చాడు. ప్రస్తుతం జురెల్ 125 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. జురెల్ సెంచరీతో టీమిండియా రెండో ఇన్నింగ్స్ లో 6 వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది. రిషబ్ పంత్ (65), జురెల్ (126) క్రీజ్ లో ఉన్నారు. ప్రస్తుతం భారత్ 415 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అట ఒక రోజే మిగిలి ఉండడంతో ఇండియా-ఏ జట్టు రెండో ఇన్నింగ్స్ లో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసే అవకాశం ఉంది. జురెల్ బ్యాక్ టు బ్యాక్ సెంచరీలు చేయడంతో సౌతాఫ్రికాతో జరగబోయే తొలి టెస్ట్ లో భారత ప్లేయింగ్ 11 లో చోటు దాదాపు కన్ఫర్మ్ అయింది. సౌతాఫ్రికాతో నవంబర్ 14 నుంచి జరగబోయే తొలి టెస్టులో వికెట్ కీపర్ గా కాకుండా స్పెషలిస్ట్ బ్యాటర్ గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి.

**తొలి ఇన్నింగ్స్ లోనూ సెంచరీ:**

తొలి రోజు ఆటలో భాగంగా గురువారం (నవంబర్ 6) తొలి ఇన్నింగ్స్ లో సెంచరీతో అదరగొట్టాడు. జట్టు మొత్తం విఫలమైనా ఒక్కడే సెంచరీతో పోరాడి జట్టును ఆదుకున్నాడు. 175 బంతుల్లో 132 పరుగులు చేసి జట్టు మొత్తం స్కోర్ లో సగం పరుగులు చేశాడు. జురెల్ ఇన్నింగ్స్ తో తొలి ఇన్నింగ్స్ లో ఇండియా-ఏ 255 పరుగులకు ఆలౌటైంది. వెస్టిండీస్ తో జరిగిన టెస్ట్ సిరీస్ కు పంత్ గాయం కారణంగా అందుబాటులో లేకపోవడంతో జురెల్ తుది జట్టులో స్థానం సంపాదించి తనను తాను నిరూపించుకున్నాడు. పంత్ గాయం నుంచి కోలుకొని సౌతాఫ్రికా టెస్ట్ సిరీస్ కు ఎంపిక కావడంతో జురెల్ మరోసారి బెంచ్ కు పరిమితమనుకున్నారు. అయితే సూపర్ ఫామ్ లో ఉండడంతో జురెల్ మిడిల్ ఆర్డర్ లో బ్యాటింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఇంత ఘోరంగా ఓడిపోతారా: 6 ఓవర్ల మ్యాచ్‌లో 92 పరుగులతో ఓటమి.. భారత జట్టుకు నేపాల్ బిగ్ షాక్




**హైదరాబాద్ పెన్ పవర్:** హాంకాంగ్ సిక్సర్స్‌లో టీమిండియాకు నేపాల్ ఊహించని షాక్ ఇచ్చింది. ఆరు ఓవర్ల మ్యాచ్ లో ఏకంగా 92 పరుగుల తేడాతో భారత జట్టును చిత్తుగా ఓడించింది. శనివారం (నవంబర్ 8) జరిగిన ఈ మ్యాచ్ లో మొదట విఫలమైన భారత జట్టు.. ఆ తర్వాత బ్యాటింగ్ లోనూ పోరాడకుండానే చేతులెత్తేశారు. మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్ వికెట్ నష్టపోకుండా నిర్ణీత 6 ఓవర్లలో 137 పరుగులు చేసింది. 138 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన భారత జట్టు 3 ఓవర్లలోనే 45 పరుగులకు ఆలౌట్ అయింది. ఇప్పటికే ఈ టోర్నీ నుంచి నిష్క్రమించిన భారత జట్టు నేపాల్ చేతిలో ఘోరంగా ఓడిపోయింది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్ వికెట్ నష్టపోకుండా నిర్ణీత 6 ఓవర్లలో 137 పరుగులు చేసింది. ఓపెనర్లు సందీప్ జోరా 12 బంతుల్లోనే 47 పరుగులు చేసి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ రషీద్ ఖాన్ 17 బంతుల్లో 55 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో లోకేష్ బామ్ 7 బంతుల్లోనే 31 పరుగులు చేసి నెక్స్ట్ లెవల్ ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో ప్రతి ఒక్కరు ఓవర్ కు 18కి పైగా పరుగులు సమర్పించుకున్నారు. నేపాల్ జట్టు ఒక్క వికెట్ వికెట్ కూడా పడగొట్టలేకపోయారు. 138 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన భారత జట్టు నిర్ణీత 6 ఓవర్లు కూడా ఆడలేకేపోయింది. 3 ఓవర్లలోనే 45 పరుగులకు ఆలౌట్ అయింది. రాబిన్ ఉతప్ప 5 పరుగులే చేసి ఔట్ కావడంతో టీమిండియా కష్టాల్లో పడింది. కెప్టెన్ దినేష్ తన పేలవ ఫామ్ కొనసాగిస్తూ 7 పరుగులే చేసి నిరాశపరిచాడు. బిన్నీ డకౌట్ అయితే పంచల్ 12 పరుగులతో సరిపెట్టుకున్నాడు. దీంతో భారత జట్టుకు ఘోర ఓటమి తప్పలేదు. నేపాల్ బౌలర్ రషీద్ ఖాన్ ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసుకొని ఇండియాకు బిగ్ షాక్ ఇచ్చాడు.

# కృతిశెట్టి కెరీర్ ని మార్చే రిలీజ్ లతో!





టాలీవుడ్ లో కృతిశెట్టి కెరీర్ ఎలా సాగిందన్నది చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు అందం, అభినయంతో తిరుగులేని నాయికగా ఎదుగుతుందని భావించారు. కానీ సొగసరి కెరీర్ అందుకు భిన్నంగా సాగింది. తెలుగు అవకాశాలు తగ్గడంతో? తమిళ, మలయాళ చిత్రాలపై దృష్టి పెట్టింది. మాలీవుడ్ లో మాత్రం అమ్మడికి గ్రాండ్ లాంచింగ్ దక్కింది. గతేడాది రిలీజ్ అయిన %-%ఏఆర్ ఎమ్%-% తో మంచి విజయం అందుకుంది. ఆ సినిమా ఏకంగా అమ్మడిని 100 కోట్ల క్లబ్లో కూర్చోబెట్టింది. కానీ ఆ తర్వాత అక్కడే కొత్త అవకాశాలు అందుకోవడంలో మాత్రం వెనుకబడే ఉంది.

**హ్యాట్రిక్ స్టార్ సరసన!**

%-%ఏ ఆర్ ఎమ్%-% తర్వాత ఇంత వరకూ మళ్లీ మరో సినిమాకు సైన్ చేయలేదు. కోలీవుడ్ లో మాత్రం రెండు సినిమాలు చేస్తోంది. – కస్టడీ – తో తమిళ్ లో లాంచ్ అయినా? ఆశించిన ఫలితావ్వలేదు. దీంతో ఇదే ఏడాది – లవ్ ఇన్సురెన్స్ – చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతుంది. ఇందులో ప్రదీప్ రంగనాద్ కు జోడీగా నటిస్తోంది. నయనతార గెస్ట్ అప్పిరియన్స్ ఇస్తుండగా విగ్నేష్ శివన్ దర్శకత్వం వహిస్తోన్న చిత్రమిది. ప్రస్తుతం ప్రదీప్ రంగనాథ్ ఫుల్ ఫామ్ లో ఉన్నాడు. ఇప్పటికే విజయాలతో హ్యాట్రిక్ నమోదు చేసాడు.

**సక్సెస్ అయితే కొత్త ఛాన్సులు:**

తమిళ నటుడైనా తెలుగులోనే యువ హీరోకి మంచి ఫాలోయింగ్ ఉంది. యూత్ ఫుల్ కాన్సెప్ట్ లతో యువతకు బాగా రీచ్ అయ్యాడు. దీంతో ఈ సినిమాపై బేబమ్మ కూడా చాలా ఆశలు పెట్టుకుంది. ఈ సినిమా అమ్మడికి రెండు భాషల్లోనూ కలిసొచ్చే చిత్రం. తెలుగులో హిట్ అందుకుని చాలా కాలమవుతుంది. ఇక్కడ మళ్లీ నటిగా బిజీ అవ్వాలని ఆశపడుతుంది. గత సినిమా ఫలితాలు ఎలా ఉన్నా? ఈ సినిమాతో ఎలాగైనా హిట్ అందుకుని బిజీ నాయికగా మారాలని చూస్తోంది. సక్సెస్ అయితే కోలీవుడ్ లోనూ అమ్మడికి మంచి ప్రోత్సాహం లభిస్తుంది.

**స్టార్ లీగ్ లో ఛాన్స్ ఉందా:**

ఈ సినిమాతో పాటు కార్తీ సరసన %-%వా వాత్తయార్%-% లోనటిస్తోంది. ఈసినిమాపై కూడా అంచనాలు భారీగా ఉన్నాయి. అమ్మడి కిట్టీలో ఇదో బిగ్ ప్రాజెక్ట్ గా చెప్పొచ్చు. ఈ సినిమా విజయం సాధిస్తే అక్కడ స్టార్ హీరోలకు జోడీగా ఛాన్స్ వచ్చే అవకాశం ఉంది. ఆ రకంగా ఈ చిత్రం కూడా అమ్మడికి అక్కడ కీలకమనే చెప్పాలి. %-%లవ్ ఇన్సురెన్స్ – కంపెనీ %-%వా వాత్తయార్%-% వచ్చే నెలలోనే ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. ఏడాది ముగింపు వేళ అమ్మడికి ఈ రెండు సిని మాలు ఏ మేర కలిసొస్తాయి? అన్నది చూడాలి. అలాగే %-%జెన్నీ%-% అనే మరో తమిళ చిత్రంలోనూ నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com